గురువారం
5•9•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 71
• పేజీలు : 14 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

యూఎస్ ఓపెన్

ఫెదరర్ నిష్క్రమణ

- అన్‌సీడెడ్ చిమిత్రోవ్ చేతిలో అనూహ్య ఓటమి
- క్వార్టర్స్‌లోనే ముగిసిన పోరాటం
- సెమీస్‌లో సెరెనా విలియమ్స్
- వాంగ్‌క్వింగ్‌పై అలవోక విజయం
- యూఎస్ ఓపెన్‌లో వందో గెలుపు నమోదు

వివరాలు ఆటలో



రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కరచాలనం చేస్తున్న ప్రధాని మోదీ

జోక్యం సహించం

- ఏ దేశ వ్యవహారాల్లోనూ ఇతరులు వేలు పెట్టొద్దు
- భారత్-రష్యా వైఖరి ఇదే
- రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అనంతరం ప్రధాని మోదీ ఉద్ఘాటన
- ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2025 నాటికి 30 బిలియన్ డాలర్లకు పెంచాలని నిర్ణయం

5

దాడిలో లండన్‌లోని భారత ఎంబసీ అద్దాలు పగిలిన దృశ్యం

పాక్ మూకల దాడి

- లండన్‌లోని భారత ఎంబసీపై రాళ్లు, గుడ్లు, టమాటాలు, చెప్పులు, పాగ బాంబులు, సీసాలు
- ఆందోళనకారుల దుశ్చర్యను ఖండించిన భారత్
- దాడి గర్హనీయమన్న బ్రిటన్ విదేశాంగ మంత్రి డొమినిక్ రాబ్

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

అడవి ఆగమాగం!

యురేనియం తవ్వకాలపై రాష్ట్ర అటవీశాఖ అభ్యంతరాలు

గొలుసుకట్టు ప్రభావంతో పర్యావరణ పెను విధ్వంసం ■ కృష్ణానదీ జలాలకు ముప్పు ■ డిండి నీటికీ కాలుష్యం కాటు

బండి బాటలేదు.. చెట్టు కొట్టరాదు.. బోర్ డ్రిల్లింగ్ ఎలా సాధ్యం? ■ అటవీశాఖ గ్రౌండ్ రిపోర్ట్ ■ త్వరలో కేంద్రానికి మరో లేఖ!

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

నల్లమల అటవీప్రాంతంలో యురేనియం నిక్షేపాల తవ్వకాలతో పర్యావరణ పరంగా తీవ్ర పర్యవసానాలు ఎదురయ్యే అవకాశం ఉన్నదని అటవీశాఖ అధికారులు చెప్తున్నారు. యురేనియం నిక్షేపాల అన్వేషణ క్రమంలో నోటిఫైడ్ అటవీప్రాంతంలో నిర్వహించే బోర్ డ్రిల్లింగ్ (నమూనా సేకరణ) వల్ల సమీపంలోని సహజ అడవి దెబ్బతింటుందని పేర్కొంటున్నారు. చాలా చోట్ల బండిబాట కూడా లేదని, వాహనాలు వెళ్లేందుకు వీలుగా చెట్లు కొట్టడానికి కూడా వీలులేదని గుర్తుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో యురేనియం నిక్షేపాల నమూనా సేకరణకు బోర్ డ్రిల్లింగ్ ఎలా చేస్తారన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ డ్రిల్లింగ్ ప్రతిపాదనలపై 2013లోనే రాష్ట్ర అటవీశాఖ లేఖ రాయడంతో ఆనాడు ప్రతిపాదనలు పెండింగ్‌లో పడ్డాయి. తాజాగా మళ్లీ తవ్వకాల ప్రతిపాదన తెరపైకి వచ్చిన నేపథ్యంలో బోర్‌డ్రిల్లింగ్ వల్ల అభయారణ్యాన్ని ఆనుకుని ప్రవహించే కృష్ణానది సైతం విషతుల్యంగా మారే ప్రమాదమున్నదని కేంద్ర అటామిక్ మినరల్ డైరెక్టరేట్, యురేనియం కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్‌కు రాష్ట్ర అటవీశాఖ మరోసారి లేఖ రాయనున్నదని సమాచారం. ఇప్పటికే అధికారులు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, యురేనియం తవ్వకాల వల్ల

మిగతా 2వ పేజీలో

అమ్రాబాద్ అటవీప్రాంతం

తెలంగాణ అమెజాన్..
నల్లమల

దట్టమైన నల్లమల అభయారణ్యం.. పెద్ద ఎత్తున సహజ వనరులకు, ఔషధ సంపదకు నెలవుగా విలసిల్లుతున్నది. అంతేకాకుండా.. పెద్దపులులకు సురక్షిత స్థావరంగా ఉన్నది. ఒక రకంగా నల్లమల అడవిని తెలంగాణ అమెజాన్‌గా పిలుస్తారు. ఈ అటవీప్రాంతంలో యురేనియం నిక్షేపాలు సమృద్ధిగా ఉన్నాయని, వాటిని తవ్వి వెలికితీయాలని అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఈ నిక్షేపాల వల్ల కాలుష్యం లేని అణువిద్యుత్‌ను ఉత్పత్తి చేయడంతోపాటు

మిగతా 2వ పేజీలో

బుధవారం భారీ వర్షానికి మొలలోతు నిలిచిన నీటిలో ముంబైవాసులు

ముంబైని ముంచెత్తిన వాన

స్తంభించిన జనజీవనం

- నిలిచిపోయిన రైళ్లు, విమానాల రాకపోకలు
- ముంబై చుట్టుపక్కల జిల్లాల్లోనూ భారీ వర్షం
- రెడ్‌అలర్ట్ జారీచేసిన ఐఎండీ

5

బుధవారం పంజాబ్‌లోని గుర్దాస్‌పూర్ జిల్లా బటాలాలో పేలుడుధాటికి కుప్పకూలిన పటాకుల ఫ్యాక్టరీ

పటాకుల ఫ్యాక్టరీలో భారీ పేలుడు

23 మంది మృతి
27 మందికి గాయాలు
పంజాబ్‌లోని బటాలాలో ఘోరం

5

చందమామ సమీపానికి..

విజయవంతంగా
విక్రమ్ ల్యాండర్ కక్ష్య కుదింపు
నిర్దేశిత చివరి కక్ష్యలోకి
చేరుకున్న వ్యోమనౌక
శనివారం చంద్రుడి ఉపరితలంపై
దిగేందుకు సిద్ధం

III

చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)

ఫారం ధర	62.00	రిటైల్ లైవ్	84.00
డ్రెస్డ్	122.00	స్కిన్‌లెస్	139.00

గుడ్ల ధరలు (వందకు) (రూ.)

హైదరాబాద్	315.00	రంగారెడ్డి	315.00
మెదక్	315.00	కరీంనగర్	318.00
వరంగల్	318.00	చిల్లర ధర	3.75

హోరెత్తుతున్న కృష్ణమ్మ

- నారాయణపుర నుంచి 1.13 లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో
- నేడు జూరాలకు భారీగా పెరుగనున్న ఇన్‌ఫ్లో
- తుంగభద్ర 10 గేట్లు ఎత్తివేత.. 22 వేల క్యూసెక్కులు దిగువకు
- శ్రీరాజరాజేశ్వర నుంచి కొనసాగుతున్న నీటివిడుదల
- ఎస్సారెస్పీకి స్వల్పంగా వరద
- భద్రాచలం వద్ద 29 అడుగులకు గోదావరి

బుధవారం నారాయణపుర గేట్ల ద్వారా జూరాలకు పరుగులు పెడుతున్న కృష్ణమ్మ

3

పెరిగిన వరిసాగు

- సాధారణ సాగు విస్తీర్ణం 24.11 లక్షల ఎకరాలు
- ప్రస్తుతం సాగవుతున్నది 26.79 లక్షల ఎకరాలు
- సాధారణంకంటే పెరిగిన పత్తి సాగు విస్తీర్ణం
- కోటి ఎకరాలు దాటిన అన్ని పంటల సాగు
- కలిసొచ్చిన రుతుపవనాలు.. భారీ వర్షాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో వానకాలం పంటల సాగు కోటి ఎకరాలు దాటింది. వానకాలంలో అన్ని పంటల సాగు సాధారణ విస్తీర్ణం 1.08 కోట్ల ఎకరాలు కాగా, బుధవారంనాటికే 1.02 కోట్ల ఎకరాలకు చేరిందని వ్యవసాయశాఖ తాజా నివేదికలో వెల్లడించింది. రుతుపవనాలు చురుకుగా ఉండటం, రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు గణనీయంగా కురవడంతో ఈ ఏడాది రికార్డుస్థాయిలో వరినాట్లు పడ్డాయి. వానకాలంలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 24.11 లక్షల ఎకరాలు కాగా, ఏకంగా 26.79 లక్షల ఎకరాలు సాగుకావడం గమనార్హం. పత్తి సాగు విస్తీర్ణం కూడా సాధారణం కంటే పెరిగింది. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 43.12 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు ఏకంగా 45.32 లక్షలకు చేరడం విశేషం. మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 12.52 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 9.46 లక్షల ఎకరాలకు చేరింది. పప్పుధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 10.37 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 9.18 లక్షల ఎకరాలు సాగైంది. సోయాబీన్ సాధారణ సాగు విస్తీర్ణం 5.25 లక్షల ఎకరాలు కాగా ఇప్పటివరకు 4.30 లక్షల ఎకరాల్లో సాగైంది.

11 జిల్లాల్లో వందశాతం

రాష్ట్రవ్యాప్తంగా 11 జిల్లాల్లో వందశాతంపైగా విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. అందులో నారాయణపేట, మంచిర్యాల జిల్లాల్లో ఏకంగా 122 శాతం చొప్పున విస్తీర్ణంలో పంటలు సాగుకావడం గమనార్హం. నిర్మల్ జిల్లాలో 116%, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 113% విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. ఒక్క ఖమ్మం జిల్లాలో మాత్రం అత్యంత తక్కువగా 80 శాతం విస్తీర్ణంలోనే పంటలు

మిగతా 6వ పేజీలో



మసూద్ అజర్



హఫీజ్ మహ్మద్ సయీద్

జకీర్ ఉర్ రహ్మాన్ లఖ్వీ

దావూద్ ఇబ్రహీం

వీరు ఉగ్రవాదులు

అజర్, సయీద్, లఖ్వీ, దావూద్‌ల పేర్లు ప్రకటించిన కేంద్ర హోంశాఖ

సవరణ అనంతరం యూఏపీఏను తొలిసారిగా ప్రయోగించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:

యూఏపీఏ (చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం)ను సవరించిన తర్వాత కేంద్ర ప్రభుత్వం మొట్టమొదటిసారిగా దానిని ప్రయోగించింది. జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ అధిపతి మసూద్ అజర్, లష్కరే తాయిబా ఉగ్ర సంస్థ వ్యవస్థాపకుడు హఫీజ్ మహ్మద్ సయీద్, లష్కరే కమాండర్, ముంబై దాడుల సూత్రధారి జకీర్ ఉర్ రహ్మాన్ లఖ్వీ, మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీంలను ఉగ్రవాదులుగా కేంద్ర హోంమంత్రిత్వశాఖ ప్రకటించింది. వీరు తరచూ ఉగ్రకార్యకలాపాలకు పాల్పడిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్టు వెల్లడించింది. ఈ మేరకు బుధవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. పాకిస్థాన్‌కు చెందిన మౌలానా మసూద్ అజర్ పలు ఉగ్రదాడులకు నేతృత్వం వహించినట్టు కేంద్రం తెలిపింది. ప్రధానంగా 2001లో పార్లమెంట్‌పై, కశ్మీర్ అసెంబ్లీపై దాడులు, 2016లో పఠాన్‌కోట్ వైమానిక స్థావరంపై, 2017లో శ్రీనగర్‌లోని బీఎస్ఎఫ్ బేస్‌క్యాంప్‌పై, ఈ ఏడాది ఫిబ్రవరి 14న పుల్వామాలో సీఆర్పీఎఫ్ కాన్వాయ్‌పై దాడులు చేసినట్టు వెల్లడించింది. మసూద్‌ను ఇప్పటికే ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ ఉగ్రవాదిగా

మిగతా 5వ పేజీలో

• నేడు గురుపూజోత్సవం

ఉత్తమ టీచర్ల ఎంపిక

ఉత్తర్వులు విడుదలచేసిన విద్యాశాఖ

నేడు రవీంద్రభారతిలో ఘనసత్కారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాను ప్రకటించింది. పాఠశాల విద్య నుంచి 43 మంది, జూనియర్ కాలేజీల నుంచి 10 మంది, ఎయిడెడ్ కాలేజీల నుంచి ఐదుగురు, డిగ్రీ కాలేజీల నుంచి 14 మంది, విశ్వవిద్యాలయాల నుంచి 30 మంది ఉన్నారు. ఈ మేరకు బుధవారం విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి వేర్వేరుగా ఉత్తర్వులు జారీచేశారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనవారికి గురువారం రవీంద్రభారతిలో ఉదయం 11 గంటలకు జరుగనున్న గురుపూజోత్సవంలో రూ.10 వేల నగదు, బంగారం పూత పూసిన వెండి పతకం, ప్రశంసాపత్రం అందించి శాలువాతో సత్కరించనున్నారు. ప్రతి ఏటా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి పురస్కారాలు అందజేస్తున్న విషయం తెలిసిందే.

గెజిటెడ్ హెడ్‌మాస్టర్లు: ఎం దత్తాత్రేయ శర్మ (తూప్రాన్), కే గంగాధర్ (చౌటుపల్లి, నిజామాబాద్), ఏ శైలా (ఏన్కూర్, ఖమ్మం),

మిగతా 2వ పేజీలో

రెవెన్యూకు మోఖా దొరికింది!

రికార్డుల ప్రక్షాళనలో కొత్త సమస్యను సృష్టించిన అధికారులు
వివాదంలోకి ఇరవై ఎకరాల భూమి
ఊళ్లో లేనందుకు సాదాబైనామా అంటూ పెండింగ్‌లోకి
'ధర్మగంట'ను ఆశ్రయించిన ములుగు జిల్లావాసి ప్రమోద్‌కుమార్

6

ధర్మగంట

పాత పాస్‌పుస్తకం చూపుతున్న బాధిత రైతు ప్రమోద్‌కుమార్

ప్రశాంతంగా ఉన్న రైతుల జీవితాల్లో కల్లోలం సృష్టించడం రెవెన్యూశాఖకే చెల్లుతుంది. పిల్లలకు మంచి చదువులు చెప్పించుకోవడంకోసం హైదరాబాద్‌కు వలస వెళ్లిన పాపానికి ఓ రైతుకు చెందిన ఇరవై ఎకరాలను వివాదాస్పదం చేసిన ఘనత రెవెన్యూ అధికారులది. భూమి సమస్యల శాశ్వత పరిష్కారానికి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రికార్డుల ప్రక్షాళన చేపట్టగా.. అధికారులు ఆ రికార్డుల ప్రక్షాళనను సదరు రైతు పాలిట శాపంగా మార్చారు. అప్పటిదాకా ఎలాంటి సమస్య లేని భూమికి కొత్త సమస్యలను తెచ్చిపెట్టారు. సాదాబైనామా కేసుగా చూపిస్తూ కొత్త పాస్‌పుస్తకం ఇవ్వకుండా సతాయిస్తున్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలానికి చెందిన ప్రమోద్‌కుమార్ తనకు న్యాయం చేయాలంటూ 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

epaper.ntnews.com

వికారాబాద్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలుపడంపై బుధవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, టీఆర్ఎస్ యూత్ ప్రధాన కార్యదర్శి శుభప్రద్ పటేల్



ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న డాక్టర్ వీ లక్ష్మారెడ్డి

సీఎంను కలిసిన లక్ష్మారెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పశు సంవర్ధకశాఖ డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్ వీ లక్ష్మారెడ్డి బుధవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పశుసంవర్ధకశాఖను అభివృద్ధి చేయడానికి అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సీఎం సూచించారు.

ఆర్థికసంఘం నిధులు రూ.339 కోట్లు విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామపంచాయతీలకు 14వ ఆర్థికసంఘం నిధులు రూ.339 కోట్లు విడుదలయ్యాయి. 2019-20 సంవత్సరానికిగాను బేసిక్ గ్రాంట్ల మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ కింద రూ.339 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులిచ్చినట్టు 14వ ఆర్థికసంఘం అధికారులు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలకు 14వ ఆర్థికసంఘం బేసిక్‌గ్రాంట్ మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ కింద.. 2011 జనాభా లెక్కలకు అనుగుణంగా 32 జిల్లాల్లోని 2.03 కోట్లమందికి రూ.203 కోట్లు, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ బేసిక్ గ్రాంట్ల కింద రూ.136 కోట్లు కేటాయించారు. ప్రతినెల ఐదోతేదీకల్లా ప్రగతినివేదికలను సమర్పించాలని డీపీవోలను పీఆర్ కమిషనర్ రఘునందన్‌రావు ఆదేశించారు. ఆర్థికసంఘం నిధుల వినియోగానికి సంబంధించిన వివరాలను ఇందులో పొందుపర్చామని బుధవారం వెలువరించిన మెమోరాండంలో పేర్కొన్నారు. 14వ ఆర్థికసంఘం, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా నిధులను వినియోగించాలని సూచించారు. తదుపరి విడుదలయ్యే గ్రాంట్లను 2011 జనాభా, గ్రామపంచాయతీలు సిద్ధంచేసే కార్యాచరణ ప్రణాళికకు అనుగుణంగా పంపిణీ చేయాలన్నారు.

తమిళిసై

నరసింహన్

బండారు దత్తాత్రేయ

8న రాష్ట్ర గవర్నర్‌గా తమిళిసై ప్రమాణం

- 7న బాధ్యతల నుంచి వైదొలగనున్న నరసింహన్
- 11న హిమాచల్ గవర్నర్‌గా దత్తాత్రేయ ప్రమాణం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రానికి కొత్త గవర్నర్‌గా నియమితులైన డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ ఈ నెల 8న రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయనున్నారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్ర సింగ్ చౌహాన్ ఆదివారం ఉదయం 11 గంటలకు తమిళిసైతో ప్రమాణం చేయిస్తారని రాజ్‌భవన్‌వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుతోపాటు మంత్రులు, ఇతర ఉన్నతాధికారులు హాజరవుతారని రాజ్‌భవన్ అధికారులు తెలిపారు. ప్రస్తుత గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ ఈ నెల 7వ తేదీన బాధ్యతల నుంచి వైదొలుగుతారని సమాచారం. నరసింహన్ స్థానంలో తమిళిసై రాష్ట్ర తొలిమహిళా గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు రాజ్‌భవన్‌లో ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి.

గవర్నర్ నియామకంపై గెజిట్

రాష్ట్ర నూతన గవర్నర్‌గా తమిళిసై సౌందరరాజన్ నియామకానికి గెజిట్ నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదలచేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రపతి జారీ చేసిన నియామక ఉత్తర్వులకు అనుగుణంగా నోటిఫికేషన్‌ను వెలువరించారు.

11న దత్తాత్రేయ ప్రమాణం

హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్‌గా బీజేపీ సీనియర్ నేత బండారు దత్తాత్రేయ ఈ నెల 11వ తేదీన ప్రమాణం చేయనున్నారు. అంతకుముందు ఆయన 9వ తేదీన ఢిల్లీ వెళ్లి.. పార్టీ నాయకులతోపాటు కేంద్రప్రభుత్వ పెద్దలను కలుస్తారు. అక్కడినుంచి పదో తేదీన హిమాచల్‌ప్రదేశ్ రాజధాని సిమ్లాకు వెళ్తారు. 11వ తేదీ ఉదయం పది గంటలకు సిమ్లాలోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌గా ప్రమాణం చేస్తారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన కుటుంబసభ్యులు, సన్నిహితులు హాజరవుతారు.

అడవి ఆగమాగం!

మొదటిపేజీ తరువాయి...

జీవనది కృష్ణా, డిండి ప్రాజెక్ట్ ద్వారా కృష్ణానదికి వెళుతున్న నీటికి కూడా కాలుష్యం ముప్పు ఉందని గుర్తించారు. డ్రిల్లింగ్‌కు కూడా అటవీ సంరక్షణ చట్టం కింద అనుమతి తీసుకోవాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు.

400 పాయింట్లలో బోర్ డ్రిల్లింగ్

యురేనియం నిక్షేపాల నమూనాలు తవ్వితీసేందుకు ఉడిమిల్ల, పాద్రా, నాగార్జునసాగర్ డివిజన్‌లోని 83 చదరపు కిలోమీటర్ల పరిధిలో దాదాపు 400 చోట్ల బోర్‌డ్రిల్లింగ్‌కు అనుమతి నివ్వాలని ఏప్రిల్‌లో రాష్ట్ర అటవీశాఖను యురేనియం కార్పొరేషన్ కోరింది. అయితే దీనికి అటవీశాఖ.. వాహనాలు లేకుండా బండిబాట లోనే వెళ్లాలని, సూర్యాస్తమయంలోపు డ్రిల్లింగ్ ఉండాలని, పెద్ద వాహనాలను అనుమతించేది లేదని పలురకాల షరతులు విధించింది. తొలుత బండిబాటకే అంగీకరించిన యురేనియం కార్పొరేషన్ అధికారులు.. కొన్ని వాహనాలను తీసుకువచ్చి, చడీచప్పుడు లేకుండా చక్రాలపై డ్రిల్లింగ్ యంత్రాలను తోసుకుపోతామని ప్రతిపాదించారు. దీనికి తాజాగా అభ్యంతరం వ్యక్తంచేసిన రాష్ట్ర అటవీశాఖ.. డ్రిల్లింగ్ మిషన్లను భుజాన మోసుకుని తీసుకుపోవాలి తప్ప.. ఎలాంటి పెద్ద వాహనాలను అనుమతించేదిలేదని తేల్చిచెప్పింది. ఇదే సమయంలో అసలు డ్రిల్లింగ్‌కు ఎన్నిచోట్ల అవకాశం ఉన్నదో తెలియజేయాలని అచ్చంపేట, నాగార్జునసాగర్ డివిజన్ ఫారెస్ట్ అధికారులను అటవీశాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ మేరకు వారు క్షేత్రస్థాయిలో అధ్యయనంచేసి, 30 నుంచి 40 ప్రాంతాల్లో మాత్రమే బండిబాట ఉన్నదని, మిగతాచోట్ల మనుషులు పోవడానికి మాత్రమే వీలున్నదని స్పష్టంచేశారు. ప్రస్తుతం ఎక్కడ బోర్లువేసినా వాటి ప్రభావం గొలుసుకట్టుగా (క్యాస్కేడింగ్ ఎఫెక్ట్) ఉంటుందని, పర్యావరణం విధ్వంసమవుతుందని చెప్పారు.

పెద్దపులుల మనుగడకూ ముప్పే!

ప్రస్తుతం బోర్‌డ్రిల్లింగ్ చేయతలపెట్టిన ప్రాంతాలు పెద్దపులులు తిరిగే కోర్ ఏరియాగా పేర్కొంటున్నారు. డ్రిల్లింగ్ చేస్తే పెద్దపులుల మనుగడకు కూడా ప్రమాదమేనని చెప్తున్నారు. వాస్తవానికి డ్రిల్లింగ్ చేయతలపెట్టిన ప్రాంతాలు కృష్ణానది, డిండి ప్రాజెక్ట్ కాల్వలకు ఆనుకుని ఉంటాయని, దీనివల్ల ఆ నీరు కలుషితమయ్యే ప్రమాదమున్నదని ప్రాథమిక నివేదికలో స్పష్టం చేశారని తెలిసింది. నోటిఫైడ్ అటవీప్రాంతంలో బోర్‌డ్రిల్లింగ్ వల్ల సహజ అడవి దెబ్బతింటుందని, ఈ కారణంగా ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్ట్ కింద అనుమతి తీసుకోవాల్సిందేనని అటవీశాఖ అధికారులు స్పష్టంచేస్తున్నారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో అధ్యయనం జరుగుతున్నదని, త్వరలోనే పూర్తిస్థాయి నివేదికను కేంద్రానికి లేఖ ద్వారా పంపిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

ముహూర్తం

సూర్యోదయం: 6.06 గంటలకు

సూర్యాస్తమయం: 6.23 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం సప్తమి రాత్రి 8.51 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం: అనురాధ, అమృతఘడియలు: సాయంత్రం 5.45 నుంచి రాత్రి 7.21 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.47 నుంచి 3.19 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.07 నుంచి సాయంత్రం 4.45 వరకు, వర్జ్యం: ఉదయం 8.08 నుంచి 9.44 వరకు.

సైకిళ్ల నిర్మాణానికి కేంద్రం అడ్డు

రక్షణశాఖ పరిమితుల వల్లే అభివృద్ధి పనుల్లో జాప్యం

డిఫెన్స్ హాస్పిటల్ అప్పగింతపై మళ్లీ లేఖ రాయిస్తాం

- కంటోన్మెంట్ ఎన్నికల్లో టీఆర్ఎస్ విజయం ఖాయం
- టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు
- కంటోన్మెంట్ బోర్డు టీఆర్ఎస్ నేతలతో సమీక్ష

తెలంగాణభవన్‌లో కంటోన్మెంట్ టీఆర్ఎస్ నేతలతో చర్చిస్తున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.చిత్రంలో ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే సాయన్న, మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కంటోన్మెంట్ బోర్డు, రక్షణశాఖ పరిమితుల వల్ల స్థానికంగా అభివృద్ధి ప్రణాళికలను మరింత వేగంగా ముందుకు తీసుకువెళ్లలేకపోతున్నట్టు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న స్కైవేల నిర్మాణంకోసం ఇప్పటికే అనేకసార్లు తమ పార్టీకి చెందిన మంత్రులు, పార్లమెంట్ సభ్యులు కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తిచేసినా స్పందన లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ అనుమతులు వస్తే హైదరాబాద్ నగర, ముఖ్యంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రజల ట్రాఫిక్ ఇబ్బందులు తొలిగించే కీలకమైన స్కైవేల నిర్మాణం ముందుకు సాగుతుందని చెప్పారు. బుధవారం తెలంగాణభవన్‌లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్నతోపాటు బోర్డు మెంబర్లతో కేటీఆర్ సమావేశమయ్యారు. రానున్న కంటోన్మెంట్ ఎన్నికల్లో పార్టీ విజయం, దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలపై చర్చించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటినుంచి కంటోన్మెంట్ ప్రజల అభివృద్ధికోసం అనేక కార్యక్రమాలను చేపట్టిందన్న కేటీఆర్.. రానున్న బోర్డు ఎన్నికల్లో టీఆర్ఎస్ కచ్చితంగా ఘనవిజయం సాధిస్తుందనే నమ్మకాన్ని వ్యక్తంచేశారు. రక్షణశాఖ నిర్ణయాల్లో ఆలస్యంతో కంటోన్మెంట్ సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయని బోర్డు సభ్యులు కేటీఆర్ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను కంటోన్మెంట్ బోర్డు నుంచి సరైన సహకారం లభించడంలేదన్నారు. కంటోన్మెంట్‌లోని డిఫెన్స్ హాస్పిటల్‌ను వంద పడకల దవాఖానగా విస్తరించి, పేదలకు మరిన్ని వైద్యసేవలు అందించేందుకు చేస్తున్న ప్రయత్నాలు సైతం ముందుకు పోవడంలేదన్నారు. దవాఖానను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాల్సిందిగా కంటోన్మెంట్ బోర్డుతో చర్చలు జరిపినా.. వారు అందుకు నిరాకరిస్తున్నారని చెప్పారు. డిఫెన్స్ హాస్పిటల్‌ను తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించాల్సిందిగా మరోసారి ఉత్తరం రాయాల్సిందిగా వైద్యశాఖ మంత్రి ఈటల రాజేందర్‌ను కోరుతామని కేటీఆర్ బోర్డు సభ్యులకు తెలిపారు. రామన్నకుంట చెరువులోకి మురికినీరు రాకుండా డైవర్షన్ పైప్‌లైన నిర్మాణానికి పురపాలకశాఖ రూ.2.50కోట్లతో ప్రణాళికలు సిద్ధంచేసిందని, ఒకట్రెండురోజుల్లో అనుమతులు ఇచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. పార్టీపరంగా క్షేత్రస్థాయిలో టీఆర్ఎస్ చాలా బలంగా ఉన్నదని టీఆర్ఎస్ కంటోన్మెంట్ బోర్డు సభ్యులు కేటీఆర్‌కు తెలిపారు. ఎన్నికలు పార్టీ గుర్తుతో జరిగితే మరింత మెజారిటీతో విజయం ఖాయమన్నారు. పార్టీ గుర్తుతో ఎన్నికలు నిర్వహించడంపై టీఆర్ఎస్ తరుపున రక్షణశాఖకు లేఖరాస్తే బాగుంటుందని స్థానిక ఎమ్మెల్యే సాయన్న సూచించారు. పార్టీరహితంగా ఎన్నికలు జరిగినా పార్టీ ప్యానెల్ కచ్చితంగా విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు. సమావేశంలో మల్కాజ్‌గిరి పార్టీ నేత మర్రి రాజశేఖర్‌రెడ్డిపాటు కంటోన్మెంట్ టీఆర్ఎస్ బోర్డు సభ్యులు, కార్పొరేటర్ లాస్యనందిత, టీఎస్‌టీఎస్ చైర్మన్ చిరుమల్ల రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన పలువురు నాయకులు

తెలంగాణభవన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యేలు జోగు రామన్న, రెడ్యానాయక్, బాల్క సుమన్, ఆళ్ల వెంకటేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రావు, కోనేరు కోనప్ప, వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీలు గుత్తా సుఖేందర్‌రెడ్డి, సత్యవతి రాథోడ్ తదితరులు కలిశారు.

గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి నిధులు

- ప్రతిపాదనలను అంగీకరించిన కేంద్రం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి ఆర్థిక భరోసా లభించింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మొత్తం రెండువేల కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి రూ.2000 కోట్లు అవసరమవుతాయని కేంద్రానికి అంచనాలు పంపగా.. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) కింద తమవంతు నిధులు విడుదల చేసేందుకు కేంద్రం అంగీకరించింది. మొత్తం అంచనాల్లో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం భరించాల్సి ఉన్నది. కేంద్ర వాటా నిధులు మొత్తం 5 ఏండ్లకాలంలో ఇవ్వనున్నది.

తెలంగాణ అమెజాన్.. నల్లమల

మొదటిపేజీ తరువాయి...

దేశరక్షణకు సంబంధించి అణు అవసరాలకు పరోక్షంగా వాడవచ్చన్నది నివేదిక సారాంశం. ఇందుకు కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ 2003లోనే పచ్చజెండా ఊపింది. ఉమ్మడి రాష్ట్రంలోని 'రాజీవ్‌గాంధీ శ్రీశైలం-నాగార్జునసాగర్ టైగర్ రిజర్వ్' పరిధిలోని పెద్దగట్టు, శేరిపల్లి ప్రాంతాలలో నిక్షేపాల సర్వేకోసం కాలుష్య నియంత్రణమండలి పబ్లిక్ హియరింగ్ కూడా నిర్వహించగా.. ప్రజల నుంచి ప్రతిఘటన ఎదురైంది. అయినప్పటికీ 2008, 2009లో నాగార్జునసాగర్ అటవీ డివిజన్‌లో కొన్నిచోట్ల బోర్‌డ్రిల్లింగ్ జరిపి సర్వే చేశారు. కానీ అక్కడ దొరికిన నిక్షేపాలు అంత నాణ్యతతో లేవని వదిలేశారు. అయితే.. దానికి సమీపంలోని తెలంగాణలోని అమ్రాబాద్ డివిజన్ పరిధిలోని ఉడిమిల్ల, పాద్రా, నాగార్జునసాగర్ డివిజన్‌లోని నారాయణపురం మధ్య ఉత్తమ నాణ్యతతో కూడిన యురేనియం నిక్షేపాలుండే అవకాశమున్నదని తమ ప్రాథమిక సర్వేలో తేలినట్లు యురేనియం కార్పొరేషన్ 2013లో నివేదికనిచ్చింది. ఆ తర్వాత కేంద్రం రాష్ట్ర అటవీశాఖకు లేఖ రాయడం, అక్కడి ఇబ్బందులను రాష్ట్ర అటవీశాఖ తెలుపడంతో ఆ ప్రతిపాదన పెండింగ్‌లో పడింది. దేశ ప్రయోజనాల దృష్ట్యా యురేనియం నిక్షేపాలను వెలికితీయడం అత్యవసరమని ఇటీవల యురేనియం కార్పొరేషన్ కేంద్రానికి తెలిపింది. ఈ క్రమంలో మళ్లీ నల్లమలలో యురేనియం నిక్షేపాల తవ్వకాల ప్రతిపాదన తెరపైకి వచ్చింది.

సిరిసిల్ల దవాఖాన టాప్

జాతీయస్థాయిలో మొదటి ర్యాంకు.. నాణ్యతా ప్రమాణాల్లో 94% మార్కులు

- కేటీఆర్ ప్రత్యేక చొరవతో మెరుగైన వైద్యసేవలు
- జాతీయ ర్యాంకుతో రూ.48 లక్షలు ప్రోత్సాహకం

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

రోగులకు నాణ్యతా ప్రమాణాలతో వైద్యసేవలందిస్తున్న సిరిసిల్ల జిల్లాదవాఖానకు జాతీయస్థాయిలో మొదటిర్యాంకు లభించింది. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా జూలైలో కేంద్రబృందం నిర్వహించిన నాణ్యతాప్రమాణాల సర్వేలో రాష్ట్రస్థాయిలో నాలుగు జిల్లాలకు చోటుదక్కగా, అందులో రాజన్న సిరిసిల్ల జిల్లాదవాఖాన 94% మార్కులతో ప్రథమస్థానం సాధించింది. ఇందుకుగాను స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా రూ.10 లక్షలు, 'లక్ష్య' పథకం కింద మరో రూ.6 లక్షలచొప్పున మూడేండ్లపాటు మొత్తం రూ.48 లక్షల ప్రోత్సాహకం లభించనున్నది. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా జూలై 3, 4, 5 తేదీల్లో కేంద్రబృందాలు దేశవ్యాప్తంగా పర్యటించాయి. సర్కారు వైద్యశాలల్లో రోగులకు అందిస్తున్న సేవలు, శుభ్రత, నాణ్యత ప్రమాణాలను 15 విభాగాలను పరిశీలించి మార్కులు వేశాయి. ఈ క్రమంలో ఐదుగురు సభ్యుల కేంద్ర బృందం సిరిసిల్లలోని వంద పడకల దవాఖానలోని 15 విభాగాలను మూడురోజులపాటు పరిశీలించింది. సర్వీస్ ప్రొవిజన్, పేషంట్ హక్కులు, ఇన్‌పుట్స్, సపోర్ట్ సర్వీసెస్, క్లినికల్ సర్వీసెస్, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ క్వాలిటీ మేనేజ్‌మెంట్, ఔట్‌కం విభాగాలను బృందం ప్రత్యక్షంగా పరిశీలించింది. ఆయా విభాగాలకు 94% మార్కులు వేయడంతో సిరిసిల్ల దవాఖాన జాతీయస్థాయిలో నంబర్ వన్ స్థానం సాధించింది.

కేటీఆర్ చొరవతో మెరుగైన వైద్యసేవలు

కార్మికక్షేత్రమైన రాజన్న సిరిసిల్ల జిల్లాలో అధికశాతం నేత కార్మికులు, భవన నిర్మాణరంగ కార్మికులు ఉన్నారు. అంతా పేదలు కావడంతో మెరుగైన వైద్యంకోసం ప్రైవేటు దవాఖానలకు వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. కిడ్నీ వ్యాధిగ్రస్థులు కూడా ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. రోగుల కోరికమేరకు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కే తారకరామారావు చొరవచేసి.. కోట్లు ఖర్చు పెట్టి డయాలసిస్, వెంటిలేటర్, బ్లడ్‌బ్యాంకు, మాతాశిశు కేంద్రాలను ఏర్పాటుచేయడం వల్ల ఔట్‌పేషంట్ విభాగంలో రోగుల సంఖ్య బాగా పెరిగింది. కేసీఆర్ కిట్లతో ప్రసవాల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. నెలకు కనీసం 120 ప్రసవాలు అవుతున్నాయి. కిడ్నీ వ్యాధిగ్రస్థులంతా వరంగల్, హైదరాబాద్‌లాంటి ప్రాంతాలకు చికిత్స కోసం వెళ్లాల్సిన ఇబ్బంది తప్పింది. లక్షల విలువచేసే వైద్యసేవలు ఇక్కడ ఉచితంగా అందిస్తున్నారు. నర్సింగ్ కళాశాల కూడా మంజూరు చేయించారు. స్వచ్ఛత విషయంలోనూ ప్రధాన వైద్యశాలకు మంచి మార్కులు వచ్చాయి.

కేటీఆర్ మార్గదర్శకత్వంలో..

నాణ్యతా ప్రమాణాలలో జిల్లావైద్యశాలకు జాతీయ గుర్తింపురావడం సంతోషంగా ఉన్నది. సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మార్గదర్శకత్వంలో వైద్యశాలలో మెరుగైన వైద్యసేవలందిస్తున్నం. హాస్పిటల్‌లో మౌలికవసతులతోపాటు కార్పొరేట్‌కు దీటుగా డయాలసిస్, వెంటిలేటర్, బ్లడ్‌బ్యాంకు ఏర్పాటుచేయించారు. త్వరలో సీటీస్కాన్ కూడా ఏర్పాటుచేయిస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. ఆయన చొరవతో వైద్యశాలలో రోగులందరికీ మంచి సేవలందించే ప్రయత్నం చేస్తున్నం. దేశంలో మొదటిర్యాంకులో జిల్లాదవాఖాన నిలువడంలో సహకరించిన కేటీఆర్‌కు, తోటి వైద్యులు, సిబ్బంది, ప్రజలందరికీ కృతజ్ఞతలు.

- డాక్టర్ తిరుపతి, వైద్యశాల సూపరింటెండెంట్

మంచి సౌలతులున్నయి

సిరిసిల్ల సర్కారు దవాఖాన మంచి సౌలతులున్నాయి. నా బిడ్డ శ్రీలతకు రెండో కాన్పుల బిడ్డ పుట్టింది. మొదటి కాన్పు గూడ గీన్నే చేపించిన. ప్రైవేటు దవాఖాన్ల కూడ గిట్ల సూత్తలేరు. ముంగటి లెక్క లేదు. కేసీఆర్ సార్ వచ్చినంక గీడ మంచి వసతులు కల్పించిండ్రు. కేసీఆర్ కిట్ ఇస్తుండ్రు. పుట్టిన బిడ్డలకు పైసలు గూడ ఇస్తుండ్రు.

- సావనపల్లి నర్సవ్వ, మల్లాపురం గ్రామం.

పైవేటు కన్న మంచిగున్నది

నా భార్య లావణ్యకు ఇక్కడే ప్రసవం చేపించిన. ముగ్గురు పిల్లల్లో పెద్దపాప వెన్నెల కరీంనగర్ సర్కారు దవాఖాన్ల పుట్టింది, రెండో పాప శ్రీహిత, ఇప్పుడు బాబు ఇదే దవాఖాన్ల పుట్టిండ్రు. వార్డు చాలా పరిశుభ్రంగా ఉంది. ఎప్పటికప్పుడు వైద్యులు తల్లి, బిడ్డను పరీక్షిస్తుండ్రు. కేటీఆర్ సార్ కృషితో మంచి వసతులు వచ్చినయి.

- గుల్లె జగన్, వైపని కార్మికుడు, సిరిసిల్ల

పైసా ఖర్చు లేదు

నా భార్య రమ్య మొదటి డెలివరీ ప్రైవేటు దవఖాన్ల చేపించినం. అప్పుడు రూ.30 వేలు పైనే ఖర్చు అయినయి. నాలుగురోజుల కిందరెండో డెలివరీ సిరిసిల్ల సర్కారు దవాఖాన్ల చేపించిన. పాప పుట్టింది. తల్లి, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగ ఉన్నరు. పైసా ఖర్చు కాలేదు. ప్రైవేటు దవాఖానలకన్నా గీడనే మంచిగ చూస్తుండ్రు.

- పిట్టల జనార్దన్, చీర్లవంచ

లోకం పోకడ

మా మామది ఆంధ్రాబ్యాంకు, నాది యూనియన్ బ్యాంకు.. ఇప్పుడు మా మామ ఖాతా డబ్బులు నా ఖాతాలోకి విలీనం చేస్తారా?

ఉత్తమ టీచర్ల ఎంపిక

మొదటిపేజీ తరువాయి...

బీ పద్మాకర్ (ఓల్డ్ జగిత్యాల), బీ శ్రీనివాస్ (హయత్‌నగర్), ఎం వేణుగోపాల్ (రంగపేట, జగిత్యాల), ఎన్ మనోహర్‌స్వామి (శాయంపేట), కిషన్ (శ్రీసాయినగర్, మల్కాజిగిరి), ఎన్ శ్రీధర్‌రెడ్డి (లింబా, నిర్మల్), ఆర్ ఉదయ్‌రావు (ఇచ్చోడ).

స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు

ఎం అరుణ (బాలానగర్, మహబూబ్‌నగర్), డీజే డానియల్ (బోరబండ), టీ సతీశ్ (మర్పడగ, సిద్దిపేట), పొత్రు రామకృష్ణ (సదాశివపేట), బొమ్మ నగేశ్ (నాగవారిగూడెం, యాదాద్రి భువనగిరి), పీ మహేందర్‌రెడ్డి (శివానగర్, రాజన్న సిరిసిల్ల), ఎన్ అర్చన (రెబ్బనపల్లి, మంచిర్యాల), ఎస్ సుజాత (ఏన్కూర్, ఖమ్మం) పీ గంగామోహన్ (పల్లికొండ, నిజామాబాద్), సుందిల రమేశ్ (ఎర్రగుట్టపల్లి, మంచిర్యాల), కే సైదయ్య (గన్నవరం, ఖమ్మం), జీబీ బదరి నారాయణ (ఓల్డ్ మలక్‌పేట), జే సుదర్శన్ (దాత్నూర్, జగిత్యాల), పడల మోహన్‌రావు (లింగాపూర్, నిర్మల్), జీ శంకర్ (పోతారం, సిద్దిపేట), ఆర్ యాకయ్య (కోమటిపల్లి, మహబూబ్‌నగర్), ఆర్ మల్లిఖార్జున (రేగడిమైల్వార్, వికారాబాద్), బడేపల్లి వెంకటయ్య (వస్పుల, మహబూబ్‌నగర్), పీ బస్వంత్‌రావు (జుక్కల్, కామారెడ్డి), జీ కుశల్వరెడ్డి (కాసనగోడ్, నల్లగొండ), ఐ సుదర్శన్‌రావు (మాదన్నపురం, వనపర్తి), సీహెచ్ మల్లయ్య (చల్వాయి, ములుగు), కే సురేందర్‌ప్రసాద్ (పెద్దపల్లి), ఎల్ దేవరాజు (పాలవరం, సూర్యాపేట), కే రామయ్య (తాటికొండ, జనగామ), కే జగదీశ్వర్‌రెడ్డి (గర్షకుర్తి, కరీంనగర్), జీ రఘుపతిరావు (మల్యాల, రాజన్న సిరిసిల్ల), సీహెచ్ శ్రీనివాస్ (కట్టంగూర్, నల్లగొండ), టీ అజయ్‌సింగ్ (సమన్‌గుర్తి, వికారాబాద్), ఏ సాగర్ (న్యూ కాగజ్‌నగర్), సాదత్‌అలీ (ధర్మాజీపేట, సిద్దిపేట).

ఐఏఎస్ఈ/సీటీఈ/డైట్ లెక్చరర్లు

డాక్టర్ ఎస్ లియాఖత్‌అలీ (మహబూబాబాద్) ఎస్ మొండయ్య (కరీంనగర్).

జూనియర్ లెక్చరర్లు

ఎంఎస్ శ్యామలాదేవి (మాడుగుల, రంగారెడ్డి), గుండి రామానుజాచారి (యాదగిరిగుట్ట), కొల్లు గోవిందరాజు (గాంధారి), ఏ చెన్నయ్య (బాల్కొండ), ఆశాశర్మ (జనగామ), కే పర్వతాలు (రాజేంద్రనగర్), మహ్మద్ జహంగీర్ (మహబూబ్‌నగర్), మహ్మద్ ఇస్మాయిల్ (నల్లగొండ), ఫరీసా అస్మా (గోల్కొండ), ఎస్ పద్మావతి (మహేశ్వరం, రంగారెడ్డి).

ఎయిడెడ్ కాలేజీల లెక్చరర్లు

కే రాధిక (సెయింట్ ఆన్స్-ఓయూ), డాక్టర్ సిల్మానాయక్ (తెలంగాణ సారస్వత పరిషత్తు ఓరియంటల్ కాలేజీ-ఓయూ), డాక్టర్ పీ రాజ్యలక్ష్మి (ఏఎంఎస్ కాలేజీ-ఓయూ), డాక్టర్ ఆర్తిసింహా (సరోజినినాయుడు డిగ్రీ కాలేజీ- ఓయూ), డాక్టర్ జీ విమలారెడ్డి (సెయింట్ ఆన్స్ మెహిదీపట్నం).

డిగ్రీ లెక్చరర్లు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో విష్ణుదత్ సుక్లా (సిటీ కాలేజ్), షేక్‌యాకూబ్ (సిటీ కాలేజ్), కాంచనలత (నాంపల్లి), డాక్టర్ ఏ అప్పరున్నిసా (బేగంపేట), కే విజయ్‌కుమార్ (కూకట్‌పల్లి), కాకతీయ యూనివర్సిటీ పరిధిలో కే మల్లేశం (హన్మకొండ), ఎం నవీన్, (నర్సంపే

జలజలా బాబేఝరి

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలో ఎత్తైన గుట్టలు, దట్టమైన అడవుల మధ్య పారే బాబేఝరి జలపాతం పర్యాటకులకు కనువిందు చేస్తున్నది. సుమారు 200 మీటర్ల ఎత్తునుంచి పారుతున్న దృశ్యం ఆహ్లాదాన్ని కలిగిస్తున్నది. ఈ జలపాతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలంటూ ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కాగా, జలపాతం పూర్తిస్థాయి ఫొటో తీసేందుకు కుమ్రంభీం మ్యూజియం ఉద్యోగి బండేరావ్ ఇటీవల సాహసోపేతంగా లోయలోకి దిగారు. ఈ సందర్భంగా ఆయన తీసిన ఫొటోలు పర్యాటకశాఖకు పంపించారు. - కెరమెరి

హైకోర్టు తరలింపు ఆలోచనలేదు

చీఫ్ జస్టిస్ స్పష్టంచేశారు: హైకోర్టు పరిరక్షణ సమితి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైకోర్టు తరలింపు ఆలోచనేదీ ప్రస్తుతానికి లేదని, ఏదైనా ఉంటే అందరితో చర్చించే నిర్ణయం తీసుకుంటామని చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్ తెలిపారని పలువురు న్యాయవాదులు పేర్కొన్నారు. హైకోర్టు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు బుధవారం చీఫ్ జస్టిస్‌ను కలిసి హైకోర్టును తరలించవద్దని విజ్ఞాపనపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రస్తుతం హైకోర్టు తరలింపు ఆలోచన ఏదీలేదని, ప్రస్తుత హైకోర్టు ప్రాంగణంలోనే నూతన లా చాంబర్స్, మల్టీలెవల్ పార్కింగ్ సదుపాయాలు తదితర నిర్మాణాలపై ప్రణాళికలు కొనసాగుతున్నాయని సీజే పేర్కొన్నట్టు న్యాయవాదులు తెలిపారు.

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంతో రైతుల కలలు సాకారమవుతున్నాయి. ఉత్తరతెలంగాణ పంట పొలాలతో అలరారుతున్నది. శ్రీరాజరాజేశ్వర జలాశయం కింద రాజన్న సిరిసిల్ల జిల్లాలో కనుచూపుమేర పచ్చదనం పరుచుకున్న పైర్లు కనువిందు చేస్తున్నాయి.

హోరెత్తుతున్న కృష్ణమ్మ

- నారాయణపుర నుంచి 1.13 లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో
- నేడు జూరాలకు భారీగా పెరుగనున్న ఇన్‌ఫ్లో
- తుంగభద్ర 10 గేట్లు ఎత్తివేత.. 22 వేల క్యూసెక్కులు దిగువకు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

జలాభిషేకం

వరద పెరుగడంతో కర్ణాటకలోని ఆల్మట్టి నుంచి లక్ష క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తుండగా.. నారాయణపుర నుంచి 1.13 లక్షలు నదిలోకి వదులుతున్నారు. గురువారం ఇది ఇంకా పెరుగనున్నదని కేంద్ర జలసంఘం అధికారులు తెలిపారు. ఆల్మట్టికి బుధవారం 52 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. గురువారం ఉదయానికే 67 వేల క్యూసెక్కులు దాటుతుందని, నారాయణపుర జలాశయానికి ఇన్‌ఫ్లో మరింత పెరగనున్నదని సీడబ్ల్యూసీ పేర్కొన్నది. బుధవారం సాయంత్రం జూరాలకు 32 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదయింది. కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు కూడా వరద పోటెత్తడంతో అధికారులు బుధవారం రాత్రి 10 స్పిల్‌వే గేట్లు అడుగున్నర ఎత్తి 22,880 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి పదివేల క్యూసెక్కులలోపు ఉన్న ఇన్‌ఫ్లో రెండు మూడు రోజుల్లో భారీగా పెరిగే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. గోదావరి బేసిన్‌లో లోయర్‌మానేరుకు శ్రీరాజరాజేశ్వర జలాశయం ద్వారా వరద కొనసాగుతూనే ఉన్నది. రాజరాజేశ్వర జలాశయం నుంచి అవుట్‌ఫ్లో 3657 క్యూసెక్కులు ఉండగా.. ఎల్‌ఎండీకి 2568 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. కాగా, బుధవారం ఎస్సారెస్పీలోకి ఇన్‌ఫ్లో తగ్గిందని ప్రాజెక్టు డీఈ జగదీశ్ తెలిపారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 29 అడుగులకు చేరింది. చర్ల మండలంలోని తాలిపేరు రిజర్వాయర్ 5 గేట్లు ఎత్తి 14,900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

బుధవారం తుంగభద్ర డ్యాం నుంచి పరిగేట్ల ద్వారా విడుదలవుతున్న జలాలు

వివిధ ప్రాజెక్టుల్లో బుధవారంనాటి నీటిమట్టాల వివరాలు

రిజర్వాయర్	ఎఫ్‌ఆర్‌ఎల్ అడుగుల్లో	ప్రస్తుత మట్టం అడుగుల్లో	పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో	ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో	ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో	ఔట్‌ఫ్లో క్యూసెక్కుల్లో
ఆల్మట్టి	1705.00	1704.53	129.72	127.19	52,822	1,00,600
నారాయణపుర	1615.00	1614.50	37.64	37.25	1,00,000	1,13,280
ఉజ్జయిని	1630.00	1630.00	117.24	117.24	5,470	7,950
జూరాల	1045.00	1043.37	9.66	8.65	32,000	39,045
తుంగభద్ర	1633.00	1633.00	100.86	100.86	28,121	28,926
శ్రీశైలం	885.00	877.60	215.81	176.33	35,680	28,926
నాగార్జునసాగర్	590.00	585.50	312.05	298.88	0	16,260
పులిచింతల	175.00	174.15	45.77	44.43	14,044	5,000
సింగూరు	1717.93	1670.47	29.91	0.45	25	25
నిజాంసాగర్	1405.00	1376.75	17.18	0.87	2,130	22
శ్రీరాంసాగర్	1091.00	1069.10	90.31	27.17	4,350	484
లోయర్‌మానేరు	920.00	899.20	24.07	9.88	2,568	253
శ్రీరాజరాజేశ్వర	1043.31	1013.19	25.873	9.66	0	3,657
కడెం	700.00	698.00	7.60	7.09	919	394
ఎల్లంపల్లి	485.56	472.64	20.18	10.80	2,722	0

ఎస్సారెస్పీ పునర్జీవంలో తొలి అడుగు

రామ్‌పూర్‌లో తొలి వెట్ ట్రయల్‌రన్ సక్సెస్

జగిత్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో మరో అద్భుతఘట్టం ఆవిష్కృతమయింది. అపర భగీరథుడు, సీఎం కేసీఆర్ మదిలోంచి ఉద్భవించిన ఎస్సారెస్పీ పునర్జీవ పథకంలో జలదృశ్యం సాక్షాత్కారమైంది. రామ్‌పూర్ పంప్‌హౌస్‌లో అంతర్గత తనిఖీల్లో భాగంగా ఒకటో మోటర్ వెట్ ట్రయల్‌రన్ విజయవంతమైంది. ఈ పంప్‌హౌస్‌లో ఎనిమిది మోటర్లను ఏర్పాటు చేస్తుండగా, ఇప్పటికే ఐదింటిని బిగించారు. ఒక్కోమోటర్ 6.5 మెగావాట్ల సామర్థ్యంతో, 1,450 క్యూసెక్కుల నీటిని ఎత్తి పోయనున్నది. సర్జ్‌పూల్ నీటిసామర్థ్యం 324 మీటర్లు కాగా, 322 మీటర్లకు చేరింది. దీంతో అధికారులు బుధవారం రాత్రి 7.50 గంటల సమయంలో ఒకటో మోటర్ వద్ద ప్రత్యేక పూజలు చేసి, 8 గంటల సమయంలో వెట్ ట్రయల్‌రన్‌ను నిర్వహించారు. దీంతో లిఫ్ట్ అడ్వయిజర్ పెంటారెడ్డి, ఈఎన్సీ అనిల్‌కుమార్, ఎస్‌ఈ శ్రీకాంత్‌రావు, ప్రాజెక్టుమేనేజర్ సుధాకర్‌రెడ్డి, ఈఈ సుధాకిరణ్, డీఈఈ రాంప్రదీప్, రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ వెంకటరామారావు హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు.

మల్యాల మండలం రామ్‌పూర్ పంప్‌హౌస్‌లో డెలివరీ సిస్టర్న్ నుంచి విడుదలవుతున్న జలాలు

వ్యవసాయం, పాడిపరిశ్రమలపై నేటినుంచి అంతర్జాతీయ మహాప్రదర్శన

హైటెక్స్‌లో సదస్సును ప్రారంభించనున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయం, పాడి, ఆహారప్రాసెసింగ్, ఆక్వా, హార్టికల్చర్ పరిశ్రమలపై హైదరాబాద్ హైటెక్స్‌లో గురువారం అంతర్జాతీయ మహాప్రదర్శన ప్రారంభంకానున్నది. శనివారం వరకు జరిగే ఈ సదస్సును వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి గురువారం ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నారు. సదస్సులో యూకే, ఇటలీ, ఇజ్రాయెల్, నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా దేశాల నుంచి పెట్టుబడిదారులు, స్పీకర్లు, ఎగ్జిబిటర్లు పాల్గొననున్నారు. ఏకకాలంలో వినియోగదారులతో ప్రత్యక్ష సంబంధాలు, పరిశ్రమకు చెందిన అతి కీలకమైన వ్యక్తులతో సంప్రదింపులు, సమావేశాలు, పోటీ మార్కెట్‌కు తగిన వ్యూహ నిర్మాణావకాశాలు, సాంకేతిక అభివృద్ధిపై వివిధదేశాల వ్యవసాయ నిపుణులతో సంప్రదింపులు జరుపనున్నారు. అధునాతన విజ్ఞానం వినియోగానికి సంబంధించి సమావేశాల్లో చర్చించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

పల్లెకు ప్రగతిబాటలు

- 30 రోజుల ప్రణాళికకు అంతా సిద్ధం
- అన్ని జిల్లాల్లోనూ అవగాహన సదస్సుల నిర్వహణ
- స్పెషలాఫీసర్ల నియామకం పూర్తి
- 7న స్టాండింగ్ కమిటీల ఏర్పాటు
- గ్రామాభివృద్ధికి ఉపాధి నిధుల వినియోగించుకునే అవకాశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామాల్లో నవ శకం ఆవిష్కృతం కానున్నది. పల్లెలన్నీ పచ్చగా.. పరిశుభ్రంగా మారనున్నాయి. ముఖ్య మంత్రి కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 30 రోజుల ప్రణాళికను శుక్రవారం నుంచి ప్రారంభించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. దీనిపై బుధవారం అన్నిజిల్లాల్లోనూ అవగాహన సదస్సులు నిర్వహించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ సదస్సుల్లో పాల్గొన్నారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి దయాకర్‌రావు సచివాలయంలో ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్, కమిషనర్ రఘునందన్‌రావు, సెర్ప్ సీఈవో పోసుమీ బసుతో ప్రణాళికపై చర్చించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ప్రజాప్రతినిధులతోనూ సమావేశమయ్యారు. 30 రోజుల ప్రణాళికతోపాటు నూతన పంచాయతీరాజ్‌చట్టం అమలుపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక ఏర్పాట్లుచేసింది. రాష్ట్రవ్యాప్తంగా 12,751 గ్రామాల్లో హరిత హారం మొక్కలు పంపిణీకి సిద్ధమయ్యాయి.

30 రోజుల ప్రణాళికను చాలెంజ్‌గా తీసుకోవాలి

పీఆర్ ఉద్యోగసంఘాలతో మంత్రి దయాకర్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంచాయతీరాజ్‌శాఖలో గతంలో ఎన్నడూ లేనివిధంగా సీఎం కేసీఆర్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారని, ఈ స్ఫూర్తితో 30 రోజుల ప్రణాళికను చాలెంజ్‌గా తీసుకుని పనిచేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సూచించారు. పంచాయతీరాజ్‌లో పర్యవేక్షకులుగా ఉన్నవారికి గెజిటెడ్ హోదా ఇచ్చేందుకు సీఎం కేసీఆర్ సానుకూలంగా ఉండటంపై తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు సచివాలయంలో బుధవారం మంత్రి దయాకర్‌రావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసినవారిలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆకుల నందకుమార్, నాగరాజు తదితరులు ఉన్నారు.

సచివాలయంలో మంత్రి ఎర్రబెల్లికి పీఆర్ పర్యవేక్షకుల జాబితాను అందజేస్తున్న మినిస్టీరియల్ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు

చింతమొక్కలకు ప్రాధాన్యం: మంత్రి దయాకర్‌రావు

ఈసారి హరితహారంలో భాగంగా గ్రామాల్లో విరివిగా చింతమొక్కలు పెంచాలని నిర్ణయించినట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. గతంలో చింతపండు మనరాష్ట్రం నుంచి ఇతరరాష్ట్రాలకు ఎగుమతి చేసేవారని, కానీ ఇప్పుడు దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. దీంతో గ్రామాల్లో 1.20 కోట్ల చింతమొక్కలు పెంచాలని నిర్ణయించామని, దీనిని కచ్చితంగా అమలుచేస్తామన్నారు. అదేవిధంగా కరివేపాకు మొక్కలను కూడా పంపిణీ చేస్తున్నామన్నారు. పండ్లు, పూలమొక్కలు ప్రతి ఇంటికీ ఇస్తున్నట్టు తెలిపారు.

కొత్త పంచాయతీలకు సొంత భవనాలు

నూతన చట్టం ప్రకారం రాష్ట్రంలో ఆవిర్భవించిన 4,383 కొత్త పంచాయతీల్లో సొంతంగా కార్యాలయాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఉపాధి నిధులతోపాటు దాతల నుంచి కూడా చందాలు వసూలు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఉపాధి నిధుల నుంచి రూ.13 లక్షల వరకు ఇవ్వనున్నారు. అయితే నిర్మాణం స్థలాన్ని మాత్రం దాతల నుంచి తీసుకోవాలని సూచించింది. ఇక గ్రామాల అభివృద్ధి కోసం ఉపాధి హామీ నిధులను వినియోగించుకోవాలని సీఎం కేసీఆర్ సైతం ఆదేశాలిచ్చారు. ఉపాధి హామీతో గ్రామానికి సంబంధించిన ఎలాంటి అభివృద్ధి పనులైనా చేసుకోవచ్చని, దానికి ముందుగా గ్రామసభలో తీర్మానం తప్పనిసరిగా చేయాల్సి ఉంటుందని తేల్చి చెప్పారు. దీంతో గ్రామాల అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చూసుకుంటున్నారు.

స్పెషలాఫీసర్ల నియామకంపై ప్రొసీడింగ్స్

రాష్ట్రంలో గ్రామపంచాయతీల్లో 30 రోజుల ప్రణాళిక అమలు నేపథ్యంలో ప్రతి గ్రామానికి ప్రత్యేకాధికారిని నియమించారు. బుధవారం ఉదయం వరకే ఆయా గ్రామాల బాధ్యతలను అప్పగిస్తూ ప్రొసీడింగ్స్ జారీచేశారు. శుక్రవారం నుంచి ప్రత్యేకాధికారులు ప్రతి గ్రామానికి వెళ్లనున్నారు. ఆయా గ్రామాలకు సంబంధించిన పనులన్నింటినీ ప్రత్యేకాధికారులు పర్యవేక్షించనున్నారు.

టీఎస్‌ఐఆర్డీలో సర్పంచ్‌ల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశంగౌడ్. చిత్రంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కమిషన్ సభ్యుడు చెన్నయ్య తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధి సర్పంచ్‌ల బాధ్యత

పంచాయతీలకు త్వరలో 15వ ఆర్థికసంఘం నిధులు

సర్పంచ్‌ల సదస్సులో ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశంగౌడ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో గ్రామపంచాయతీల బలోపేతంపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని, గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సర్పంచ్‌లు బాధ్యతలు నిర్వర్తించాలని రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ జీ రాజేశంగౌడ్ అన్నారు. బుధవారం టీఎస్‌ఐఆర్డీలో.. సర్పంచ్‌లకు ఆర్థికసంఘం నిధులపై జరిగిన సదస్సులో రాజేశంగౌడ్ ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ఆర్థికసంఘాల నుంచి వచ్చే నిధులు, వాటి వినియోగంపై వివరించారు. గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ 30 రోజుల ప్రణాళిక అమలుచేస్తున్నారని, ఈ ప్రణాళిక అమలులో సర్పంచ్‌లు ప్రధాన భాగస్వాములు కావాలన్నారు. గ్రామాలను పచ్చదనంతో పరిశుభ్రంగా ఉంచాలని పిలుపునిచ్చారు. కేంద్రప్రభుత్వం నుంచి వచ్చే నిధులపై సంపూర్ణంగా అవగాహన కల్గి ఉండాలని సూచించారు. ప్రతి సర్పంచ్ తమ గ్రామాన్ని ముందు వరుసలో ఉంచి.. రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించాలని రాజేశంగౌడ్ కోరారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని సీఎం కేసీఆర్ దృఢంగా నమ్ముతున్నారని, ఇందులో భాగంగా 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు ఎక్కువగా ఇవ్వాలని కేంద్రానికి లేఖ రాసినట్లు వెల్లడించారు. పంచాయతీల్లో వంద శాతం పన్నులు వసూలుచేయాలన్నారు. స్థానిక ఎమ్మెల్యేలతో పనులు చేయించుకోవాలని, వారి నిధులను గ్రామాల అభివృద్ధికి వినియోగించుకోవాలని పేర్కొన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ మిషన్ భగీరథతో గ్రామాలకు తాగునీళ్లు రావడం లేదనే ఇబ్బందులు తొలిగిపోయాయన్నారు. ఈ సదస్సులో కమిషన్ సభ్యుడు చెన్నయ్యతోపాటు పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ముత్యంరెడ్డికి కన్నీటి వీడ్కోలు

- తుక్కాపూర్‌లో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- పెద్దసంఖ్యలో తరలివచ్చిన అభిమానులు
- నివాళులర్పించిన ఎంపీ ఎమ్మెల్యేలు, కలెక్టర్

దుబ్బాక, నమస్తే తెలంగాణ: గుండెపోటుతో కన్నుమూసిన టీఆర్ఎస్ సీనియర్‌నేత, మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి అంత్యక్రియలు బుధవారం అధికార లాంఛనాలతో పూర్తయ్యాయి. ఆయన స్వగ్రామం సిద్దిపేట జిల్లా తొగుట మండలం తుక్కాపూర్‌లోని తనకిష్టమైన పొలంలోనే శాశ్వత నిద్రలోకి వెళ్లిపోయారు. తొగుటలో ముత్యంరెడ్డి నివాసం నుంచి తుక్కాపూర్‌లోని వ్యవసాయక్షేత్రం వరకు వేలమందితో అంతిమయాత్ర సాగింది. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, సోలిపేట రామలింగారెడ్డి, మదన్‌రెడ్డి, సిద్దిపేట కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహా, మాజీ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, నాగం జనార్దన్‌రెడ్డితోపాటు పార్టీల కతీతంగా నాయకులు అంతిమయాత్రలో పాల్గొన్నారు. తమ ప్రియతమ నేతకు కడసారి వీడ్కోలు పలికేందుకు వేలమంది అభిమానులు, టీఆర్ఎస్ కార్యకర్తలు తరలివచ్చారు. ముత్యంరెడ్డి తనయుడు శ్రీనివాస్‌రెడ్డి తండ్రికి అంతిమ సంస్కారాలు నిర్వహించగా.. పోలీసులు గౌరవ సూచకంగా గాలిలోకి మూడురౌండ్లు కాల్పులు జరిపారు. పలువురు నాయకులు ముత్యంరెడ్డి సతీమణి విజయలక్ష్మి, కుమారుడు శ్రీనివాస్‌రెడ్డిని పరామర్శించారు. జిల్లాలో ఓ మంచి నాయకుడిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

తొగుటలో ముత్యంరెడ్డి నివాసం నుంచి ప్రారంభమైన అంతిమయాత్ర. (ఇన్‌సెట్) అంత్యక్రియలు నిర్వహించడానికి ముందు గౌరవ సూచకంగా గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

సీఎం చొరవతోనే నాణ్యమైన కరంట్

- నిరంతర విద్యుత్‌తో 25 లక్షల ఎకరాలు సస్యశ్యామలం
- టీఎస్ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

ఖైరతాబాద్: విద్యుత్‌రంగంలో సంస్కరణలను అమలుచేయడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ తమకు పూర్తి స్వేచ్ఛనిచ్చారని, ఆయన చొరవతోనే నేడు 24గంటలపాటు నిరంతర, నాణ్యమైన విద్యుత్తును ప్రజలకు అందించగలుగుతున్నామని టీఎస్ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు అన్నారు. బుధవారం సాయంత్రం ఖైరతాబాద్‌లోని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా తెలంగాణ స్టేట్‌సెంటర్ ఆడిటోరియంలో ఆయన పద్మశ్రీ నార్ల తాతారావు 18వ ధార్మిక ప్రసంగంచేశారు. ముందుగా ఐఈఐ చైర్మన్ డాక్టర్ జీ రామేశ్వర్‌రావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసిన ప్రభాకర్‌రావు.. నార్ల తాతారావు నాడు విద్యుత్‌రంగంలో తీసుకువచ్చిన సంస్కరణలు తమలాంటి ఎందరికో స్ఫూర్తిదాయకమని అన్నారు. సౌర విద్యుదుత్పత్తిలో మన రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు కేవలం 71 మెగావాట్ల సౌరవిద్యుత్తును ఉత్పత్తి చేసేవారమని, ప్రస్తుతం 3,641 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతున్నదని తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్తును అందించడంతో నేడు 25 లక్షల ఎకరాల సాగుభూములు సస్యశ్యామలంగా మారాయన్నారు. సీఎం కేసీఆర్ కృషితో విద్యుత్‌రంగంలో కనీవినీ ఎరుగనిరీతిలో జరుగుతున్న ఉత్పత్తి కొందరి కంటికి కనిపించడంలేదని పేర్కొన్నారు. రాబోవు రోజుల్లో విద్యుదుత్పత్తిలో దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌సంస్థ డైరెక్టర్ జగత్‌రెడ్డి, ఐఈఐ కార్యదర్శి టీ అంజయ్య, సహకార్యదర్శులు ప్రొఫెసర్ రాధాకృష్ణ, ప్రొఫెసర్ రమణానాయక్ పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

తెలంగాణ ప్రభుత్వము
నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్
(రాష్ట్ర చట్టం క్రింద స్థాపించబడ్డ విశ్వవిద్యాలయం) పంజాగుట్ట :: హైదరాబాద్
ఫైల్ నం. AC2/140/2019/PGD ప్రకటన తేది: 30-08-2019
2019 సంవత్సరం కొరకు పారా మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులు-118 సీట్ల నందు ప్రవేశం కొరకు తెలంగాణ రాష్ట్రం యొక్క అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరడమైనది. ఆన్‌లైన్ దరఖాస్తు, ప్రాస్పెక్టస్ కొరకు మరియు ఏవేని అప్‌డేట్స్ కొరకు కూడా వెబ్‌సైట్: www.nims.edu.in దర్శించవల్సిందిగా అభ్యర్థుల్ని కోరడమైనది. ప్రాస్పెక్టస్ (అనుబంధం-1)నందు వివరించిన విధంగా సపోర్టింగ్ డాక్యుమెంట్లతోపాటుగా ఆన్‌లైన్ దరఖాస్తు యొక్క హార్డ్ కాపీని అసోసియేట్ డీన్, అకాడమిక్-2, 2వ అంతస్తు ఓల్డ్ OPD బ్లాక్ NIMS,పంజాగుట్ట, హైదరాబాద్-500082, తెలంగాణ వారికి స్వయంగా దాఖలు చెయ్యగలరు లేదా తేది: 16-09-2019న సాయంత్రం 5.00 గంటలలోగా పై చిరునామాకు చేరువిధంగా తపాలాద్వారా (ప్రత్యేకించి భారత తపాల సేవల ద్వారా) పంపగలరు.
DIPR R.O.No. 1064 DP/CL/Advt/1/2019-20 తేది:04-09-2019 సం/- I/c డీన్

KALOJI NARAYANA RAO UNIVERSITY OF HEALTH SCIENCES
TELANGANA STATE
NOTIFICATION FOR MQ ADMISSIONS
Application forms online are invited from NEET-UG-2019 qualified candidates for admission into BHMS Course for Management Quota in Private Homeopathy colleges in the State of Telangana under KNRUHS from 05-09-2019 to 11-09-2019.
For detailed notification refer to www.knruhs.in, www.knruhs.telangana.gov.in
Dated: 04-09-2019 REGISTRAR

మధ్యాహ్న భోజనం నాణ్యత లేకపోవడాన్ని వెల్లడించిన పాత్రికేయుడిని యూపీ ప్రభుత్వం సత్కరించాల్సింది. ఆహారం నాణ్యత లేకపోవడానికి కారణమైన అధికారులపై యూపీ ప్రభుత్వం చర్య తీసుకుంటుంది. తప్పుచేసిన వారిని బీజేపీ కాపాడదు.

మనోజ్ తివారి, బీజేపీ ఢిల్లీ విభాగం అధ్యక్షుడు

మధ్యప్రదేశ్ క్యాబినెట్ మంత్రి ఉమాంగ్ సింఘార్ లేవనెత్తిన అంశాలపై దృష్టిసారించాలె. ముఖ్యమంత్రి ఇరుపక్షాల వాదనలు విని చర్చించి పరిష్కరించాలె.

జ్యోతిరాదిత్య సింధియా, కాంగ్రెస్ ప్రముఖుడు

చరిత్రలో నేడు

1698

గడ్డంపై పన్ను విధించిన రష్యా జార్ పీటర్ ది గ్రేట్.

1793

ఫ్రెంచి విప్లవంలో 'భయానక దశ' ఆరంభం.

1991

ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎంపికైన నెల్సన్ మండేలా.

ఆస్ట్రేలియాలోని భూమిపుత్రులు పార్లమెంట్‌లో తమ గొంతు వినిపించే విషయమై చర్చ నడుస్తున్నది. వారు తమ భాషలోనే మాట్లాడటానికి ప్రయత్నాలు సాగుతున్నాయి. 1980 వరకు ఆస్ట్రేలియా ఏ మాత్రం పట్టించుకోకపోవడం వల్ల 250 స్థానిక భాషలు మాయమయ్యాయి. యురోపియన్ల వలస ఇందుకు కారణం. ఇంకా వంద భాషలు మిగిలి ఉన్నప్పటికీ, అందులో వ్యవహారంలో ఉన్నవి 18 మాత్రమే. వీటిని కూడా వృద్ధులు మాట్లాడుతున్నారు. ఇప్పుడు వాటిని కాపాడటం కోసం ఆస్ట్రేలియా ప్రభుత్వం కొద్దిపాటిగా 12 లక్షల డాలర్లు మంజూరు చేసింది.

ది సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్

ఒలింపిక్ క్రీడల్లో చైనా సాధించిన పతకాలు చూస్తే, 2050 నాటికి అగ్రశ్రేణి క్రీడా దేశంగా మారాలనే లక్ష్యం ఇప్పటికే సాధించిందని తెలిసిపోతుంది. కానీ చైనా ప్రభుత్వ కొత్త విధాన లక్ష్యం వేరు. దీనివల్ల 2035 నాటికి 45 శాతం మంది వారానికి మూడు సార్లు మధ్యస్థాయి వ్యాయామం చేస్తుంటారు. ప్రజలలో వీలైనంత ఎక్కువ మందిని క్రీడల్లో భాగస్వాములను చేయడం వల్ల సహజ నైపుణ్యాలు కలవారి నుంచి కొత్త క్రీడాకారులు ఎదుగుతారు. గతంలో మాదిరిగా అధికారులు కొద్దిమందిని ఎంపిక చేసుకొని వారికే కఠోరమైన క్రీడా వ్యవస్థలో శిక్షణ ఇవ్వడం ఉండదు.

సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్

పల్లెకు పట్టాభిషేకం

అభివృద్ధి సంక్షేమ పథకాలతో, పాలనా సంస్కరణలతో రాష్ట్రాన్ని దేశంలో అగ్రభాగాన నిలిపిన సీఎం కేసీఆర్ గ్రామం పునాదిగా సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణను ప్రకటించటం ముదావహం. ముప్పై రోజుల ప్రత్యేక ప్రణాళిక కార్యాచరణ అమలుపై రాజేంద్రనగర్‌లోని తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (టీఎస్ఐఆర్డీ) ఆడిటోరియంలో అధికార యంత్రాంగానికి సీఎం దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామంలో పచ్చదనం, పారిశుద్ధ్యం మొదలు అభివృద్ధి పథకాల అమలుదాకా నిర్దిష్ట ప్రణాళిక, కార్యాచరణను నిర్దేశించారు. దీంతో గ్రామాల్లో గుణాత్మక మార్పు తీసుకొచ్చేందుకు శుక్రవారం నుంచి అధికార యంత్రాంగమంతా పల్లెబాట పట్టనున్నది. గ్రామం కేంద్రంగా పలు అంశాలపై దృష్టిసారించి ప్రజల భాగస్వామ్యంతో వాటన్నింటినీ పరిష్కరించుకునేందుకు ఈ ముప్పై రోజుల కార్యాచరణ ఎంతో ఉపయోగపడనున్నది. పల్లెల అభివృద్ధి కోసం నిధులను ప్రభుత్వం కేటాయిస్తున్నది. గ్రామాభివృద్ధి కోసం ఆర్థికసంఘం నిధులకు, రాష్ట్ర ప్రభుత్వ నిధులు కూడా కలిపి గ్రామ పంచాయతీలకు నెలకు రూ.339 కోట్ల చొప్పున విడుదల చేయనున్నది. ఈ విధమైన ప్రత్యేక కార్యాచరణతో తెలంగాణ పల్లెలన్నీ కొత్తరూపును సంతరించుకుంటాయనటంలో సందేహం లేదు.

ప్రజా భాగస్వామ్యంతో గ్రామ సీమలను స్వయంపాలన బాట పట్టించటం కోసమే పంచాయతీరాజ్ వ్యవస్థ ఉనికిలోకి వచ్చింది. కానీ గత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా దశాబ్దాలుగా పల్లెలన్నీ సమస్యల సుడిగుండంలో చిక్కుకుపోయాయి. డెబ్భై ఏండ్ల స్వతంత్ర భారతంలో ఇప్పటికీ కనీసం రోడ్లు, విద్యుత్తు, మంచి నీటి సరఫరాకు నోచుకోని గ్రామాలున్నాయంటే పాలకుల విధాన దృష్టిలోపాన్ని ఎత్తిచూపేవే. రాజకీయ నాయకులు, అధికారుల నేరపూరిత నిర్లక్ష్యం, అవినీతి కారణంగా ఆశించిన ఫలితాలకు ఆమడదూరంలో ఉండిపోయాయి. ఈ నేపథ్యంలోనే 1993లో 73వ రాజ్యాంగ సవరణతో పంచాయతీరాజ్ సంస్థలకు రాజ్యాంగ భద్రత కల్పించారు. మొత్తంగా 29 అంశాలను అధికారికంగా పంచాయతీరాజ్‌కు కేటాయించారు. ఈ అధికారాలను పంచాయతీలకు బదిలీ చేయటంలో చాలా రాష్ట్రాలు అలసత్వం వహిస్తుండగా తెలంగాణ రాష్ట్రం మాత్రం చిత్తశుద్ధితో వ్యవహరిస్తూ నిజమైన అర్థంలో పల్లెలకు పెద్దపీట వేస్తున్నది. నిజానికి ఏ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమం అయినా దాని ఆచరణాత్మక ఫలితాలు గ్రామం కేంద్రంగానే కనిపిస్తాయి. వ్యవసాయం, పారిశుద్ధ్యం, నీటి సరఫరా, విద్య, వైద్యం, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, సాంఘిక సంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమం, మహిళా సంక్షేమం, మత్స్యశాఖ, గ్రామీణ జీవనోపాధికి ఆలవాలమైన కులవృత్తుల పరిరక్షణ, అభివృద్ధి లాంటి వాటిపైనే గ్రామీణ వికాసం ఆధారపడి ఉంటుంది. ఈ మౌలిక సత్యాన్ని రాష్ట్ర సాధనోద్యమంలోనే గుర్తించిన కేసీఆర్ గ్రామం పునాదిగా మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశారు. మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సరఫరా మొదలు ఆసరా, కళ్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, రైతుబంధు పథకం వంటి పథకాలు గ్రామీణ ప్రజల జీవితాల్లో ఆర్థిక స్వావలంబనకు పునాది వేసేవే.

తెలంగాణ అవతరించిన తర్వాత సీఎం కేసీఆర్ మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూనే బలోపేతం చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించారు. దీనిలోభాగంగా నూతన పంచాయ తీరాజ్ చట్టంతో పంచాయతీలను బలోపేతం చేశారు. కొత్త చట్టంతో 1,177 తండాలు, 1,281 ఆవాసాలను గ్రామ పంచాయతీలుగా మార్చారు.

తెలంగాణ అవతరించిన తర్వాత సీఎం కేసీఆర్ మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూనే గ్రామాలను బలోపేతం చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించారు. దీనిలోభాగంగా నూతన పంచాయతీరాజ్ చట్టంతో పంచాయతీలను బలోపేతం చేశారు. కొత్త చట్టంతో 1,177 తండాలు, 1,281 ఆవాసాలను గ్రామ పంచాయతీలుగా మార్చారు. గ్రామస్థాయిలోనే ప్రణాళిక ఉండాలనే లక్ష్యంతో గ్రామజ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం వేల కోట్లు కేటాయించటంతో పాటు, కొత్తగా ఏర్పాటైన గ్రామాలకు రహదారుల కోసం కోట్లు వెచ్చించింది. ఉమ్మడి రాష్ట్రంలో 2013-14లో 23 జిల్లాలకు 13 వేల కోట్లను మాత్రమే కేటాయిస్తే, తెలంగాణ రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 13,8 77 కోట్లు వ్యయం చేయటం విశేషం. ఇలా ఏటా అభివృద్ధి కోసం కోట్లలో నిధులు కేటాయిస్తూ, 2018-19లో 15,563 కోట్లు కేటాయించింది. దీంతోపాటు గ్రామాల్లో సీసీ రోడ్లు, అంతర్గత రోడ్ల కోసం మరో 2,500 కోట్లు వెచ్చించటం గమనార్హం. దీంతో గ్రామాల్లో మౌలిక వసతులు ఎంతో మెరుగయ్యాయి. ప్రస్తుత 30 రోజుల ప్రత్యేక ప్రణాళికా కార్యాచరణతో గ్రామాలు అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కనున్నాయి. చెట్ల పెంపకం, పరిశుభ్రత, విద్య, ఆరోగ్యం, రోడ్లు తదితరాలు ప్రజల భాగస్వామ్యంతో మెరుగుపడుతాయి. ప్రణాళికాబద్ధంగా సామాజిక సమూహాల తోడ్పాటుతో చేపడుతున్న ఈ కార్యక్రమాలు ఈ నెల రోజులతోనే ముగిసిపోకుండా నిరంతరం అదే స్ఫూర్తితో కొనసాగుతాయని ఆశించవచ్చు. ప్రజల్లో చైతన్యం వస్తే గ్రామానికి సంబంధించిన ఏ సమస్య అయినా వెంటనే పరిష్కారానికి నోచుకుంటుంది. గ్రామ సమగ్రాభివృద్ధికి పెట్టింది పేరైన మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లా హివ్రేబజోర్ గ్రామంలాగానే తెలంగాణ పల్లెలన్నీ ఆదర్శం కావాలె. ఈ గ్రామాన్ని వంద దేశాల ప్రతినిధులు సందర్శించారు. ప్రజలు ఐక్యంగా కృషి చేస్తే స్వయం అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన దిశగా సాగుతున్న తెలంగాణ పల్లెలన్నీ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తాయి.

ఆలోకన

టంకశాల అశోక్

గ్రామాభివృద్ధికి చారిత్రకావకాశం

తెలంగాణ గ్రామాల అభివృద్ధికి, పచ్చదనం-పరిశుభ్రతలకు ఈ నెల 6 నుంచి అమలయ్యే ప్రత్యేక కార్యక్రమం ఒక చారిత్రక అవకాశమనాలి. ఇందుకోసం తగు ప్రణాళికలను రూపొందించిన కేసీఆర్ ప్రభుత్వం, ఈ కార్యక్రమం విజయవంతమయ్యేందుకు ప్రభుత్వ కృషి ఎంత ముఖ్యమో ప్రజల విస్తృత భాగస్వామ్యం అంతే ముఖ్యమని భావిస్తున్నది. ఇది ప్రజలు అర్థం చేసుకోలేని విషయం కాదు. గ్రామాభివృద్ధికి ఈ తరహా ప్రయత్నం రాష్ట్రంలో ఇది మొదటిసారి గనుక, ఈ చారిత్రక అవకాశాన్ని తమ కోసం తాము సద్వినియోగపరుచుకోవలసిన బాధ్యత ప్రజలపై ఉంటున్నది.

ఈ శుక్రవారం నుంచి అమలుకు రానున్న అభివృద్ధి కార్యక్రమం విశేషాల్లోకి వెళ్లేముందు కొంత నేపథ్యాన్ని చెప్పుకోవాలి. గ్రామాల అభివృద్ధి అనేది విస్తృతమైన మాట. దేశానికి స్వాతంత్ర్యం లభించి ప్రణాళికలు మొదలైనప్పటినుంచి ఇది వాడుకలో ఉంది. కానీ పచ్చదనం-పరిశుభ్రత నిర్దిష్టమైన అర్థం కలవి. గ్రామాలలో, దానితోపాటు అక్కడి వివిధ వర్గాలకు ఏయే రంగాల్లో ఏమేమి జరిగితే, వారు కొత్తగా ఎటువంటి స్థాయిని చేరుతూపోతే, అది అభివృద్ధి అవుతుందనే ప్రశ్నపై చాలా చెప్పుకోవచ్చు. అయితే, వందల సంవత్సరాల నిజాం రాజ్యంతో, సుమారు అరువై ఏండ్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పరిస్థితితో పోల్చితే, కేవలం గత అయిదున్నరేండ్ల కాలంలోనే తెలంగాణ గ్రామాలు గణనీయమైన అభివృద్ధి దిశలో సాగుతున్నాయి. గ్రామాల్లో నివసించే ప్రజలు, గ్రామాలతో సజీవ సంబంధాలు గల వారు ఇప్పటికే గుర్తించిన వాస్తవమిది. విద్యుత్ సమస్య పరిష్కారం నుంచి మొదలుకొని, తాజాగా వివిధ నీటిపారుదల పథకాలలో జలాలు వెల్లువెత్తుతుండటం వరకు, గత ఐదేండ్లలో గ్రామీణాభివృద్ధికి సంబంధించి జరిగిన పనులు ఇందుకు తార్కాణం.

ఈ అభివృద్ధి ఇదేవిధంగా కొనసాగనుండగా, అభివృద్ధికి పచ్చదనం-పరిశుభ్రతలతో గల అవినాభావ సంబంధమన్నది ఇక్కడ గుర్తించవలసిన విషయం. ఈ రెండు నిజంగానే ఒకదానితో ఒకటి విడదీయలేనివి. గ్రామాలు, అక్కడి ప్రజలు వస్తుపరంగా (మెటీరియల్‌గా) ఎంత అభివృద్ధిని సాధించినప్పటికీ, ఊరినిండా చెత్తకుప్పలు, మురుగునీరు, ఈగలు దోమలు, గుంతల రోడ్లు, శుభ్రతను పాటించని జనం నిండి ఉండి, ఈ విషయాల్లో స్పృహ లేక, క్రమశిక్షణను పాటించక, పచ్చదనాన్ని పెంచుకోక, అనారోగ్యాల బారిన పడుతూ ఉంటే, ఆ స్థితి వస్తుపరమైన అభివృద్ధిని కూడా దెబ్బతీస్తుంది. మానవాభివృద్ధికి ఆటంకమవుతుంది. అది నాగరికత కాదన్నది సరేసరి. ఈ విషయాల్లో రాష్ట్రస్థాయి ప్రభుత్వం, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధ చూపకపోతే అదివేరు. అప్పుడు ప్రజలు చేయగలిగింది స్వల్పం. చైతన్యం గల వ్యక్తులు, గాంధేయుల వంటివారు, స్వచ్ఛంద సంస్థలు కొంత చేయవచ్చు గాని అందుకు పరిమితులుంటాయి. పైగా అదొక వ్యవస్థ రూపం తీసుకోజాలదు.

అటువంటిస్థితిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందుకొక వ్యవస్థీకృత రూపం ఇస్తూ ముందుకు వస్తున్నది. ప్రభుత్వం చేసే వాటికి సాధారణంగా వ్యవస్థీకృత రూపం ఉంటుందనేది నిజమే. అయితే ప్రస్తుతం కేసీఆర్ సంకల్పంతో పచ్చదనం-పరిశుభ్రతకు ఇస్తున్న వ్యవస్థీకృత రూపం ఇంత విస్తృతంగా, ఇంతటిస్థాయిలో ఇంతకు ముందెన్నడూ లేదన్నది గుర్తించవలసిన విషయం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో లేదు. దేశంలో బహుశా కేరళ ఒక్కటే ఇందుకు మినహాయింపు కావచ్చు. పచ్చదనం-పరిశుభ్రతకు మెటీరియల్ అభివృద్ధితో పాటు మానవాభివృద్ధి (హ్యూమన్ డెవలప్‌మెంట్)తో ఘనిష్ఠమైన సంబంధం ఉన్నది. దీన్ని రాష్ట్రం ఏర్పడిన కొత్తలోనే అజెండాపైకి తీసుకున్న కేసీఆర్, అప్పటినుంచే హరితహారం కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం పెద్దఎత్తున చేపడుతుండటం తెలిసిందే. అందులో భాగంగా పరిశుభ్రత గురించి కూడా ఆయన మాట్లాడుతూ వచ్చారుగాని, ఇప్పుడందుకు మరింత నిర్దిష్టరూపం వస్తున్నది. ఆయన మొదట హరితహారం గురించి మాట్లాడినపుడు, ఆ కార్యక్రమాన్ని బహుశా అందరూ గతకాలపు వన మహోత్సవాల వలె మొక్కుబడి వ్యవహారంగా తీసుకొని ఉంటారు. రాష్ట్రస్థాయి అధికారుల నుంచి మొదలుకొని గ్రామీణుల వరకు అదే దృష్టి తీసుకోవటం ఈ రచయిత స్వయంగా గమనించిన విషయం. కానీ ఆయన ఏ యేటికి ఆయేడు అదే కార్యక్రమాన్ని పట్టుదలగా కొనసాగించటం, ఆ పట్టుదల ఇంకా పెరుగుతూపోవటం వల్ల ఆ స్ఫూర్తి క్రమంగా ఇతరులకు కలగసాగింది. మొక్కలను ప్రభుత్వ సిబ్బంది మొక్కుబడిగా, ప్రజలు తక్షణ ఉత్సాహంగా నాటి వదలివేయటం వేరు, స్ఫూర్తితో పరిరక్షించటం వేరు. ఇందులో రెండవది ఉండవలిసినంతగా లేదన్నది చేదు నిజం. ఇది గమనించి ముఖ్యమంత్రి ఒక దశ తర్వాత కొన్ని గట్టి చర్యలే ప్రకటించారు గాని, అధికారుల అలసత్వం వల్ల, ప్రజలకు తగు స్ఫూర్తి కలుగనందువల్ల, ఫలితాలు మొదటి దశ కన్న కొంత పెరిగినా ఆశించిన మేర కలుగలేదు.

బహుశా ఈ నాలుగేండ్ల అనుభవాలతో కావచ్చు ముఖ్యమంత్రి ఇప్పుడు ఒక సరికొత్త ప్రణాళికను ఆవిష్కరించారు. ఇందులో ఇంతకాలపు హరితహారం స్వరూపానికి మించిన సమగ్రత ఉన్నది. ఒకవైపు అభివృద్ధిని, మరొకవైపు పచ్చదనం-పరిశుభ్రతను గమనించవచ్చు. ఇందులో అభివృద్ధి సరేసరి కాగా, ఆయన తన హరితహారం ఫిలాసఫీని ఇంత పట్టుదలగా, నిబద్ధతతో, ఈ స్థాయికి తీసుకువెళ్తుండటం ఎవరినైనా మెప్పించేదే గాక ఆశ్చర్యాన్ని కలిగిస్తున్న విషయం. తెలంగాణ రాష్ట్ర సాధన, విద్యుత్ సమస్య పరిష్కారం, ప్రాజెక్టుల నిర్మాణం, బడుగు జీవుల సంక్షేమం, రైతాంగపు పరిస్థితి మెరుగుపడటం వంటి విషయాలలో చూపిన పట్టుదలనే ఆయన ఈ పచ్చదనం-పరిశుభ్రత, గ్రామీణాభివృద్ధి విషయాల్లోనూ చూపుతున్నట్లు, అందుకు ఇదొక కొనసాగింపు లక్షణం అయినట్లు భావించాల్సి ఉంటుంది.

దీనిని విజయవంతం చేసేందుకు ముఖ్యమంత్రి ఏమేమి చర్యలు తీసుకుంటున్నారో ఒకసారి గమనించండి. తన ఉద్దేశాలు మొక్కుబడివి కావని మంత్రులు, అధికారుల నుంచి మొదలుకొని సాధారణ ప్రజల వరకు అందరికీ నూరిపోసేందుకు పంచాయతీరాజ్ తదితర శాఖలవారితో వరుసగా పలు సమావేశాలు గంటల తరబడి జరిపారు. పంచాయతీ శాఖలోని ఖాళీలను పూరించటం, అవసరమైన ప్రమోషన్లు ఇవ్వటం, గ్రామీణ పారిశుద్ధ్యంలో ముఖ్యపాత్ర వహించే సఫాయీ కార్మికుల జీతాలు గణనీయంగా పెంచటం వంటివి వేగంగా పూర్తిచేశారు. దీనికన్న ముందే కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని రూపొందించారు. కార్యక్రమాన్ని కేంద్రీకృత దృష్టితో అమలుపరిచేందుకు 60 రోజుల ప్రణాళికను తయారుచేశారు. అందులో 30 రోజుల మొదటిదశ ఈ శుక్రవారం నుంచి చేపడుతున్నారు. నెలకు రూ.339 కోట్ల చొప్పున విడుదల చేస్తున్న ట్లు ప్రకటించారు. ప్రణాళికలను గతంలోనూ రూపొందించినా సక్రమ పర్యవేక్షణ లేకపోయిందని గుర్తించి ఈసారి ప్రతి గ్రామానికి ఒకరు చొప్పున మండలస్థాయి అధికారులను ఇంచార్జ్‌లుగా నియమిస్తున్నారు.

ముప్పై రోజుల ప్రత్యేక కార్యాచరణ కార్యక్రమాన్ని గమనిస్తే అందులో ఒకవైపు అభివృద్ధికి సంబంధించిన అంశాలు, మరొకవైపు పచ్చదనం అంశాలు, ఇంకొకవైపు పరిశుభ్రత అంశాలు కనిపిస్తాయి. వాటినన్నింటిని ఇక్కడ జాబితా రాయవలసిన అవసరం లేదు గాని ముఖ్యమైనవి చెప్పాలంటే గ్రామాల అవసరాలు, వనరులను పరిగణనలోకి తీసుకుంటూ ఆ ప్రకారం వార్షిక ప్రణాళికను తయారుచేసుకోవటం, అందుకు గ్రామసభ ఆమోదం తీసుకొని అదే ప్రకారం ఖర్చుచేయటం, విద్యుత్ రంగానికి సంబంధించి 'పవర్ వీక్' నిర్వహణ, ప్రతి జిల్లాకు కేటాయించే నిధుల్లో గ్రామానికి లభించేవాటిని ప్రణాళికకు అనుగుణంగా సక్రమ వినియోగం వంటివి అభివృద్ధి అంశాల కిందకు వస్తాయి. మురికి కాల్వలు రోడ్ల శుభ్రత, ఇతర శుభ్రతలు, డంప్‌యార్డ్‌ల నిర్వహణ వంటివి పరిశుభ్రత కిందకు వస్తాయి. గ్రామాల్లో నర్సరీల పెంపు, మొక్కలను నాటడంతో పాటు పరిరక్షించి పెంచటం వంటివి హరితహారమవుతాయి. ఈ అన్ని విషయాల్లో ప్రభుత్వం ఇప్పుడు అధికారులను, స్థానిక ప్రజాప్రతినిధులను కచ్చితమైన రీతిలో బాధ్యులను చేస్తుండటం, పాటించని వారిపై చర్యలు తీసుకోనుండటం విశేషం. అనుమతిలేకుండా చెట్లు నరకటం, పరిసరాలను జల వనరులను అపరిశుభ్రం చేయటం సాధారణ ప్రజలకు సైతం శిక్షార్హమైన నేరం కానున్నది. ప్రజలు, అధికారులు తమ బాధ్యతలను చైతన్యంతో గుర్తెరిగి స్వయంగా ఆచరించేవరకు ఇది అవసరం కూడా.

> ముప్పై రోజుల ప్రత్యేక కార్యాచరణ కార్యక్రమాన్ని గమనిస్తే అందులో ఒకవైపు అభివృద్ధికి సంబంధించిన అంశాలు, మరొకవైపు పచ్చదనం అంశాలు, ఇంకొకవైపు పరిశుభ్రత అంశాలు కనిపిస్తాయి. వాటినన్నింటిని ఇక్కడ జాబితా రాయవలసిన అవసరం లేదు గాని ముఖ్యమైనవి చెప్పాలంటే గ్రామాల అవసరాలు, వనరులను పరిగణనలోకి తీసుకుంటూ ఆ ప్రకారం వార్షిక ప్రణాళికను తయారుచేసుకోవటం, అందుకు గ్రామసభ ఆమోదం తీసుకొని అదే ప్రకారం ఖర్చుచేయటం, విద్యుత్ రంగానికి సంబంధించి 'పవర్ వీక్' నిర్వహణ, ప్రతి జిల్లాకు కేటాయించే నిధుల్లో గ్రామానికి లభించేవాటిని ప్రణాళికకు అనుగుణంగా సక్రమ వినియోగం వంటివి అభివృద్ధి అంశాల కిందకు వస్తాయి.

ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు ప్రజల భాగస్వామ్యం అవసరమన్నది కేసీఆర్ నొక్కిచెప్పిన ఒక ముఖ్యమైన మాట. వారు భాగస్వాములు కాక తప్పని పరిస్థితులు సృష్టించటం (ఉదాహరణకు అపరిశుభ్రతకు జరిమానా) ఒక ఎత్తయితే, స్వచ్ఛందంగా, బాధ్యత గుర్తెరిగి, అందువల్ల తమకు కలిగే మేలును తెలిసి చైతన్యంతో భాగస్వాములు కావటం మరొక ఎత్తు. వారు ఈ రెండవది చేస్తూ, అధికారులతో, ప్రజాప్రతినిధులతో పనులు చేయిస్తూ, గ్రామాభివృద్ధి చేసుకోవడానికి ఇప్పుడొక చారిత్రక అవకాశం లభిస్తున్నది. ఇదంతా క్రమంగా వ్యక్తులకు, ప్రజలకు, ప్రభుత్వానికి ఒక స్థిరమైన సంస్కృతిగా మారాలి.

గురువులు విలువలు వదలొద్దు

సందర్భం

ప్రొఫెసర్ జి.లక్ష్మణ్

భారతీయ దార్శనిక చింతనాధోరణులను, సంస్కృతిని పాశ్చాత్య దేశాలకు తనదైన శైలిలో, రచనల ద్వారా తెలియజేసిన గొప్ప రచయిత, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. సంస్కృత భాషలోని భగవద్గీత, బ్రహ్మసూత్రాలు, ఉపనిషత్తులకు (ప్రస్థానత్రయ) ఆంగ్లంలో గొప్ప వ్యాఖ్యానాలు రాసి భారతీయ దర్శనానికి గల విశిష్టతను, తాత్త్విక మూలాలను ఆవిష్కరించారు. భావవాద కోణంలో భారతీయ దర్శనాన్ని రచించి పాశ్చాత్యులు ఆ దర్శనాన్ని ఆసక్తితో అధ్యయనం చేసేలా కృషిచేశారు రాధాకృష్ణన్. ఆయనవల్లనే భారతీయ దర్శనం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. వారి మేధోసంపత్తిని గుర్తించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ దేశాల్లోని విశ్వవిద్యాలయాలు 110 డాక్టరేట్ పురస్కారాలు అందజేశాయి. ఆయన సుమారు 150 గ్రంథాలు రచించారు. వీరి రచనలో ముఖ్యమైనవి 'ఇండియన్ ఫిలాసఫీ', 'ద హిందూ వ్యూ ఆఫ్ లైఫ్', 'ద ఐడియల్ వ్యూ ఆఫ్ లైఫ్', 'ఫ్రీడమ్ అండ్ కల్చర్', 'మహాత్మాగాంధీ', 'గ్రేట్ ఇండియన్', 'ది ధమ్మపద గౌతమ బుద్ధ' ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందాయి. భారతదేశ సంస్కృతిని, నాగరికతను ప్రపంచానికి చాటిచెప్పిన ఆయన జన్మదినం సెప్టెంబర్ 5ను దేశంలో ఉపాధ్యాయదినోత్సవంగా జరుపుకునే ఆనవాయితీ 1962లో ప్రారంభమైంది.

రాధాకృష్ణన్ మన దేశానికి 1952 నుంచి 1962 వరకు ఉప రాష్ట్రపతిగా రెండు పర్యాయాలు పనిచేశారు. 1962లో రాష్ట్రపతి పదవిని అలంకరించారు. రాష్ట్రపతిగా పదవీబాధ్యతలు చేపట్టే సందర్భంలో దేశ విదేశాల్లో ఉన్న తన శిష్యులు, శ్రేయోభిలాషులు తన జన్మదినమైన సెప్టెంబర్ 5ను ఘనంగా జరిపేందుకు నిర్ణయించుకున్నట్లు తెలుపగా తన పుట్టినరోజును ఉపాధ్యాయదినోత్సవంగా జరుపుకుంటే తాను ఆనందిస్తానని రాధాకృష్ణన్ అన్నారు. దాంతో నాటినుంచి సెప్టెంబర్ 5ను ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవటం ప్రారంభమైంది. రాధాకృష్ణన్ దాదాపు రెండున్నర దశాబ్దాల పాటు బోధనావృత్తిని ఎంతో పవిత్రంగా, ఆదర్శంగా నిర్వహించారు. ఆయన దృష్టిలో సమాజంలో గుణాత్మకమైన మార్పు విద్యావిధానం ద్వారానే గాక విద్యను బోధించే ఉపాధ్యాయుల ద్వారా అధికంగా వస్తుంది.

మద్రాసు ప్రెసిడెన్సీలోని తిరుత్తుని నగరంలో 1888 సెప్టెంబర్ 5న రాధాకృష్ణన్ జన్మించారు. ప్రాథమిక విద్యను తిరువల్లూరులో, రేణిగుంటలో పాఠశాల ఉన్నత విద్యను, మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసుకొని మద్రాసు యూనివర్సిటీలో తన అభిమాన విషయమైన తత్త్వ శాస్త్రంలో ఎం.ఏ. పట్టా పొందారు. 1921లో ప్రతిష్ఠాత్మకమైన 5వ కింగ్ జార్ ఆచార్యపీఠాన్ని కలకత్తా విశ్వవిద్యాలయంలో అధిష్ఠించారు. 1929లో ఇంగ్లాండ్‌లోని మాంచెస్టర్ కాలేజీ ప్రిన్సిపల్‌గా, ఆ పిదప ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఆచార్యుడిగా పనిచేశారు. 1931లో సర్వేపల్లికి 'సర్' బిరుదు లభించింది. ఆయన మైసూరు, కలకత్తా, మద్రాసు, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలలో ఆచార్యుడిగా పనిచేసి 1931లో ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు.

యునెస్కో అధ్యక్షులుగా మాస్కోలో భారత రాయబారిగా పనిచేసిన రాధాకృష్ణన్ 1952లో ఉప రాష్ట్రపతిగా, 1962లో రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. 1954లోనే మనదేశంలో అత్యున్నత ప్రభుత్వ పురస్కారమైన భారతరత్నను అందుకొని 1962లో రాష్ట్రపతిగా ఎన్నికైనప్పుడు 'ప్లేటో కల లుగన్న ఫిలాసఫర్ కింగ్' అనే ఊహ సాకారమైనట్లుగా పలువురు విద్యావేత్తలు అమితానందం పొందారు.

రాధాకృష్ణన్‌కు చిన్నతనం నుంచే తాత్త్విక జిజ్ఞాస మెండు. ఉపనిషత్తుల ప్రభావం అతనిపై అధికంగా ఉండేది. ముఖ్యంగా తైత్తిరీయ ఉపనిషత్తులో మౌద్గల్య మహర్షి చెప్పిన ఉపాధ్యాయ లక్షణాలు, విలువలతో అతను ఎంతగానో ప్రభావితమయ్యారు. ఉపాధ్యాయుడు ఎలా ఉండాలి? విద్యార్థికి ఉపాధ్యాయునికి మధ్య ఎలాంటి సంబంధం ఉండాలి? ఎలాంటి లక్షణాలు ఉంటే సమాజంలో ఉపాధ్యాయునికి ప్రతిష్ఠ, గుర్తింపు, స్థాయి లభిస్తాయి, సామాజిక ధర్మాన్ని లేదా సంఘధర్మాన్ని ఉపాధ్యాయుడు ఏ విధంగా నిర్వహించాలనే పెక్కు అంశాలను మౌద్గల్య మహర్షి ఈ తైత్తిరీయ ఉపనిషత్తులో పేర్కొన్నారు. ఉపాధ్యాయుల లక్షణాలు, విధులకు సంబంధించిన 15 అంశాలను వివరించారు. ఆ 15 అంశాలు ఉపాధ్యాయుని విధులను నిర్దేశిస్తాయి. ప్రతిభతో పాటు ఆ 15 లక్షణాలు ఉన్నవ్యక్తే ఆ వృత్తికి అర్హుడు. ప్రతిభ ఒక్కటే ఉపాధ్యాయవృత్తికి కొలమానం కారదు. ప్రతిభతో పాటు సత్యం చెప్పటం, సత్యాన్ని జీవిత పర్యంతం ఆచరించటం, తోటి మానవులయందు దయాదాక్షిణ్యాలు కలిగి ఉండటం, ధర్మబద్ధంగా సంసారం చేయటం, కోపాన్ని నిగ్రహించుకోవటం, నైతిక విలువలను కలిగి ఉండటం, అధ్యయనం, బోధన ఉపాధ్యాయునికి ఉండవల్సిన ప్రధాన లక్షణాలుగా ఈ ఉపనిషత్తు పేర్కొంటుంది. వీటన్నింటిని తన జీవిత పర్యంతం ఆచరించిన వ్యక్తి రాధాకృష్ణన్. ప్రతి ఉపాధ్యాయుడు వీటిని ఆచరించి సమాజంలో ఇతరులకు మార్గదర్శకంగా, ఆదర్శవంతులుగా నిలబడినప్పుడే వాళ్లు సామాజిక ధ

- వంతెన నిర్మించినట్లు అరుణాచల్‌ప్రదేశ్ ఎంపీ వెల్లడి
- అలాంటిదేమీ లేదన్న భారత సైన్యం

భారత భూభాగంలోకి చైనా దళాలు!

ఇటానగర్, సెప్టెంబర్ 4: అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన ఎంపీ తాపిర్ గావో బుధవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత భూభాగంలోకి చైనా దళాలు చొచ్చుకొచ్చాయని, ఓ వంతెన కూడా నిర్మించాయని ఆరోపించారు. చాగ్లగంకు 25 కి.మీ దూరంలో చైనా దళాలు చొరబడ్డాయని, కియోమ్రూ కాలువపై వారు నిర్మించిన బ్రిడ్జిని స్థానిక యువకులు కూడా గుర్తించారని బుధవారం మీడియాకు తెలిపారు. భారత్–చైనా సరిహద్దులోని ఈ ప్రాంతంలో మౌలికసదుపాయాలు అభివృద్ధిచేయాలని రాష్ట్ర ప్రతినిధిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నానని మీడియాతో అన్నారు.

తాపిర్

మరోవైపు ఎంపీ తాపిర్ చెప్పిన అంశాలను భారత ఆర్మీ ఓ ప్రకటనలో ఖండించింది. చైనా దళాలు ఎలాంటి చొరబాటుకు పాల్పడలేదని పేర్కొంది. చేపతోక మాదిరి ఉండే ఈ ప్రాంతంలోని వాస్తవ నియంత్రణ రేఖ (ఎల్‌ఏసీ)పై ఇరు దేశాల మధ్య అవగాహన ఉన్నదని ఆర్మీ అధికారులు వెల్లడించారు. కాల్వలు, చెరువుల వెంబడి ఇరుకైన దారుల్లో భారత్–చైనా దళాలు గస్తీ నిర్వహిస్తాయని, వర్షాకాలంలో రాకపోకల కోసం తాత్కాలిక వంతెనలు నిర్మించడం సాధారణమేనని తెలిపారు. సరిహద్దు సమస్యను 2005 నాటి ఒప్పందం ప్రకారం దౌత్యపరంగా, సామరస్యంగా పరిష్కరించుకునేందుకు ఇరు దేశాలు నిర్ణయించాయన్నారు.

ఈడీకి రూ.31 లక్షల చెక్కు పంపిన తృణమూల్ ఎంపీ

కోల్‌కతా: శారదా చిట్‌ఫండ్ కుంభకోణంలో అభియోగాలను ఎదుర్కొంటున్న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ శతాబ్ది రాయ్ రూ.31 లక్షల చెక్కును ఈడీకి పంపినట్లు బుధవారం అధికారవర్గాలు తెలిపాయి. శారదా చిట్ ఫండ్ కంపెనీ పనిచేసినప్పుడు శతాబ్ది రాయ్ దానికి ప్రచారకర్తగా వ్యవహరించారు. ఇందుకు రూ.49 లక్షల చెల్లింపునకు సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే రూ.31 లక్షల నగదు మాత్రమే తీసుకున్నానని చెప్పారు.

లారీ డ్రైవర్‌కు రూ.59వేలు.. ఆటో డ్రైవర్‌కు రూ.47వేలు ఫైన్

- ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు భారీ జరిమానాలు
- హర్యానా, భువనేశ్వర్‌లో ఘటన

గురుగ్రామ్/భువనేశ్వర్, సెప్టెంబర్ 4: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి పలు నగరాల్లో భారీగా జరిమానాలు విధిస్తున్నారు. మోటారు వాహనాల సవరణ చట్టం సెప్టెంబర్ 1 నుంచి దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నిబంధనలు ఉల్లంఘించిన వారికి ట్రాఫిక్ పోలీసులు పెద్ద మొత్తంలో చలాన్లు జారీ చేస్తున్నారు. వీటిని చూసి వాహనదారులు కంగు తింటున్నారు. హర్యానాలోని గురుగ్రామ్‌లో బుధవారం ఓ లారీ డ్రైవర్‌కు రూ.59,000 జరిమానా విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, రిజిస్టర్డ్ వాహనం కాకపోవడం, ట్రాఫిక్ సిగ్నల్‌ను క్రాస్ చేయడం వంటి పది నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి ఈ మేరకు చలాన్ జారీ చేశారు. అలాగే కొత్త మెటారు వాహనాల చట్టం ప్రకారం ఓ ఆటో డ్రైవర్‌కు రూ.32,500, ఓ వాహనదారుడికి రూ.24,000, ఓ ద్విచక్ర వాహనదారుడికి రూ.23,000 ఫైన్‌ను గురుగ్రామ్ ట్రాఫిక్ పోలీసులు విధించారు. మరోవైపు ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో మద్యం సేవించి ఆటో నడిపిన ఓ డ్రైవర్‌కు ట్రాఫిక్ పోలీసులు మత్తు వదిలించారు. పలు ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి రూ.47,500 జరిమానా విధించారు. కాగా తన పాత ఆటో ఖరీదు రూ.25 వేలని, ఇంత భారీగా చలానా విధించడం దారుణమని ఆటో డ్రైవర్ కహానార్ వాపోయాడు.

పేలుడు ధాటికి కుప్పకూలిన భవనం.. ఘటనాస్థలంలో కొనసాగుతున్న సహాయ చర్యలు

పటాకుల ఫ్యాక్టరీలో భారీ పేలుడు

- 23 మంది మృతి, 27 మందికి గాయాలు
- పంజాబ్‌లోని బటాలాలో ఘటన

బటాలా, సెప్టెంబర్ 4: పంజాబ్‌లోని ఓ పటాకుల ఫ్యాక్టరీలో భారీ పేలుడు సంభవించింది. గురుదాస్‌పూర్ జిల్లా బటాలాలో బుధవారం జరిగిన ఈ ప్రమాదంలో 23 మంది మృతి చెందగా, 27 మంది గాయపడ్డారు. ఫ్యాక్టరీకి చెందిన ఓ యజమానితోపాటు కార్మికులు, రోడ్డు మీదుగా వెళ్లే స్థానికులు ఈ ప్రమాదంలో మృత్యువాత పడినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. శిథిలాల కింద పలువురు చిక్కుకున్నారని, వీరిని రక్షించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు వెల్లడించారు. బటాలా–జలంధర్ రహదారిలోని హన్సాలీ పుల్ వద్ద ఉన్న రెండస్తుల ఫైర్‌క్రాకర్ ఫ్యాక్టరీలో సాయంత్రం 4 గంటలకు ఈ పేలుడు జరిగినట్లు బోర్డర్ రేంజ్ ఐజీ ఎస్‌పీఎస్ పర్మార్ మీడియాకు చెప్పారు. భారీగా నిల్వచేసిన పటాసులు పేలడంతో మంటలు పెద్ద ఎత్తున ఎగసిపడినట్లు వివరించారు. ప్రమాదానికి కారణం ఏమిటన్నది దర్యాప్తు తర్వాత నిర్ధారిస్తామన్నారు. 12 అగ్నిమాపక శకటాలతో మంటలను అదుపుచేసినట్లు జిల్లా యంత్రాంగం పేర్కొన్నది. పేలుడు ధాటికి సమీపంలోని పలు భవనాలతోపాటు వాహనాలు దెబ్బతిన్నట్లు అధికారులు వివరించారు. కాగా ఈ ఘటనలో 23 మంది చనిపోయారని, 27 మంది గాయపడ్డారని బటాలా సీనియర్ వైద్య అధికారి సంజీవ్ భల్లా నిర్ధారించారు. పరిస్థితి విషమంగా ఉన్న కొందరిని అమృతసర్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఆయన తెలిపారు. గురువారం గురునానక్ దేవ్ పెండ్లి మహోత్సవంతో పాటు పలు పండుగల నేపథ్యంలో కర్మాగారంలో కొన్ని రోజులుగా 24 గంటలపాటు పటాసులను పెద్ద ఎత్తున తయారీ చేస్తూ భారీగా నిల్వ ఉంచినట్లు తెలుస్తున్నది. మరోవైపు ఫ్యాక్టరీలో పేలుడు శబ్దం కొన్ని కిలోమీటర్ల దూరం వరకు వినిపించిందని స్థానికులు తెలిపారు. నివాసాల మధ్య ఉన్న పటాకుల ఫ్యాక్టరీని మూసివేయాలని గతంలో పలుమార్లు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు ఆరోపించారు.

మెజిస్టీరియల్ దర్యాప్తునకు సీఎం ఆదేశం

పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పేలుడులో పలువురు చనిపోవడం తనను తీవ్రంగా కలిచివేసిందని ట్వీట్ చేశారు. ఈ ఘటనపై మెజిస్టీరియల్ దర్యాప్తునకు ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, తీవ్రంగా గాయపడినవారికి రూ.50,000, స్వల్పంగా గాయపడిన వారికి రూ.25,000 చొప్పున ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారు. ఈ ఘటనపై గురుదాస్‌పూర్ ఎంపీ, బాలీవుడ్ నటుడు సన్నీడియోల్ విచారం వ్యక్తం చేశారు. అగ్నిమాపక సిబ్బందితోపాటు ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ దళాలు సహాయక చర్యలు చేపడుతున్నాయని ట్విట్టర్‌లో వెల్లడించారు.

జోక్యం సహించం

ఏ దేశ వ్యవహారాల్లోనూ ఇతరులు వేలు పెట్టొద్దు

భారత్-రష్యా పాటించే వైఖరి ఇదే

- రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అనంతరం మోదీ ఉద్ఘాటన
- ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2025 నాటికి 30 బిలియన్ డాలర్లకు పెంచాలని నిర్ణయం
- చెన్నై-వ్లాదివాస్తోక్ మధ్య జలమార్గం ఏర్పాటుకు ప్రతిపాదన
- గగన్‌యాన్ కోసం భారత వ్యోమగాములకు రష్యా శిక్షణ

వ్లాదివాస్తోక్ (రష్యా), సెప్టెంబర్ 4: ప్రపంచంలో ఏ దేశ అంతర్గత వ్యవహారాల్లోనైనా.. 'బయటి వారు' జోక్యం చేసుకోవటాన్ని భారత్, రష్యా సహించబోవని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. కశ్మీర్‌పై ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో.. కశ్మీర్ అంశం పూర్తిగా తమ అంతర్గత వ్యవహారం అన్న మన దేశ విధానాన్ని ఈ విధంగా ప్రధాని మోదీ రష్యా వేదికగా ప్రపంచానికి మరోసారి చాటిచెప్పారు. రెండురోజుల పర్యటన కోసం మోదీ మంగళవారం రాత్రి రష్యాలోని వ్లాదివాస్తోక్ చేరుకున్నారు. రష్యా తూర్పు ప్రాంతంలోని ఈ నగరాన్ని సందర్శించిన తొలి భారత ప్రధాని మోదీ కావడం విశేషం. భారత్–రష్యా 20వ వార్షిక సదస్సులో మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పాల్గొన్నారు. అంతకుముందు మోదీ, పుతిన్ ఒక నౌకలో విహరిస్తూ ముఖాముఖి మాట్లాడుకున్నారు. చర్చల అనంతరం ఇద్దరు నేతలు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు.

కశ్మీర్ విషయంలో భారత్‌కు రష్యా మద్దతు

'ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో బయటి వారి జోక్యానికి మేమిద్దరం వ్యతిరేకం' అని మోదీ స్పష్టం చేశారు. జమ్ముకశ్మీర్‌కున్న ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేశాక భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు తలెత్తిన నేపథ్యంలో మోదీ ఈ వ్యాఖ్య చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయ సమస్యగా మార్చేందుకు ఓవైపు పాక్ ప్రయత్నిస్తుండగా, ఆర్టికల్ 370ని రద్దు చేయడం తమ అంతర్గత వ్యవహారమని భారత్ ప్రపంచానికి చాటిచెప్పిన సంగతి తెలిసిందే. జమ్ముకశ్మీర్ విభజన, ఆర్టికల్ 370 రద్దుకు దారితీసిన పరిస్థితులను ప్రధాని మోదీ రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు వివరించారని విదేశాంగ శాఖ కార్యదర్శి విజయ్ గోఖలే చెప్పారు. మరోవైపు వాణిజ్యం–పెట్టుబడులు, చమురు–గ్యాస్, మైనింగ్, అణు ఇంధనం, రక్షణ–భద్రత, గగనతలం–సముద్ర మార్గాల్లో సంబంధాలు, రవాణా సదుపాయాలు, అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం, అంతరిక్షం, ఉగ్రవాద నిరోధక చర్యలు, ఉభయ దేశాల ప్రజల మధ్య సంబంధాలలో సహకారాన్ని మరింత పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఇద్దరు నేతలు చర్చలు జరిపారని గోఖలే తెలిపారు. ఇరు పక్షాలు 15 ఒప్పందాలు/అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశాయని చెప్పారు. సంయుక్త మీడియా సమావేశంలో పుతిన్ మాట్లాడుతూ, రష్యాకు భారత్ అత్యంత కీలక భాగస్వామి అని అన్నారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన సూత్రాలను, అంతర్జాతీయ చట్టంలోని నియమ నిబంధనలను సానుకూల దృక్పథంతో అమలు చేయడం ద్వారా ద్వంద్వ ప్రమాణాలను అరికట్టవచ్చని, ఇతర దేశాలపై తమ ఇష్టారాజ్యాన్ని సాగించే చర్యలను నివారించవచ్చని ఉభయ దేశాలు అభిప్రాయపడ్డాయి. భారత్–రష్యా మధ్య సహకారంలో నూతన ప్రమాణాలను నెలకొల్పే దిశగా పుతిన్‌తో చర్చలు జరిగాయని మోదీ చెప్పారు.

2001లో గుజరాత్ సీఎంగా నాటి ప్రధాని వాజపేయితో కలిసి రష్యాలో పర్యటించిన జ్ఞాపకాలను ప్రధాని మోదీ తాజాగా గుర్తు చేసుకున్నారు. ఆ పర్యటనకు సంబంధించిన 4 ఫొటోలను ట్విట్టర్ వేదికగా పంచుకున్నారు. నాడు కూడా తాను భారత్–రష్యా వార్షిక సదస్సులో పాల్గొనేందుకు వచ్చానని తెలిపారు. తొలిసారిగా అప్పుడే అధ్యక్షుడు పుతిన్‌ను కలుసుకొనే అవకాశం లభించిందని పేర్కొన్నారు. పుతిన్ తనను ఒక చిన్న రాష్ట్ర సీఎంనని భావించకుండా ఒక స్నేహితునిగా తనకు ఆతిథ్యం ఇచ్చారని గుర్తు చేసుకున్నారు.

వ్యూహాత్మక భాగస్వామ్యానికి పునాది వంటి వని ఉభయదేశాల సంయుక్త ప్రకటన పేర్కొంది. సైనిక పరికరాలు, విడిభాగాల ఉత్పత్తి సహా తమ మధ్య రక్షణ సహకారాన్ని పెంపొందించుకోవాలని నిర్ణయించాయి.


రష్యాలోని వ్లాదివాస్తోక్‌లో పుతిన్‌తో ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ

భద్రతా మండలిని సంస్కరించాలి

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిని సంస్కరించాలని ఉభయ దేశాలు పిలుపునిచ్చాయి. నేటి ప్రపంచంలో వాస్తవిక పరిస్థితులను భద్రతామండలి ప్రతిబింబించాలని పేర్కొన్నాయి. భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించే విషయమై రష్యా తన మద్దతును ప్రకటించింది. మోదీ, పుతిన్ ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదంపై పోరులో అంతర్జాతీయ సమాజం ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, మాదక ద్రవ్యాల రవాణా, సీమాంతర వ్యవస్థీకృత నేరాలు, ప్రాంతీయ ఉగ్రవాద వ్యతిరేక చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని భారత్, రష్యా నిర్ణయించాయి. అణు సరఫరా బృందం (ఎన్‌ఎస్జీ)లో కూడా భారత్ సభ్యత్వానికి రష్యా తన మద్దతును తెలిపింది.

లండన్‌లో భారత దౌత్య కార్యాలయంపై పాకిస్థానీయుల దాడి

- ఖండించిన భారత్.. దుండగులను శిక్షించాలని బ్రిటన్ ప్రభుత్వానికి డిమాండ్
- దాడి గర్హనీయం: బ్రిటన్ విదేశాంగ మంత్రి రాబ్

లండన్‌లోని భారత దౌత్యకార్యాలయం ముందు గుమిగూడిన ఆందోళనకారులు

లండన్: బ్రిటన్‌లోని కొన్ని పాకిస్థానీ సంస్థలకు చెందిన ఆందోళనకారులు లండన్‌లోని భారత హైకమిషన్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రదర్శన హింసాత్మకంగా మారింది. అల్లరిమూకలు భారత హైకమిషన్ కార్యాలయంపై దాడికి పాల్పడటంతో కిటికీల అద్దాలు పగిలిపోయాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ దాడిని భారత్ ఖండించింది. అల్లరిమూకలను పాక్ ప్రభుత్వమే ప్రేరేపించిందని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బ్రిటన్‌ను కోరింది. మరోవైపు భారత దౌత్య కార్యాలయంపై దాడి గర్హనీయమని బ్రిటన్ విదేశాంగ మంత్రి డొమానిక్ రాబ్ అన్నారు. బ్రిటన్‌లోని పాకిస్థాన్ సంతతికి చెందిన ఆందోళనకారులు వందల సంఖ్యలో మంగళవారం 'కశ్మీర్ ఫ్రీడం మార్చ్' పేరిట ప్రదర్శన నిర్వహించారు. పార్లమెంట్ స్క్వేర్ వద్ద ప్రారంభమైన ఈ ప్రదర్శన ఇండియా హౌస్ వైపు సాగింది. అనంతరం కొందరు అల్లరిమూకలు హైకమిషన్ కార్యాలయంపైకి రాళ్లు, గుడ్లు, టమాటాలు, చెప్పులు, పొగ బాంబులు, సీసాలు విసురుతూ విధ్వంసానికి పాల్పడ్డారు. నిరసనకారులు భారత వ్యతిరేక నినాదాలు చేస్తూ, 'కశ్మీర్‌కు విముక్తి కల్పించాలి' అని రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. ఆస్తులు ధ్వంసం చేసిన నేరం కింద ఇద్దరిని అరెస్టు చేశామని మెట్రోపాలిటన్ పోలీస్ ప్రతినిధి చెప్పారు. పాక్ సంతతికి చెందిన లండన్ మేయర్ సాదిక్‌ఖాన్ కూడా ఆందోళనకారుల హింసను ఖండించారు. విధ్వంసానికి పాల్పడిన దుండగులపై చర్య తీసుకోవాలని ఆయన పోలీసులకు సూచించారు.

కారకులపై చర్యలు తీసుకోవాలి: భారత్

లండన్‌లోని ఇండియన్ హైకమిషన్ వద్ద నెల రోజుల వ్యవధిలో రెండుసార్లు హింస చోటు చేసుకుందని, ఇందుకు కారకులైన వారిపై కఠిన చర్య తీసుకోవాలని బ్రిటన్ ప్రభుత్వాన్ని భారత్ కోరింది.

- స్తంభించిన జనజీవనం
- రైళ్లు, విమానాల రాకపోకలకు అంతరాయం
- చుట్టుపక్కల జిల్లాల్లోనూ భారీ వర్షం
- రెడ్‌అలర్ట్ జారీ చేసిన ఐఎండీ

ముంబైలో నడుములోతు నీళ్లలో సురక్షిత ప్రాంతానికి తరలివెళ్తున్న ఓ కుటుంబం

ముంబైని ముంచెత్తిన వాన

ముంబై, సెప్టెంబర్ 4: దేశ ఆర్థిక రాజధాని ముంబైని భారీ వర్షం ముంచెత్తింది. లోతట్టు ప్రాంతాలు జలమయమవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు పలు లోకల్ రైళ్ల సేవలను నిలిపివేశారు. విమానాలు ఆలస్యంగా నడిచాయి. వర్షపు నీరు భారీగా రోడ్లపై చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనాలు చాలా నిదానంగా ముందుకు సాగడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. నగరంలోని పాఠశాలలను మూసివేయాలని అధికారులు ఆదేశించారు. మరోవైపు రానున్న 24 గంటల్లో ముంబై, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్న భారత వాతావరణ విభాగం (ఐఎండీ) బుధవారం 'రెడ్ అలర్ట్'ను జారీ చేసింది. ఇటు బంగాళాఖాతంలో, అటు అరేబియా సముద్రంలో అల్పపీడన ద్రోణి ఏర్పడటంతోనే ఈ భారీ వర్షాలు కురుస్తున్నాయని ఐఎండీ తెలిపింది. ముంబై మెట్రోపాలిటిన్ ప్రాంత పరిధిలో 150 వాతావరణ కేంద్రాలు ఉండగా.. అందులో దాదాపు 100 కేంద్రాల్లో గడిచిన 24 గంటల్లో 200 మి.మీ.కుపైగా వర్షపాతం నమోదైందని పేర్కొంది. రాయ్‌గఢ్ జిల్లాలో దాదాపు 300 మి.మీ., పాల్‌గఢ్ జిల్లాలోని కొన్ని ప్రాంతాలు, థానె జిల్లాలో 204 మి.మీ. వర్షం కురిసిందని వెల్లడించింది. ఇంకోవైపు థానె జిల్లాలోని నైకేపాడా ప్రాంతంలో 62 ఏండ్ల వయసున్న ఓ వ్యక్తి నాలాలో కొట్టుకుపోయారు.కోలాపూర్‌లోనూ భారీ వర్షం కురువడంతో డ్యాంలలోకి భారీగా నీరు చేరుతున్నది. గడ్చిరోలి, గోండియా జిల్లాల్లో 100కుపైగా గ్రామాలకు చుట్టుపక్కల ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి. ప్రధానంగా ఈ జిల్లాలకు అనుసంధానంగా ఉన్న రోడ్లపై భారీగా నీరు చేరడంతోనే రాకపోకలు నిలిచిపోయాయి. ఇదే పరిస్థితి రత్నగిరి, సింధుర్గ్ జిల్లాల్లోనూ నెలకొంది. రాయ్‌గఢ్‌లోని తాంహిని ఘాట్, గగన్‌బావ్‌డా ఘాట్‌లలో కొండచరియలు విరిగిపడటంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పట్టాలపై నీరు నిలువడంతో జైపూర్–ముంబై దురంతో ఎక్స్‌ప్రెస్ రైలును వైతర్నా స్టేషన్ సమీపంలో దాదాపు గంట సేపు నిలిపి ఉంచారు. గత నెలలో కురిసిన భారీ వర్షాల వల్ల పశ్చిమ మహారాష్ట్ర ప్రాంతంలో వరదలు పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. పరిస్థితిని నిత్యం సమీక్షించాలని అధికారులను ఆదేశించింది.

'ఉగ్ర' చొరబాటు యత్నం

కశ్మీర్‌లో ఇద్దరు ఉగ్రవాదులను పట్టుకున్న సైన్యం
తమకు లష్కరే, పాక్ సైన్యం శిక్షణ ఇచ్చాయన్న చొరబాటుదారులు
నిరాశా నిస్పృహల్లో పాక్: లెఫ్టినెంట్ జనరల్ ధిల్లాన్ ధ్వజం

శ్రీనగర్: కశ్మీర్ లోయలో చొరబడేందుకు యత్నించిన ఇద్దరు లష్కరే తాయిబా ఉగ్రవాదులను సైన్యం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నది. కశ్మీర్‌లో శాంతికి విఘాతం కలిగించే లక్ష్యం కోసమే వారు చొరు చొరబడ్డారని ఆర్మీ 15 కార్ప్స్ కమాండింగ్ జనరల్ ఆఫీసర్ (జీవోసీ) లెఫ్టినెంట్ జనరల్ కేజేఎస్ ధిల్లాన్, జమ్ముకశ్మీర్ అదనపు డీజీ మునీర్‌ఖాన్ బుధవారం మీడియాకు చెప్పారు. సరిహద్దు ఆవల నుంచి ఏడుగురు ఉగ్రవాదులు చొరబడేందుకు యత్నిస్తున్నారన్న నిఘా వర్గాల సమాచారం మేరకు గత నెల 21న గుల్మార్గ్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ (ఎల్వోసీ)కి సమీపంలో లష్కరే తాయిబాకు చెందిన ఇద్దరు పాక్ జాతీయులను సైన్యం పట్టుకున్నది. సైన్యానికి చిక్కిన లష్కరే ఉగ్రవాదులిద్దరూ తాము పాక్ వాసులమని, తమకు లష్కరే, పాక్ సైన్యం శిక్షణనిచ్చాయని అంగీకరించిన వీడియోలను ధిల్లాన్, మునీర్‌ఖాన్ మీడియా ముందు ప్రదర్శించారు. వీడియోల్లోని వారు తాము పాక్‌లోని రావల్పిండి వాసులమని, తమ పేర్లు మహ్మద్ ఖలీల్, మహ్మద్ నజీం అని చెప్పారు. మహ్మద్ నజీం మాట్లాడుతూ 'కశ్మీర్‌లో మేం చొరబడేందుకు పాక్ ఆర్మీ సాయం చేసింది. భారత ఆర్మీ యానిట్లే మా లక్ష్యం' అని చెప్పాడు. కాగా, లెఫ్టినెంట్ జనరల్ ధిల్లాన్ మాట్లాడుతూ.. 'కశ్మీర్‌లో చొరబడి ఉగ్రవాద కార్యకలాపాలను చేపట్టేందుకు పాక్, ఆ దేశ సైన్యం, పాక్ పొరులు యత్నిస్తున్నారని ఈ రెండు వీడియోలు చాలా స్పష్టంగా తెలుపుతున్నాయి. ప్రత్యేకించి గత నెల ఐదో తేదీ నుంచి కశ్మీర్‌లో శాంతికి విఘాతానికి వారు యత్నిస్తున్నారు' అని చెప్పారు. పాక్ నిరాశానిస్పృహలతోనే ఉగ్రవాదుల చొరబాటుకు ప్రయత్నిస్తున్నదని ధిల్లాన్ ఆరోపించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) పొడవునా చొరబాట్లకు ఉగ్రవాదులు సిద్ధంగా ఉన్నారన్నారు. కొన్ని రోజులుగా సైన్యం కాల్పుల్లో ఐదు నుంచి ఏడుగురు మిలిటెంట్లు హతమవుతున్నారని, వారి మృతదేహాలను తీసుకెళ్లాలని పాక్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ)కు తెలిపినా వారు నిరాకరించారన్నారు. ఇప్పుడు తమ వద్ద ఇద్దరు ఉగ్రవాదులు బందీలుగా ఉన్నారన్నారు. అదనపు డీజీ మునీర్‌ఖాన్ మాట్లాడుతూ కశ్మీర్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామని, ప్రాణనష్టం జరుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

మహ్మద్ ఖలీల్ మహ్మద్ నజీమ్

ముంబైని ముంచెత్తిన వాన

ముంబై, సెప్టెంబర్ 4: దేశ ఆర్థిక రాజధాని ముంబైని భారీ వర్షం ముంచెత్తింది. లోతట్టు ప్రాంతాలు జలమయమవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు పలు లోకల్ రైళ్ల సేవలను నిలిపివేశారు. విమానాలు ఆలస్యంగా నడిచాయి. వర్షపు నీరు భారీగా రోడ్లపై చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనాలు చాలా నిదానంగా ముందుకు సాగడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. నగరంలోని పాఠశాలలను మూసివేయాలని అధికారులు ఆదేశించారు. మరోవైపు రానున్న 24 గంటల్లో ముంబై, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్న భారత వాతావరణ విభాగం (ఐఎండీ) బుధవారం 'రెడ్ అలర్ట్'ను జారీ చేసింది. ఇటు బంగాళాఖాతంలో, అటు అరేబియా సముద్రంలో అల్పపీడన ద్రోణి ఏర్పడటంతోనే ఈ భారీ వర్షాలు కురుస్తున్నాయని ఐఎండీ తెలిపింది. ముంబై మెట్రోపాలిటిన్ ప్రాంత పరిధిలో 150 వాతావరణ కేంద్రాలు ఉండగా.. అందులో దాదాపు 100 కేంద్రాల్లో గడిచిన 24 గంటల్లో 200 మి.మీ.కుపైగా వర్షపాతం నమోదైందని పేర్కొంది. రాయ్‌గఢ్ జిల్లాలో దాదాపు 300 మి.మీ., పాల్‌గఢ్ జిల్లాలోని కొన్ని ప్రాంతాలు, థానె జిల్లాలో 204 మి.మీ. వర్షం కురిసిందని వెల్లడించింది. ఇంకోవైపు థానె జిల్లాలోని నైకేపాడా ప్రాంతంలో 62 ఏండ్ల వయసున్న ఓ వ్యక్తి నాలాలో కొట్టుకుపోయారు.కోలాపూర్‌లోనూ భారీ వర్షం కురువడంతో డ్యాంలలోకి భారీగా నీరు చేరుతున్నది. గడ్చిరోలి, గోండియా జిల్లాల్లో 100కుపైగా గ్రామాలకు చుట్టుపక్కల ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి. ప్రధానంగా ఈ జిల్లాలకు అనుసంధానంగా ఉన్న రోడ్లపై భారీగా నీరు చేరడంతోనే రాకపోకలు నిలిచిపోయాయి. ఇదే పరిస్థితి రత్నగిరి, సింధుర్గ్ జిల్లాల్లోనూ నెలకొంది. రాయ్‌గఢ్‌లోని తాంహిని ఘాట్, గగన్‌బావ్‌డా ఘాట్‌లలో కొండచరియలు విరిగిపడటంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పట్టాలపై నీరు నిలువడంతో జైపూర్–ముంబై దురంతో ఎక్స్‌ప్రెస్ రైలును వైతర్నా స్టేషన్ సమీపంలో దాదాపు గంట సేపు నిలిపి ఉంచారు. గత నెలలో కురిసిన భారీ వర్షాల వల్ల పశ్చిమ మహారాష్ట్ర ప్రాంతంలో వరదలు పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. పరిస్థితిని నిత్యం సమీక్షించాలని అధికారులను ఆదేశించింది.

ఉద్యమానికి తలవంచిన హాంకాంగ్

- అనుమానాస్పద వ్యక్తుల అప్పగింత బిల్లు ఉపసంహరణ
- ఉద్యమం కొనసాగుతుందన్న ప్రజాస్వామ్యవాదులు

హాంకాంగ్‌లో ప్రజాస్వామ్య నిరసనోద్యమం (ఫైల్)

హాంకాంగ్ సీఈఓ క్యారీ లామ్

హాంకాంగ్, సెప్టెంబర్ 4: హాంకాంగ్‌లో మూడు నెలలుగా సాగుతున్న ప్రజాస్వామ్య అనుకూల ఉద్యమానికి ఎట్టకేలకు ఆ దేశ అధినాయకురాలు తలవంచారు. ఇంతటి నిరసనోద్యమానికి కారణమైన అనుమానాస్పద వ్యక్తుల అప్పగింత బిల్లును ఉపసంహరించుకుంటున్నట్లు హాంకాంగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి క్యారీ లామ్ బుధవారం ప్రకటించారు. అయితే ఈ ప్రకటనను నమ్మని నిరసనకారులు తమ ఆందోళన కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వం దృష్టిలో నేరపూరిత, అనుమానాస్పద వ్యక్తులుగా ఉన్నవాళ్లను చైనాకు అప్పగించేందుకు ఉద్దేశించిన బిల్లును ఆమోదించడానికి క్యారీలామ్ ప్రయత్నించారు. ఇది వ్యక్తిగతస్వేచ్ఛను, రాజకీయ హక్కులను హరించివేస్తుందని భావించిన ప్రజలు గత మూడు నెలలుగా తీవ్రస్థాయిలో ఆందోళనలు కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. లక్షల సంఖ్యలో ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు చేపట్టడమే కాకుండా, ప్రభుత్వ కార్యకలాపాలకు సైతం ఆటంకం కలిగించారు. వివాదాస్ప

రెవెన్యూకు మోఖా దొరికింది

రికార్డుల ప్రక్షాళనలో కొత్త సమస్యను సృష్టించిన అధికారులు

- వివాదంలోకి ఇరవై ఎకరాల భూమి
- ఊళ్లో లేనందుకు సాదాబైనామా అంటూ పెండింగ్‌లోకి..
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన ములుగు జిల్లావాసి ప్రమోద్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం కోయగూడ (ఎ ల్లాపూర్) గ్రామానికి చెందిన జీ ప్రమోద్‌కుమార్‌కు సర్వే నంబర్లు 102/ఏలో 2.13 ఎకరాలు, 103/జీలో 2.07 ఎకరాలు, 105లో 20.05 ఎకరాల భూమి ఉన్నది. ఈ భూమి తన తండ్రి నుంచి ప్రమోద్‌కుమార్‌కు వారసత్వంగా సంక్రమించింది. ప్రమోద్‌కు విరాసత్ చేసి పట్టాదారు పాస్‌పుస్తకం కూడా రెవెన్యూ అధికారులు అందజేశారు. తన పిల్లలను చదివించుకోవడానికి ప్రమోద్‌కుమార్ హైదరాబాద్‌కు వలసపోయి ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నారు. రెండేండ్ల కింద ప్రభుత్వం భూరికార్డుల ప్రక్షాళన చేపట్టేంతవరకు ఈ భూమిపై ఎలాంటి వివాదం లేదు. రికార్డుల ప్రక్షాళన సమయంలో ప్రమోద్‌కుమార్‌కు ఉన్న భూమిలో రెండు సర్వే నంబర్లను మాత్రమే కొత్త పాస్‌పుస్తకంలో నమోదుచేశారు. ఆ రెండు సర్వే నంబర్లలోని 4.20 ఎకరాలకు ప్రభుత్వం అందజేస్తున్న రైతుబంధు పథకం కూడా వర్తిస్తున్నది. కానీ, సర్వే నంబర్ 105 లోని 20.05 ఎకరాల భూమిని మాత్రం పాస్ పుస్తకంలో ఎక్కించకుండా రెవెన్యూ అధికారులు పెండింగ్‌లో పెట్టారు. ఈ విషయమై అధికారులను విచారించగా.. తాను మోఖాపై లేనని, భూమిని దున్నుకోవడం లేదు కాబట్టి పెండింగ్‌లో ఉంచినట్టు చెప్పారు. అందుకే పట్టాదారు పాస్‌పుస్తకం ఇవ్వడంలేదని తెలిపారు. భూమిని ఎందుకు పెండింగ్‌లో ఉంచారో తెలుసుకోవడానికి సీసీఎల్‌ఏ వెబ్‌సైట్‌లో పరిశీలిస్తే 'సాదాబైనామా' అని ఉన్నట్టు ప్రమోద్ పేర్కొన్నారు. తాను కానీ, తన తండ్రి కానీ భూమిని ఎవరికీ విక్రయించలేదని.. అలాంటప్పుడు సాదాబైనామా అని ఏ ప్రాతిపదికన చెప్తారని బాధితుడు ప్రశ్నిస్తున్నారు. హైదరాబాద్‌లో ఉంటున్నంతమాత్రాన తన పేరిట ఉన్న భూమిని ఎలా తొలగిస్తారని ఆవేదన వ్యక్తంచేశారు. 'నా భూమిని ఎవరైనా ఆక్రమిస్తే వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాల్సిన అధికారులే.. నేను కాస్తులో లేనంటూ పెండింగ్‌లో పెట్టడమేమిటో అర్థం కావడం లేదు. రెండేండ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ.. చూద్దామని ఒకసారి.. నీకు రాదని మరోసారి.. నీవు కబ్జాలో లేవు కదా అని ఇంకొకసారి.. పొంతన లేకుండా అధికారులు మాట్లాడుతున్నారు. కాలికేస్తే మెడకు, మెడకేస్తే కాలికి వేస్తున్నారు' అని ప్రమోద్‌కుమార్ వాపోయారు. తన భూమిని అన్యాయంగా వివాదంలోకి లాగారని.. రికార్డుల్లో నుంచి 'పెండింగ్'ను తీసివేసి 20.05 ఎకరాలను తన పేరిట నమోదుచేసి కొత్త పట్టాదారు పాస్‌పుస్తకం ఇప్పించాలని వేడుకొంటున్నారు. ఈ వ్యవహారంలో ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని బాధితుడు కోరుతున్నారు.



ఏటూరు నాగారం రెవెన్యూ అధికారులు బాధితుడు ప్రమోద్‌కుమార్‌కు జారీచేసిన పాత పాస్‌పుస్తకంలో సర్వే నంబర్ 105లోని 20.05 ఎకరాల భూమి నమోదై ఉన్న దృశ్యం.

మాధవరావుకు భూహక్కు కల్పిస్తాం

- మహబూబాబాద్ జిల్లా గార్ల తాసిల్దార్ కృష్ణ
- 'తప్పు చేస్తారు.. సవరించరు' కథనానికి స్పందన
- పాతపోచారంలో భూమికి హద్దులు ఏర్పాటు

మాధవరావు భూ వివరాలను స్థానిక రైతులను అడిగి తెలుసుకొంటున్న తాసిల్దార్ కృష్ణ

గార్ల: 'తప్పు చేస్తారు.. సవరించరు' శీర్షికతో బుధవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఒకరి భూమిని మరొకరికి పట్టాచేశారని, తప్పుచేసిన అధికారులే పట్టించుకోవడంలేదని మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పాతపోచారానికి చెందిన బాధితుడు సుంకర మాధవరావు 'ధర్మగంట'ను ఆశ్రయించారు. దీనిపై కథనం ప్రచురితమవడంతో తాసిల్దార్ కృష్ణ స్పందించి.. ఆర్ఐ సీహెచ్ నర్సింహారావు, వీఆర్వో గుగులోత్ మంగీలాల్, సర్వేర్ వెంకన్నతో కలిసి బుధవారం పాతపోచారం గ్రామానికి వెళ్లారు. బాధితుడు మాధవరావుతోపాటు కుటుంబసభ్యుల భూమికి సంబంధించిన వివరాలను స్థానిక రైతులను అడిగి తెలుసుకొన్నారు. సర్వే నంబర్ 130లో ఉన్న భూమి మొత్తాన్ని దగ్గరుండి సర్వేచేయించారు. భూమి చుట్టూ హద్దులను గుర్తించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడూ.. సర్వే నంబర్ 130లో మొత్తం 8.39 ఎకరాల భూమి ఉన్నదని చెప్పారు. 1966 మే 5న.. పల్ల వీరయ్య కొడుకు పల్ల రామయ్య వద్ద ఈ భూమిని కొనుగోలుచేసిన ఆధారాలతోపాటు రికార్డుల్లో క్షుణ్ణంగా పరిశీలించామని తెలిపారు. వివాదాస్పదమైన ఈ భూమి వ్యవహారం ఈ రోజు వరకు తన దృష్టికి రాలేదని.. 'ధర్మగంట'లో ప్రచురితమైన తర్వాతే తెలిసిందని వెల్లడించారు. ఈ భూమి ఒకే కుటుంబానికి చెందిన సుంకర మాధవరావు, సుంకర చందర్‌రావు, సుంకర కృష్ణవేణిదని తాసిల్దార్ కృష్ణ తేల్చిచెప్పారు. పొరపాటున 4.39 ఎకరాల భూమి పల్ల రామయ్య పేరిట నమోదుచేశారని, ఆ పట్టా హక్కు పత్రాన్ని రద్దుచేస్తామని వివరించారు. ఆన్‌లైన్‌లో తక్షణమే తొలగిస్తామని, త్వరలోనే బాధితులు మాధవరావు, చందర్‌రావు, కృష్ణవేణికి భూమి పట్టా హక్కుతోపాటు పాస్‌పుస్తకాలు అందజేస్తామని తాసిల్దార్ కృష్ణ తెలిపారు. భూమికి సంబంధించిన ఫైల్ వేగంగా తయారుచేసి, తనకు అందజేయాలని వీఆర్వో గుగులోత్ మంగీలాల్‌ను ఆదేశించారు.

రంగంపేటలో సాసైటీ భూమి సర్వే

- 'నిన్న పట్టాదారు.. నేడు అనుభవదారు' కథనానికి స్పందన
- సర్వే నివేదికను తాసిల్దార్‌కు అందజేస్తామన్న కొల్చారం సర్వేయర్

కొల్చారం: 'నిన్న పట్టాదారు.. నేడు అనుభవదారు' శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో ఆగస్టు 26న ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. బతుకుదెరువు కోసం వలస వెళ్తే.. స్వగ్రామమైన మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని రంగంపేటలో తండ్రి భద్రప్ప పేరిట ఉన్న సర్వే నంబర్ 297లోని 13 గుంటల పట్టా భూమిని రెవెన్యూ అధికారులు సహకార సంఘానికి అక్రమంగా పట్టాచేశారని భద్రప్ప వారసులు వీరప్ప, సుగుణ 'ధర్మగంట'ను ఆశ్రయించారు. దీనిపై కథనం ప్రచురితమవడంతో కొల్చారం తాసిల్దార్ ఎన్ సహదేవ్ ఆదేశాల మేరకు మండల సర్వేయర్ అనురాధ, గ్రామ రెవెన్యూ అధికారి భిక్షపతి బుధవారం రంగంపేటకు వెళ్లి సర్వే నంబర్ 297 తోపాటు చుట్టుపక్కల సర్వే నంబర్లలో సర్వే నిర్వహించారు. నివేదికను తాసిల్దార్‌కు అందజేయనున్నట్టు మండల సర్వేయర్ అనురాధ తెలిపారు.

కొల్చారం మండలంలోని రంగంపేటలో సాసైటీ భూమిని సర్వేచేస్తున్న అధికారులు

ఐదెకరాలు మరొకరికి బదిలీ

- మూడు విడుతల రైతుబంధు రూ.65 వేలు అందజేత
- రికార్డులను సవరించని రెవెన్యూ అధికారులు
- ములుగు జిల్లా కాశీందేవిపేటలో సిబ్బంది నిర్లక్ష్యం
- న్యాయంచేయాలంటున్న బాధితుడు తోట మహేందర్

ములుగు జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: 'నాకు మా తండ్రి నుంచి వారసత్వంగా లభించిన ఐదెకరాల భూమిని అధికారులు ఇతరుల పేరిట బదలాయించారు. ఆ భూమిని నా పేరిట తిరిగి నమోదుచేయాలని రెండేండ్లుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న. నా సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదు. మాది ములుగు జిల్లా కాశీందేవిపేట. ఈ గ్రామ పంచాయతీ పరిధిలోని రామయ్య పల్లి శివారులో సర్వే నంబర్ 477/2/ఇ/2లో 9.20 ఎకరాలు వారసత్వంగా సంక్రమించింది. పదిహేనేండ్లుగా ఆ భూమి నా పేరిటే ఉన్నది. భూరికార్డుల ప్రక్షాళన అనంతరం 4.20 ఎకరాలు మాత్రమే నా పేరిట నమోదుచేసి మిగిలిన ఐదెకరాలను ఇదే గ్రామానికి చెందిన కన్నెబోయిన కుమారస్వామి (తండ్రి మల్లయ్య) పేరిట ఎక్కించారు. రికార్డులను సవరించాలని అధికారులను వేడుకొంటున్నా స్పందించడంలేదు. అయాచితంగా ఐదెకరాలు నమోదైన కుమారస్వామి.. రైతుబంధు పథకం కింద 2018లో మొదటి విడుతలో రూ.20 వేలు, రెండో విడుతలో రూ.20 వేలు, 2019 వానకాలంలో రూ.25 వేలు.. మొత్తంగా రూ.65 వేలు పొందాడు. గ్రామంలో పెద్ద మనుషుల సమక్షంలో కుమారస్వామిని పిలిపించి అడిగితే 477/2/ఇ/2 సర్వే నంబర్ గల భూమితో తనకు ఎలాంటి సంబంధం లేదని పేపర్‌పైన రాసి ఇచ్చాడు. ఆ కాగితాన్ని రెవెన్యూశాఖ అధికారులకు అందించినా ఫలితం లేకుండా పోయింది. ఆర్డీవోను సంప్రదిస్తే అది ఇప్పుడు నీ పేరున మార్చడం కష్టం. నీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకోమని సలహా ఇచ్చారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాకు న్యాయంచేయాలని వేడుకొంటున్నా'

- తోట మహేందర్, కాశీందేవిపేట

రెండేండ్లుగా పట్టా మారుస్తలేరు

నల్లగొండ జిల్లా నిడమనూరువాసి గోగుల శ్రీనివాస్ ఆవేదన

నిడమనూరు: పట్టాదారు చనిపోతే వారసుల పేరిట పట్టా మార్పిడిచేసేందుకు రెవెన్యూ అధికారులు రెండేండ్లుగా తిప్పుకొంటున్నారు. అధికారుల తీరుతో విసిగిపోయిన నల్లగొండ జిల్లా నిడమనూరుకు చెందిన బాధితుడు గోగుల శ్రీనివాస్ 'ధర్మగంట'ను ఆశ్రయించారు. నిడమనూరుకు చెందిన గోగుల పెద్ద భిక్షమయ్యకు మండలంలోని ముప్పారం గ్రామ శివారులో సర్వే నంబర్ 637/2ఏలో 2. 26 ఎకరాల మెట్ట భూమి ఉన్నది. భిక్షమయ్య 2017 సెప్టెంబర్ 6న మృతిచెందారు. దీంతో ఆయన కుమారులు వెంకన్న, శ్రీనివాస్, దినేశ్ తమ తండ్రి పేరిట ఉన్న భూమిని తమ పేరిట పట్టా మార్పిడిచేయాలని అధికారులకు దరఖాస్తు చేసుకొన్నారు. రెండేండ్లుగా వీఆర్వో చుట్టూ తిరుగుతున్నా నేటికీ పనికాలేదని గోగుల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తంచేశారు. పట్టా మార్పిడికోసం వీఆర్వో తన సొంత వ్యవసాయ భూమిలో ఏర్పాటుచేసుకొనేందుకు అవసరమైన సిమెంట్ గూనలను తమతో కొనుగోలు చేయించి తీసుకున్నట్టు బాధితులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని న్యాయంచేయాలని కోరుతున్నారు.

వెబ్‌సైట్‌లో కొత్త ఖాతాలు నమోదైతలేవు

కొత్త ఖాతాల నమోదును వెబ్‌సైట్ తీసుకోవడంలేదు. వాళ్లకున్న విస్తీర్ణం వెబ్‌సైట్‌లో ఖాళీగానే ఉన్నది. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన తర్వాత నమోదుచేస్తాం. మరో 15 రోజుల్లో వారి భూమి వివరాలు ఎక్కిస్తాం.

- సతీశ్, ముప్పారం వీఆర్వో

వ్యవసాయవిద్యపై తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రవీణ్‌రావుతో ఒప్పందం కుదుర్చుకొంటున్న శ్రీలంక యూనివర్సిటీ ఆఫ్ పెరడేనియాకు చెందిన డాక్టర్ జయవర్దనే

శ్రీలంక వ్యవసాయంపై అధ్యయనం

- పెరడేనియా వర్సిటీతో తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఒప్పందం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శ్రీలంక దేశంలో అమలుచేస్తున్న వ్యవసాయ విస్తరణ విధానాలను అధ్యయనంచేయనున్నట్టు తెలంగాణ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వీ ప్రవీణ్‌రావు తెలిపారు. అక్కడి విధానాలను రాష్ట్ర రైతుల ప్రయోజనాల కోసం ఏవిధంగా అమలుచేయవచ్చో పరిశీలిస్తామన్నారు. బుధవారం ఆయన వర్సిటీలోని తన చాంబర్‌లో శ్రీలంకకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ పెరడేనియా ఫ్యాకల్టీ ఆఫ్ అగ్రికల్చర్ అధిపతి డాక్టర్ జయవర్ధనేతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ, వ్యవసాయ విద్య తదితర అంశాల్లో పరస్పర అధ్యయనానికి సంబంధించిన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. రెండు వర్సిటీలకు చెందిన బోధనా సిబ్బంది, విద్యార్థులు పరస్పరం విజ్ఞానాన్ని బదిలీ చేసుకోవాలని నిర్ణయించారు. తెలంగాణలో ఆరు వ్యవసాయ కళాశాలలు ఉన్నాయని.. త్వరలో మరో కళాశాలను ప్రారంభిస్తామని ప్రవీణ్‌రావు తెలిపారు. రైతాంగానికి మరిన్ని సేవలు అందించడం కోసం జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామన్నారు.

వ్యాధుల కట్టడికి పకడ్బందీ చర్యలు

- దవాఖానలు లేని ప్రాంతాల్లో ఆరోగ్య శిబిరాలు
- అదనపు సిబ్బంది, వాహనాలు, సామగ్రి పెంచుతాం
- వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: వర్షాల కారణంగా విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో వ్యాధుల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకొంటున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. సూక్ష్మక్రిములు వ్యాప్తిచెందకుండా ఉండేందుకు వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేందుకు అవసరమైతే మ్యాన్‌పవర్‌ను పెంచాలని నిర్ణయించామని చెప్పారు. దవాఖానలు లేనిచోట హెల్త్ క్యాంపులు ఏర్పాటుచేస్తామని, ఇందుకు ప్రైవేట్ వైద్య కళాశాలలు, ప్రైవేట్ హాస్పిటళ్ల సహకారం తీసుకుంటామన్నారు. జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో బుధవారం వ్యాధుల నివారణపై జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో మంత్రి ఈటల, మంత్రులు మహమూద్‌అలీ, చామకూర మల్లారెడ్డి, మేయర్ బొంతు రామ్మోహన్, గ్రేటర్ కమిషనర్ లోకేశ్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం మంత్రి ఈటల మీడియాతో మాట్లాడుతూ.. నగరంలో వ్యర్థాల తొలగింపునకు అవసరమైన యంత్రసామగ్రి, వాహనాలను సమకూర్చుకోనున్నట్టు తెలిపారు. వైద్యశాలల్లో సరిపడా మందులు, సెలైన్ బాటిళ్లను సిద్ధంగా ఉంచుతున్నామన్నారు. స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు ప్రజల్లో చైతన్యం తేవడానికి కృషిచేయాలని సూచించారు. గ్రేటర్ పరిధిలోని వైద్యాధికారుల నుంచి ప్రతిరోజు రోగులు, వ్యాధుల సమాచారాన్ని సేకరించి అందుకు అనుగుణంగా నివారణా చర్యలు తీసుకుంటామని చెప్పారు. హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు పరిశుభ్రతను పాటిస్తూ వ్యాధుల నివారణకు కృషిచేయాలన్నారు. జ్వరాలు ప్రబలుతున్నందున మెడికల్ కాలేజీల సహకారంతో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

బుధవారం జీహెచ్‌ఎంసీలో వ్యాధుల నివారణపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో డెంగీ దోమల నివారణ కరపత్రాన్ని విడుదల చేస్తున్న వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్. చిత్రంలో మంత్రులు మహమూద్‌అలీ, మల్లారెడ్డి, మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్య హైదరాబాద్‌కు కృషి: మేయర్

నగరాన్ని ఆరోగ్య హైదరాబాద్‌గా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నామని, ఇందులో అందరూ కలిసిరావాలని గ్రేటర్ హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్ పౌరులకు సూచించారు. వ్యాధుల నివారణపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, డ్వాక్రా గ్రూపులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు 10, 15 రోజులపాటు వ్యాధుల నివారణ కార్యక్రమాలను ఉద్యమంలా చేపట్టాలని కోరారు. ప్రైవేటు ఆసుపత్రులు తమ పరిధిలోని గ్రామాల్లో వైద్యశిబిరాలను ఏర్పాటుచేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు.

ఈఐఏ కార్యాలయ మూసివేతపై కేంద్రం వెనక్కి

- ఫలించిన రాష్ట్ర ప్రభుత్వ చొరవ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రప్రభుత్వం చొరవతో హైదరాబాద్‌లోని ఎక్స్‌పోర్ట్ ఇన్‌స్పెక్షన్ ఏజెన్సీ (ఈఐఏ) ఉపకార్యాలయం మూసివేత నిర్ణయాన్ని కేంద్రం వెనక్కుతీసుకున్నది. దీంతో రాష్ట్రం నుంచి వ్యవసాయ అనుబంధ, ఇతర వస్తువులను ఎగుమతి చేసే వ్యాపారులతోపాటు, రైతులకు ఊరట లభించింది. దేశవ్యాప్తంగా 12 ఈఐఏ ఉపకార్యాలయాలను మూసివేయాలని నిర్ణయించినట్టు కేంద్రప్రభుత్వ సంస్థ ఎక్స్‌పోర్ట్ ఇన్‌స్పెక్షన్ కౌన్సిల్ (ఈఐసీ) గత జూన్‌లో సమాచారమిచ్చింది. ఈ విషయాన్ని ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు కరుణేంద్ర ఎస్ జాస్తి.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై వేగంగా స్పందించిన సీఎస్.. మూసివేత నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కోరుతూ కేంద్ర వాణిజ్యశాఖ కార్యదర్శికి లేఖ రాశారు.

ఆ కిడ్నాప్ కట్టుకథ!

- చెన్నైలో ఉంటూ లండన్ వెళ్లినట్టు బిల్డప్!
- తిరిగివస్తుండగా క్యాబ్‌డ్రైవర్ కిడ్నాప్ చేశాడంటూ ఫిర్యాదు
- ప్రవీణ్ గుట్టుబయటపడటంతో కేసు ఉపసంహరించుకున్న కుటుంబీకులు

శంషాబాద్: లండన్ నుంచి వస్తున్న ప్రయాణికుడిని శంషాబాద్ ఎయిర్‌పోర్టు వద్ద ఓ క్యాబ్ డ్రైవర్ కిడ్నాప్ చేశాడంటూ సాగిన ప్రచారం చివరకు కట్టుకథగా తేలిపోయింది. ఆర్జీఐఏ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా కీసర మండలం దమ్మాయిగూడకు చెందిన శశిధర్ కుమారుడు ప్రవీణ్ హైడ్రామా సృష్టించాడు. లండన్ నుంచి తిరిగి వస్తుండగా శంషాబాద్ వద్ద తనను క్యాబ్‌డ్రైవర్ కిడ్నాప్‌చేసి, కర్ణాటక తీసుకెళ్లి, డబ్బు, నగలు లాక్కున్నాడని తండ్రికి సమాచారమిచ్చాడు. దీంతో బుధవారం ఉదయం కిడ్నాపైన తమ కుమారుడిని కాపాడాలంటూ ప్రవీణ్ తండ్రి శశిధర్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి.. వివిధ కోణాల్లో దర్యాప్తుచేశారు. సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించారు. 2017 జూలైలో చదువు, ఉద్యోగం పేరుతో లండన్ వెళ్తున్నట్టు కుటుంబసభ్యులను నమ్మించిన ప్రవీణ్ అసలు లండన్ వెళ్లలేదని.. ఇంతకాలం చెన్నైలో ఉన్నాడని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. కుటుంబకలహాలు, మరోవైపు వివాహం ఇష్టంలేక కిడ్నాప్ కథ నడిపాడని భావిస్తున్నారు. సమాచారలోపంతో ప్రవీణ్ కిడ్నాప్ అయ్యాడని భావించామని, అతను క్షేమంగా ఇంటికి చేరడంతో కేసు ఉపసంహరించుకుంటున్నామని బంధువులు పోలీసులకు తెలిపారు.

అక్కసుతో నాటకమాడి.. జైలు పాలయ్యాడు

- మిత్రుడి విదేశీయానాన్ని ఆపేందుకే విమానాశ్రయానికి బెదిరింపు మెయిల్

శంషాబాద్: స్నేహితుడికి కెనడా వీసా వచ్చిందన్న అక్కసుతో ఓ యువకుడు ఆడిన నాటకం చివరకు తననే కటకటాలపాలుచేసింది. ఎయిర్‌పోర్టును పేల్చేస్తానని మెయిల్ పెట్టిన యువకుడిని పోలీసులు అరెస్టుచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన కాట్రోజు శశికాంత్.. కేసముద్రంకు చెందిన సాయిరాం స్నేహితులు. వీసా రావడంతో సాయిరాం బుధవారం కెనడా వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. అతడిని వెళ్లకుండా ఆపాలన్న దురుద్ధితో ఎయిర్‌పోర్టును పేల్చాస్తానంటూ శశికాంత్ ఈ నెల మూడోతేదీన మెయిల్ పెట్టాడు. దర్యాప్తు జరిపి శశికాంత్‌ను పోలీసులు అరెస్టుచేశారు.

రైతు భూమికి ప్రభుత్వమే జిమ్మేదారు!

- సీఎం కేసీఆర్ సూచనలతో సమగ్ర రెవెన్యూ చట్టం రూపకల్పనకు కసరత్తు
- రైతు భూ రికార్డులకు గ్యారంటీ ఇచ్చే దిశగా అడుగులు
- రికార్డులో తప్పులు జరిగితే ప్రభుత్వమే జరిమానా చెల్లించేలా నియమాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కొత్త రెవెన్యూ చట్టం రూపకల్పనకు అధికారులు తీవ్ర కసరత్తు జరుపుతున్నారు. రైతుల భూమి రికార్డులకు గ్యారంటీ ఇచ్చే దిశగా అడుగులు పడుతున్నాయి. రైతుల భూములకు ప్రభుత్వమే జిమ్మేదారుగా ఉండాలని, ఆ మేరకు చట్టంలో మార్పులు తేవాల్సిన అవసరం ఉన్నదని పార్లమెంట్ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పలు బహిరంగసభల్లో స్పష్టంచేశారు. రైతులు భూమి సమస్యలతో వ్యవసాయానికి దూరం కాకుండా ఉండాలన్న సంకల్పంతో కొత్త చట్టం తీసుకురావాలని రెండోసారి అధికారంలో వచ్చిన తర్వాత అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశాలిచ్చారు. ఆ మేరకు సమగ్ర రెవెన్యూ చట్టం తయారీలో అధికారులు తలమునకలై ఉన్నారు. రైతు భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని నిర్ణయించిన సీఎం కేసీఆర్.. 2017లోనే వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక ఇచ్చి భూ రికార్డులను ప్రక్షాళన చేయించారు. దాదాపు 90 శాతం రికార్డులు సరైనప్పటికీ కొందరు అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది అక్రమాల కారణంగా భూమి సమస్యలు జఠిలమయ్యాయి. కొంతమంది తాసిల్దార్లు, వీఆర్వోలు, ఇతర రెవెన్యూ సిబ్బంది మూలంగా మొత్తం రెవెన్యూశాఖ అప్రదిష్ట మూటగట్టుకొన్నది. దాంతో రెవెన్యూశాఖను పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉన్నదని సీఎం కేసీఆర్ భావించారు.

టైటిల్ గ్యారంటీపై సర్వత్రా చర్చ

'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ధర్మగంట శీర్షికలో వరుసగా ప్రచురితమవుతున్న కథనాలను కూడా పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్.. రైతులకు భూ యాజమాన్య సమస్యలు రావద్దని దృఢంగా నిశ్చయించుకొన్నారు. దేశంలో టైటిల్ గ్యారెంటీపై ప్రజలకు అర్థమయ్యే భాషలో బహిరంగ సభల్లో వివరించి చెప్పిన ముఖ్యమంత్రి ఒక్క కేసీఆరే అని ఒక రెవెన్యూ అధికారి చెప్పారు. మొదటిసారి టైటిల్ గ్యారెంటీ గురించి సర్వత్రా చర్చ జరిగిందని అధికారులు చెప్తున్నారు. భూమి రికార్డులో నమోదు చేసిన వివరాలకు ప్రభుత్వమే జిమ్మేదారిగా ఉండాలని, అలాగే రికార్డుల్లో తప్పు జరిగితే ప్రభుత్వమే జరిమానా చెల్లించేలా చట్టం తెస్తామని పార్లమెంటు ఎన్నికల వేళ పలు సభల్లో ప్రకటించారు. ఇది అత్యంత సాహసోపేత నిర్ణయమని మేధావివర్గం పేర్కొంటున్నది. వాస్తవానికి టైటిల్ గ్యారెంటీపై మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్.. డీసీ వాద్వా కమిటీ వేశారు. దేశవ్యాప్తంగా టైటిల్ గ్యారెంటీ చట్టం తేవాలని వాద్వా కమిటీ తన నివేదికలో స్పష్టంచేసింది. అయితే ఆ కమిటీ చేసిన సిఫారసుల మేరకు నేటి వరకు చట్ట రూపం దాల్చలేదు. మన దేశం అభివృద్ధి చెందడానికి టైటిల్ గ్యారెంటీ అత్యవసరమని, ఇది తీసుకురాలేకపోయినందుకు మన్మోహన్, పీవీ, సోనియా, అరుణ్‌శౌరీ, వీపీ సింగ్, వాజ్‌పేయి, అద్వానీలను నిందిస్తున్నానని తన పుస్తకం 'నేను నిందిస్తున్నాను'లో వాద్వా చెప్పారు. కేంద్రం అప్పట్లో ముసాయిదా బిల్లును సిద్ధం చేసినా పార్లమెంటు ముందుకు తీసుకురాలేకపోయింది. తొలిసారిగా టైటిల్ గ్యారెంటీపై ప్రజల్లో సీఎం కేసీఆర్ చర్చకు తీసుకొచ్చారు. ఇప్పటికే జిల్లా, రాష్ట్రస్థాయిలో భూమి ట్రిబ్యునళ్లు ఉండాలని చెప్పారు. ట్రిబ్యునళ్ల ఏర్పాటు జరిగితే భూ వివాదాలు చాలా వరకు తగ్గిపోతాయి. లిటిగేషన్లకు ఆస్కారం ఉండదని, కోర్టుల చుట్టూ తిరుగాల్సిన అవసరం ఉండదని పలువురు రెవెన్యూ నిపుణులు చెప్తున్నారు. సింగిల్ విండో విధానం రావాలని, కోర్ బ్యాంకింగ్ తరహాలో లావాదేవీలు జరిగేలా చూడాలని రైతులు అభిప్రాయ పడుతున్నారు. ఇందు కోసం కంప్యూటర్ రికార్డులతోపాటు మాన్యువల్‌గా కూడా రికార్డుల నిర్వహణ జరుగాలని రైతులు కోరుతున్నారు. రైతులు, భూమి యజమానులకు పూర్తి భద్రత, భరోసా కలిస్తూ, అవినీతికి ఆస్కారం లేకుండా సత్వర సేవలు అందేలా కొత్త చట్టం ఉండాలన్న బలమైన కోరిక రైతుల్లో వ్యక్తమవుతున్నది. ఆ దిశగా అధికారులు కొత్త చట్టానికి రూపకల్పన చేస్తారన్న ఆశతో తెలంగాణ రైతాంగం ఉన్నది.

రాష్ట్రంలో యూరియా కొరతలేదు

- వ్యవసాయశాఖ కమిషనర్ రాహుల్ బొజ్జా స్పష్టీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో యూరియా కొరతలేదని, కావాల్సినంత యూరియాను అందుబాటులో ఉంచామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయశాఖ కమిషనర్ రాహుల్ బొజ్జా స్పష్టంచేశారు. ఆగస్టులో ఎరువుల కంపెనీల నుంచి 1.12 లక్షల మెట్రిక్ టన్నులు, మార్క్‌ఫెడ్ బఫర్‌స్టాక్ నుంచి 1.25

ట్రాక్టర్ బోల్తా.. బతికిబయటపడ్డ డ్రైవర్

కరకగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం రాయినిపేటలో ట్రాక్టర్ డ్రైవర్ శేఖర్ బుధవారం ఓ పొలంలో దమ్ము చేశాడు. ట్రాక్టర్ బురదలో కూరుకుపోవడంతో మరో ట్రాక్టర్ సాయంతో బయటకు తీసేందుకు యత్నించాడు. ఈ సమయంలో బురదలో ఉన్న ట్రాక్టర్ బోల్తాపడింది. దానిపైనున్న శేఖర్ ట్రాక్టర్ కిందపడి బురదలో కూరుకుపోయాడు. రైతులు తాడు సాయంతో చాకచక్యంగా ట్రాక్టర్‌ను పక్కకు తప్పించగా, దానికింద ఉన్న శేఖర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

బోల్తాపడిన ట్రాక్టర్ (ఇన్‌సెట్లో) గాయపడిన శేఖర్

బడికి పొమ్మంటే బలవన్మరణం

సూర్యాపేట జిల్లాలో విషాదం

హుజూర్‌నగర్‌రూరల్: స్కూల్‌కు వెళ్లాలని తల్లిదండ్రులు మందలించడంతో ఓ బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం లక్కవరం గ్రామానికి చెందిన రణపంగు రాజారత్నం, సునీతకు ఇద్దరు కుమారులు. పెద్దకొడుకు ఇంటర్ చదువుతుండగా, రెండోకొడుకు కార్తీక్ కోదాడలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఇటీవల వరుసగా సెలవులు రావడంతో ఇంటికొచ్చిన కార్తీక్‌ను తిరిగి స్కూలుకు వెళ్లాలంటూ తల్లిదండ్రులు మందలించారు. మనస్తాపానికి గురైన కార్తీక్ బుధవారం ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు, గమనించిన తల్లిదండ్రులు హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు.

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గ ఇంచార్జి శానంపూడి సైదిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం టీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అన్నపురెడ్డి నారాయణరెడ్డి, నేరేడుచర్ల వైస్ ఎంపీపీ పేరువల్ల లింగారెడ్డి, యల్లారం సర్పంచ్ శేఖర్‌రెడ్డి, నేరేడుచర్ల మండల కాంగ్రెస్ నేత దేవిరెడ్డి వెంకటరెడ్డి, దాచారం మాజీ సర్పంచ్ బుట్ట రామయ్యయాదవ్, చింతకుంట కళింగరెడ్డి, ఉప సర్పంచ్ కేశిరెడ్డి మహిపాల్‌రెడ్డి తదితరులకు మంత్రి జగదీశ్‌రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ పాల్గొన్నారు.

- హుజూర్‌నగర్, నమస్తే తెలంగాణ

తెలంగాణ బాహుబలి కేసీఆర్

- కాంగ్రెస్, బీజేపీవి చౌకబారు విమర్శలు
- ఎమ్మెల్సీ కడియం శ్రీహరి
- 8 వేలమందితో చలో కాళేశ్వరం

లక్ష్మీ బరాజ్ వద్ద కడియంతోపాటు వచ్చిన ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలు

మహదేవపూర్(జయశంకర్ భూపాలపల్లి)/ మడికొండ: ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ బాహుబలి అని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీలకు సీఎం కేసీఆర్‌ను ఎదుర్కొనే సత్తా, సామర్థ్యం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు తరలిన స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని రైతులు, టీఆర్ఎస్ కార్యకర్తల వాహనాలను బుధవారం వరంగల్ అర్బన్ జిల్లా మడికొండలో ఆయన జెండా ఊపి ప్రారంభించారు. 8 వేలమంది రైతులు, ప్రజలతో కలిసి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించిన లక్ష్మీ బరాజ్, లక్ష్మీ పంప్‌హౌస్, సరస్వతీ బరాజ్‌ను కడియం సందర్శించారు. అనంతరం కడియం మాట్లాడుతూ.. 45 లక్ష ల ఎకరాలకు సాగునీరందించేలా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీరింగ్ అద్భుతమని, తెలంగాణ రైతులకు ఈ ప్రాజెక్టును చూపించి అవగాహన కల్పించేందుకు చలో కాళేశ్వరం కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. కాళేశ్వరంపై కనీస అవగాహనలేని రాజకీయ పార్టీలు ఉనికి కోసం విమర్శలు చేస్తున్న నేపథ్యంలో రైతులు స్వయంగా వాస్తవాలు తెలుసుకోవాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని గుర్తుచేశారు.

కాంగ్రెస్, బీజేపీ కుట్రలను తిప్పికొట్టండి

ప్రపంచంలోని నీటిపారుదలరంగ నిపుణులు కాళేశ్వరంపై ప్రశంసలు కురిపిస్తుంటే.. కాంగ్రెస్, బీజేపీ నాయకులు మాత్రం చౌకబారు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు జలయజ్ఞం పేరిట ధన యజ్ఞం చేసి ఇప్పటికీ కోర్టులు, జైళ్ల చుట్టూ తిరుగుతున్నారన్నారు. కాళేశ్వరం గురించి మాట్లాడే నైతికహక్కు కాంగ్రెస్‌కు లేదన్నారు. తెలంగాణపై బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయహోదా తెప్పించాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాతే ప్రాజెక్ట్ గురించి మాట్లాడాలని హితవుపలికారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, కాళేశ్వరం గురించి మాట్లాడని బీజేపీ నాయకులు.. తెలంగాణపై ప్రేమ ఉన్నట్టు మాట్లాడితే ప్రజలు నమ్మే స్థితిలోలేరని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీలు రాష్ట్ర అభివృద్ధి అడ్డుకోవడమే లక్ష్యంగా ప్రవర్తిస్తున్నాయని, వారి కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని కడియం పిలుపునిచ్చారు. కాళేశ్వరం పర్యటనలో భాగంగా పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి సన్నిధిలో కడియం శ్రీహరి ప్రత్యేక పూజలు చేశారు.

జలజాతరకు సర్వంసిద్ధం

- పెద్దపల్లి జిల్లా నంది రిజర్వాయర్ వద్ద నేడు 30 వేలమందితో వేడుక
- మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహణ

పెద్దపల్లి జిల్లాలోని నంది రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మారం: సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో గురువారం తలపెట్టిన కాళేశ్వరం జలజాతరకు సర్వం సిద్ధమైంది. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలోని నంది రిజర్వాయర్ వద్ద ధర్మపురి నియోజకవర్గంలోని 5 మండలాలకు చెందిన 30 వేలమంది రైతులతో జలజాతర నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. తెలంగాణ సంప్రదాయాలు ప్రతిబింబించేలా కళాజాతలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ముందుగా ధర్మారం నుంచి కళాకారులతో ఆటపాటలు, బోనాలు ప్రదర్శనలు చేపట్టనున్నారు. జల మహోత్సవ చిత్రీకరణకు ప్రత్యేకంగా డ్రోన్ కెమెరా సౌకర్యాన్ని కల్పించారు. రిజర్వాయర్ వద్ద తాత్కాలికంగా ఓ బోటును ఏర్పాటుచేశారు. ముందుగా మంత్రి కొప్పుల ఈశ్వర్, ముఖ్యఅతిథులతో కలిసి ఉదయం 10 గంటలకు ధర్మారం చేరుకుంటారు. జనంతో కలిసి నందిమేడారం వరకు పాదయాత్రగా వస్తారు. మార్గమధ్యంలో నంది రిజర్వాయర్ నుంచి ఎస్సారెస్పీ డీ-83/బీ లింక్ కెనాల్ పనులకు శంకుస్థాపన చేసి, అమరేశ్వరాలయం వద్ద సభా వేదికపై ప్రసంగిస్తారు. చివరగా రిజర్వాయర్‌లో గంగకు పూజలు చేయనున్నారు. మధ్యాహ్నం అతిథులతోపాటు కార్యకర్తలందరితో కలిసి సహపంక్తి భోజనాలు చేయనున్నారు.

హాజరుకానున్న ప్రముఖులు..

జలజాతరకు మంత్రి కొప్పులతోపాటు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎంపీ వెంకటేశ్‌నేత, జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, పెద్దపల్లి, మంచిర్యాల ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, నడిపెల్లి దివాకర్‌రావు, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు తదితరులు హాజరుకానున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి..

నంది రిజర్వాయర్ వద్ద జరిగే జలజాతర ఏర్పాట్లను మంత్రి కొప్పుల ఈశ్వర్ బుధవారం పెద్దపల్లి ఏసీపీ వెంకటరమణారెడ్డి, స్థానిక టీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. సభా వేదిక, జల మహోత్సవానికి తరలి వచ్చే రైతులకు భోజనవసతి, మంచినీటి సౌకర్యంపై చర్చించారు. అమరేశ్వర ఆలయం వద్ద సభా వేదిక స్థలాన్ని సందర్శించారు. ఏర్పాట్లపై ప్రాజెక్ట్ డీఈఈ నర్సింగారావు, 7వ ప్యాకేజీ ఏఈ పరశురాంగౌడ్‌తో చర్చించారు.

మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడలో నిర్వహించిన జలశక్తి అభియాన్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి తదితరులు

పాలమూరుకు జాతీయ హోదానివ్వాలి

- ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- త్వరలోనే రైతురుణ మాఫీ: మంత్రి నిరంజన్‌రెడ్డి

హన్వాడ: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్రం జాతీయ హోదా కల్పిస్తూ పనులు త్వరితగతిన పూర్తిచేసేందుకు రూ.20 వేల కోట్లను మంజూరుచేయాలని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలకేంద్రంలో ఎస్సీఐ ఆవరణలో జలశక్తి అభియాన్, రైతు మేళా కార్యక్రమాలను వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. వచ్చే వానాకాలం నాటికి పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటి అందిస్తామన్నారు. లేకుంటే మళ్లీ మండలానికి రానే రానన్నారు. హన్వాడ మండలం మీదుగా రెండు కాల్వలు వెళ్తున్నాయన్నారు. ఉందడాపురం నుంచి ఒక్కటి, కరివెన నుంచి మరోటన్నారు. తక్కువ నీటితో సాగుచేసే పంటలను పండించాలని రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే రైతు రుణ మాఫీ చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకాన్ని ఐదేండ్ల కిందటే అమలు చేస్తే.. కేంద్ర ప్రభుత్వం జలశక్తి అభియాన్ పథకాన్ని ఇప్పుడు అమలు చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, జలశక్తి అభియాన్ జిల్లా ఇంచార్జి స్నేహలత, ఆత్మ పీడీ ఉకే నాయక్, జేడీ సుచరిత పాల్గొన్నారు.

సిరిసిల్లలో త్వరలో జేఎన్టీయూ కళాశాల

ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తేతెలంగాణ: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జేఎన్టీయూ కళాశాలను త్వరలో ఏర్పాటుచేయనున్నట్టు ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య తుమ్మల పాపిరెడ్డి, జాయింట్ కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. కళాశాల ఏర్పాటుతో సిరిసిల్ల జిల్లాతోపాటు చుట్టుపక్కల జిల్లాల విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ప్రత్యేకచొరవతో కళాశాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. బుధవారం ఉన్నత విద్యా మండలి వైస్‌చైర్మన్ వెంకటరమణ, జేఎన్టీయూ ప్రిన్సిపాల్ సాయిబాబా, ఓయా ఇంజినీరింగ్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ కిష్టయ్య తదితరులతో కలిసి సిరిసిల్ల మండలం సర్దాపూర్, వెంకటాపూర్ గ్రామాల మధ్య కొత్త బైపాస్‌రోడ్డులో 88 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు.

అమలు బాధ్యత సర్పంచ్‌లదే

30 రోజుల ప్రణాళికపై అవగాహన సదస్సులో స్పీకర్ పోచారం

కామారెడ్డి జిల్లా బాన్సువాడలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

జనగామలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

బాన్సువాడ రూరల్: రాష్ట్రంలో 30 రోజుల ప్రత్యేక ప్రణాళిక కార్యాచరణపై అవగాహన సదస్సులను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. బుధవారం బాన్సువాడలో స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, జనగామలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జగిత్యాలలో మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులను నిర్వహించారు. 30 రోజుల ప్రణాళిక అమలు బాధ్యత సర్పంచ్‌లదేనని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. గ్రామాల్లో వ్యాధులను నిర్మూలించేందుకు 30 రోజుల ప్రణాళికను తప్పకుండా అమలుచేయాలని కోరారు. బుధవారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ డివిజన్ కేంద్రంలోని జీఆర్ఆర్ గార్డెన్‌లో 30 రోజుల గ్రామపంచాయతీ ప్రణాళిక అమలుపై బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలతోపాటు ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని గాంధారి మండల అధికారులు, సర్పంచ్‌లు, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులకు అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఇందులో ఎంపీ బీబీపాటిల్, జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండేతో కలిసి పాల్గొన్న పోచారం మాట్లాడుతూ.. ఈ ప్రణాళికలో పరిశుభ్రత, పచ్చదనం, తాగునీరు, వీధిలైట్ల నిర్వహణ ఉన్నాయని చెప్పారు.

ఆదర్శ పల్లెలకు అధిక నిధులు: మంత్రి ఎర్రబెల్లి

జనగామ, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 30 రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలులో ఆదర్శంగా మారిన గ్రామ పంచాయతీలను ప్రభుత్వం దత్తత తీసుకొని అధిక నిధులు కేటాయిస్తుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రకటించారు. బుధవారం జనగామలోని డీఆర్డీఏ ఆధ్వర్యంలో జిల్లాలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులకు 30 రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలు కార్యాచరణపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అధ్యక్షత వహించగా మంత్రి ఎర్రబెల్లి, రాజ్యసభ సభ్యుడు బండా ప్రకాశ్, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, గిరిజన సహకార సంస్థ చైర్మన్ మోహన్ గాంధీనాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ దేశంలోని ఇతర రాష్ట్రాలు వచ్చి నేర్చుకునేలా తెలంగాణ పల్లెసీమలు పరిశుభ్రమైన వాతావరణంలో మెరిసేలా ఈ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు చాలెంజ్‌గా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రతి గ్రామం నందనవనం: మంత్రి కొప్పుల

జగిత్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ప్రతి గ్రామం ఒక నందన వనం కావాలని, ప్రతి పల్లె ప్రకృతి సోయగంలా మారాలని, అప్పుడే రాష్ట్రం బృందావనంలా మారుతుందని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జగిత్యాల జిల్లాకేంద్రంలో 30 రోజుల ప్రణాళికపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, టీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, సుంకె రవిశంకర్, కలెక్టర్ శరత్, జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు పాల్గొన్నారు.

పలుచోట్ల ఓ మోస్తరు వర్షం

హైదరాబాద్, నమస్తేతెలంగాణ/నెట్‌వర్క్: అల్పపీడనం ప్రభావంతో బుధవారం పలు జిల్లాల్లో వర్షాలు పడ్డాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురువగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాగా నిజామాబాద్ జిల్లాలో జల్లులు పడ్డాయి. వచ్చే మూడ్రోజులవరకు రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు.. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లోని పలుచోట్ల భారీ వర్షాలు కురువొచ్చని వాతావరణ కేంద్రం తెలిపింది.

ఏజెన్సీలో గంటపాటు వర్షం..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బుధవారం ఓ మోస్తరు నుంచి భారీవర్షం కురిసింది. దుమ్ముగూడెం, చర్ల, పాల్వంచ మండలాలతోపాటు కొత్తగూడెం జిల్లాకేంద్రం, మణుగూరు నియోజకవర్గంలోని ఏజెన్సీలో గంటపాటు వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని బెజ్జూర్, దహెగాం, కౌటాల, వాంకిడి మండలాల్లో బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. బెజ్జూర్ మండలంలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సుస్మీర్ వాగు దాటేందుకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కౌటాల మండల కేంద్రంలో ఓ ఇంటి గోడ కూలింది. అత్యధికంగా కౌటాల మండలంలో 74.6 మి.మీ., జిల్లావ్యాప్తంగా 32.01 మి.మీ. సరాసరి వర్షపాతం నమోదైంది. ములుగు జిల్లాలో బుధవారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు వాజేడు 19.6, వెంకటాపురం(నూగూరు)లో 17 మి.మీ., వర్షపాతం నమోదైంది. నిజామాబాద్ జిల్లాలోని పలుచోట్ల తేలికపాటి వర్షం కురిసింది. డిచ్‌పల్లిలో మధ్యాహ్నం పావుగంటపాటు వర్షం కురవగా, నిజామాబాద్ నగరం, ధర్పల్లి, ఇందల్వాయి, వర్ని మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. కాగా గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల బుధవారం రాత్రి చిరుజల్లుల నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది.

రాగల మూడ్రోజుల వరకు రాష్ట్రంలో వర్షాలు

మూడ్రోజుల వరకు తెలంగాణలో వర్షాలు కురిసే అవకాశమున్నది. వాయవ్య బంగాళాఖాతం దానిని ఆనుకొని ఉన్న ఉత్తర ఒడిశా, పశ్చిమబెంగాల్ తీర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం స్థిరంగా కొనసాగుతున్నది. దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నది. రాగల మూడ్రోజుల వరకు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. ఉత్తర తెలంగాణ, తూర్పు తెలంగాణ జిల్లాల్లోని పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని ఆయన పేర్కొన్నారు.

బుధవారం ములుగు జిల్లా వాజేడులో కురుస్తున్న వర్షం

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలంలో పొంగుతున్న సుస్మీర్ వాగు నుంచి బైక్‌ను మోసుకొస్తున్న దృశ్యం

వైద్యశాఖలో నలుగురు సస్పెన్షన్

జనగామ టౌన్: విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన నలుగురు వైద్య ఉద్యోగులను జనగామ కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సస్పెండ్ చేసినట్టు డీఎంహెచ్‌వో మహేందర్ తెలిపారు. గతనెల 17న స్థానిక ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు పాలకుర్తి పీహెచ్‌సీ, సీహెచ్‌సీ సెంటర్‌ను తనిఖీచేయగా, సీహెచ్‌సీలో వైద్యులు, వైద్యసిబ్బంది అందుబాటులో లేకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. కలెక్టర్ స్పందించి.. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ విచారణ అధికారిగా డీఎంహెచ్‌వోను నియమించారు. ఆయన విచారణ చేపట్టి విధులకు హాజరుకాని సిబ్బంది వివరాలను కలెక్టర్‌కు నివేదించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన సీహెచ్ భద్రయ్య (ఆప్తాల్మిక్ ఆఫీసర్), లక్ష్మీబాయి(ఎంపీహెచ్ఎస్-ఎఫ్), ఎన్ శ్రీనివాసాచార్యులు (ఎంపీహెచ్ఎస్-ఎం), రజిత (జూనియర్ అసిస్టెంట్)లను సస్పెన్షన్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

మృత్యువులోనూ వీడనిబంధం

రోడ్డుప్రమాదంలో భార్య మృతి.. మరణాన్ని తట్టుకోలేక భర్త ఆత్మహత్య

నవాబ్‌పేట: భార్య మరణాన్ని తట్టుకోలేక భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కేశవరావుపల్లిలో చోటుచేసుకున్నది. కేశవరావుపల్లికి చెందిన కావలి నర్సింహులు(24), యాదమ్మ(20)కు ఏడాదిన్నర కిందటే వివాహమైంది. గత నెల 30న నర్సింహులు, యాదమ్మ బైక్‌పై వెళ్తుండగా అమ్మాపూర్ గేట్ సమీపంలో అదుపుతప్పి భార్య కింద పడగా తీవ్రంగా గాయపడింది. హైదరాబాద్ గాంధీ దవాఖానకు తరలించగా.. చికిత్సపొందుతూ బుధవారం ఉదయం మృతిచెందింది. విషయం తెలియడంతో తీవ్ర మనస్తాపా నికి గురైన నర్సింహులు పొలానికి వెళ్లి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

సిద్దిపేటలో గోల్కొండ విక్రయశాలను ప్రారంభించి గొల్లభామ చీరెను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు

చేనేత, హస్తకళలకు పూర్వవైభవం

సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటకలెక్టరేట్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో చేనేతతోపాటు హస్తకళను ప్రోత్సహించేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, చేనేత హస్తకళలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేటలో రూ.2కోట్లతో నిర్మించిన గోల్కొండ విక్రయశాలను మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ బొల్లం సంపత్‌కుమార్, హస్తకళల అభివృద్ధి సంస్థ ఎండీ శైలజారామయ్యర్, కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న వారు ఆత్మగౌరవంతో బతుకాలన్నదే ప్రభుత్వ ఆశయమని హరీశ్‌రావు అన్నారు.

యూరియా కోసం రైతుల నిరసన

సారంగాపూర్: జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలకేంద్రంలో సరిపడా యూరియా సరఫరా చేయాలని బుధవారం రైతులు సహకారసంఘ కార్యాలయం ఎదుట రోడ్డుపై నిరసనకు దిగారు. బుధవారం మండల కేంద్రానికి యూరియా ఒకే లోడ్ రావడంతో సరిపోదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారంనుంచి రోజూ యూరియా వస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని సహకార సంఘం చైర్మన్ సాగి సత్యంరావు తెలిపారు.

తెలంగాణ హైకోర్టు జస్టిస్ సంజయ్‌కుమార్‌ను పంజాబ్, హర్యానా కోర్టుకు బదిలీ చేయడాన్ని నిరసిస్తూ బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

- వేములవాడ, నమస్తే తెలంగాణ

గణేశ్ మండపంలో అగ్నిప్రమాదం

రాయికల్ రూరల్:

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని వీఎస్ ఫంక్షన్‌హాల్‌లో భవాని భారత్ యూత్ ప్రతిష్ఠించిన వినాయక మండపంలో బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటుచేసుకున్నది. ఫంక్షన్‌హాల్‌లోని విద్యుత్ వైర్లు, ఫ్యాన్లు, లైట్లు కాలిపోయాయి. సీలింగ్ దెబ్బతిన్నది. డెకరేషన్ కాలి బూడిదైంది. రూ.10 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్టు హాల్ యజమాని తెలిపారు. మంటలు చెలరేగి, పొగలు కమ్ముకోగానే అప్రమత్తమైన నిర్వాహకులు.. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ ఇంజిన్ అక్కడకు చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చింది. నిర్వాహకులు.. కూపన్లను విక్రయించగా లక్కీస్క్రీం ద్వారా గెలుచుకునేవారికి ఇచ్చే స్కూటీని వినాయక మండపంలో ఉంచగా, అదికూడా దగ్ధమైంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

లారీ ఢీకొని తల్లీకొడుకు మృతి

నర్సాపూర్ రూరల్: మెదక్ జిల్లా శివ్వంపేటలో బుధవారం జరిగిన రోడ్డుప్రమాదంలో తల్లీకొడుకు మృత్యువాత పడ్డారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం సాదుల్‌నగర్‌కు చెందిన అశోక్, భార్య అనిత(26), కొడుకు దీక్షిత్(3)తో కలిసి బైక్‌పై తూప్రాన్ నుంచి చిన్నశంకరంపేటకు బయలుదేరారు. వేగంగా వస్తున్న లారీ శివ్వంపేట పోలీస్‌స్టేషన్ ముందు బైక్‌ను ఢీకొట్టగా అనిత, దీక్షిత్ అక్కడికక్కడే మృతిచెందగా, అశోక్‌కు తీవ్రగాయాలయ్యాయి.

నమస్తే తెలంగాణ
ఆట
8
[కరీంనగర్]
గురువారం 5 సెప్టెంబర్ 2019
WWW.NTNEWS.COM

రెండో రౌండ్‌లో సౌరభ్ వర్మ

తైపీ: చైనీస్ తైపీ బ్యాడ్మింటన్ ఓపెన్‌లో భారత యువ షట్లర్ సౌరభ్ వర్మ రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో సౌరభ్ 22-20, 21-13 తేడాతో కజుమస సకాయ్(జపాన్)పై అలవోక విజయం సాధించాడు. 38 నిమిషాల్లోనే ముగిసిన పోరులో తొలి గేమ్‌ను 22-20తో దక్కించుకున్న ఈ జాతీయ చాంపియన్...మలి గేమ్‌లో తన దైన ఆధిపత్యం ప్రదర్శిస్తూ ఆటను ముగించాడు. గురువారం జరిగే రెండో రౌండ్‌లో చౌ తియాన్ చెన్(చైనీస్ తైపీ)తో సౌరభ్ తలపడుతాడు. మరో వైపు మహిళల సింగిల్స్‌లో రియా ముఖర్జీ 21-19, 11-21, 13-21తో సుపనిద కెటెహాంగ్(థాయ్‌లాండ్) చేతిలో ఓడి టోర్నీ నుంచి వైదొలిగింది. మహిళల డబుల్స్‌లో భారత ద్వయం అపర్ణ బాలన్, ప్రజక్త సావంత్ 19-21, 23-21, 15-21తో చైనీస్ తైపీ జోడీ చెంగ్ యుపీ, జువాంగ్‌పై ఓడింది.

ఖతార్ వేదికగా 2022లో జరిగే ఫిఫా ప్రపంచకప్ లోగో బుధవారం విడుదలైంది. మెగాటోర్నీకి ఆతిథ్యమిస్తున్న ఖతార్..దోహాతో పాటు ప్రపంచంలోని పలు ప్రముఖ ప్రదేశాల్లో లోగోను ప్రదర్శించింది. ఇందులో భాగంగా మొరాకో రాజధాని రబాత్‌లోని ఔదయ కసబ్‌పై కనిపిస్తున్న ఫిఫా వరల్డ్ కప్ లోగో

ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు ప్రణవ్

న్యూఢిల్లీ: బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్ టోర్నీకి తెలంగాణ యువ షట్లర్ గంధం ప్రణవ్ రావు ఎంపికయ్యాడు. రష్యాలోని కజాన్‌లో ఈ నెల 30 నుంచి అక్టోబర్ 13 వరకు జరిగే టోర్నీ కోసం షట్లర్లను భారత బ్యాడ్మింటన్ సంఘం(బాయ్) బుధవారం ఎంపిక చేసింది. బాలుర సింగిల్స్‌లో ఆల్ ఇండియా జూనియర్ ర్యాంకింగ్స్ టోర్నీలో 925పాయింట్లు సాధించిన సతీశ్ కుమార్(తమిళనాడు)తో పాటు గంధం ప్రణవ్ రావు(తెలంగాణ), సతీశ్(నాగ్‌పూర్), మైస్నమ్ మీరబా(మణిపూర్) ప్రాతినిధ్యం వహించనున్నారు. ఇక బాలికల సింగిల్స్ కోసం తస్నిమ్ మీర్(గుజరాత్), అదితి భట్, ఉన్నతి బిస్ట్(ఉత్తరాఖండ్), త్రిషా హెగ్డే(కర్ణాటక) ఎంపిక య్యారు. బాలుర డబుల్స్‌లో మన్‌జీత్ సింగ్-డింగ్కు సింగ్...మిక్స్‌డబుల్స్‌లో తనీశా క్రాస్టో-ఇషాన్ భట్నాగర్ పోటీలో ఉండనున్నారు. గత నెల బెంగళూరులో జరిగిన ఆల్ ఇండియా జూనియర్ ర్యాంకింగ్స్ టోర్నీలో ప్రదర్శనలను బట్టి జూనియర్ చాంపియన్‌షిప్ కోసం షట్లర్లను బాయ్ ఎంపిక చేసింది.

ఏడ్వడం ఆపు : గిల్‌క్రిస్ట్‌కు భజ్జీ కౌంటర్

న్యూఢిల్లీ: ఈడెన్‌గార్డెన్స్‌లో 2001లో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టులో టీమ్‌ఇండియా స్పిన్నర్ హర్భజన్ సింగ్ భారత్ తరపున తొలి హ్యాట్రిక్ తీసిన సంగతి తెలిసిందే. తాజాగా బుమ్రా కూడా విండీస్‌పై ఈ ఫీట్ సాధించడంతో మళ్లీ ఆ విషయం చర్చకు వచ్చింది. ఆ మ్యాచ్‌లో పాంటింగ్, గిల్‌క్రిస్ట్, షేన్‌వార్న్‌లను హర్భజన్ వరుస బంతుల్లో అవుట్ చేశాడు. గిల్‌క్రిస్ట్ ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. ఈ వీడియోను ఇప్పుడు ఓ అభిమాని ట్విట్టర్‌లో పెట్టాడు. అయితే, రిప్లైలో ప్యాడ్ కంటే ముందుగానే బంతి బ్యాట్‌కు తగిలినట్టు కనిపించడాన్ని గిల్‌క్రిస్ట్ గుర్తు చేస్తూ.... అప్పట్లో డీఆర్ఎస్ లేదు.. అంటూ ఏడుస్తున్నట్టు ఉన్న ఎమోజీని ట్వీట్ చేశాడు. దీంతో హర్భజన్‌కు చెరైత్తుకొచ్చి.. గిల్‌క్రిస్ట్‌కు ఘాటైన జవాబు ఇచ్చాడు. 'మొదటి బంతికి ఔట్‌కాకుంటే ఎక్కువ సేపు ఆడేవాడివని నువ్వు అనుకుంటున్నావా..? ఇలాంటి ఘటనలపై ఏడ్వడం ఆపెయ్. కొన్ని విషయాలను మార్చలేమనడానికి నువ్వు ఓ ఉదాహరణ. ఎప్పుడూ ఏడుస్తూనే ఉంటావు' అని హర్భజన్ ట్వీట్ చేశాడు. అయితే దాన్ని కాసేపటి తర్వాత భజ్జీ తన అకౌంట్ నుంచి తొలిగించాడు. ఆ మ్యాచ్‌లో హ్యాట్రిక్ సహా 7/123తో భజ్జీ విశ్వరూపం ప్రదర్శించడంతో భారత్ 171 పరుగులతో భారత్ భారీ విజయం సాధించింది.

ఢిల్లీకి అశ్విన్!

న్యూఢిల్లీ: గత రెండు సీజన్లు కెప్టెన్‌గా వ్యవహరించిన రవిచంద్రన్ అశ్విన్‌ను కింగ్స్ ఎలెవన్ పంజాబ్ ఫ్రాంచైజీ వదులుకుంది. ఈ ఆఫ్ స్పిన్నర్ నాయకత్వంలో 2018, 19 సీజన్లలో పంజాబ్ ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. ఈ నేపథ్యంలో అశ్విన్‌ను వదులుకునేందుకు పంజాబ్ సిద్ధమైనట్లు తెలిసింది. 'అశ్విన్ విడుదలకు అనుమతి అంశం ఇప్పటికే బీసీసీఐతో సంప్రదింపులు జరిపాం. త్వరలోనే ప్రకటన వెలువడుతుంది. తమ జట్టులో యువ స్పిన్నర్ కావాలని పంజాబ్ కోరుకుంటున్నది. అశ్విన్‌ను తీసుకునేందుకు ఢిల్లీ క్యాపిటల్స్ ఆసక్తి కనబరుస్తున్నది' అని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి.

పాక్ చీఫ్ కోచ్, చీఫ్ సెలెక్టర్‌గా మిస్బావుల్ హక్

లాహోర్: పాకిస్థాన్ జట్టు చీఫ్ కోచ్, చీఫ్ సెలెక్టర్‌గా మాజీ కెప్టెన్ మిస్బావుల్ హక్ ఎంపిక య్యాడు. పలువురిని ఇంటర్వ్యూ చేసిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) బుధవారం మిస్బాను నియమిస్తున్నట్లు ప్రకటించింది. మూడేండ్ల పాటు మిస్బా జోడు పదవుల్లో కొనసాగనున్నాడు. మరోవైపు అజర్ మహమూద్, గ్రాంట్ ఫ్లవర్‌కు ఉద్వాసన పలికిన పీసీబీ..వకార్ యూనిస్ బౌలింగ్ కోచ్‌గా తీసుకుంది.

ఫెదరర్ నిష్క్రమణ

దిమిత్రోవ్ చేతిలో అనూహ్య ఓటమి

క్వార్టర్స్‌లోనే ముగిసిన పోరాటం.. సెమీస్‌లో సెరెనా, బెన్‌కిక్

యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సంచలనాల పర్వం కొనసాగుతున్నది. ఇప్పటికే టాప్‌సీడ్లు నోవాక్ జొకోవిచ్, నవోమి ఒసాకా వెనుదిరుగగా, టైటిల్ ఫేవరెట్లలో ఒకడైన స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ తాజాగా నిష్క్రమించాడు. సుదీర్ఘ క్వార్టర్స్ పోరులో అన్‌సీడెడ్ ఆటగాడు గ్రిగర్ దిమిత్రోవ్ చేతిలో ఫెదరర్ అనూహ్య ఓటమి ఎదుర్కొన్నాడు. నడుము నొప్పిని పంటి బిగువున భరిస్తూ ప్రత్యర్థితో పోరాడినా రోజర్ ముందడుగు వేయలేకపోయాడు. మహిళల సింగిల్స్‌లో నల్లకలువ సెరెనా విలియమ్స్ సెమీస్‌లోకి దూసుకెళ్లింది. పూర్తి ఏకపక్షంగా సాగిన క్వార్టర్స్‌లో వాంగ్ క్వింగ్(చైనా)ను చిత్తుచేసి తనకు తిరుగులేదని ఘనంగా చాటి చెప్పింది. 44 నిమిషాల్లోనే వాంగ్‌ను మట్టికరిపించిన సెరెనా..

దిమిత్రోవ్

యూఎస్ ఓపెన్‌లో వందవ విజయాన్ని ఖాతాలో వేసుకుని టైటిల్‌కు రెండు అడుగుల దూరంలో నిలిచింది.

న్యూయార్క్ : యూఎస్ ఓపెన్‌లో మరో సంచలనం. ఐదుసార్లు యూఎస్ ఓపెన్ విజేత, మూడో సీడ్ రోజర్ ఫెదరర్‌కు క్వార్టర్ ఫైనల్లోనే ఓటమి ఎదురైంది. అన్‌సీడెడ్ క్రీడాకారుడు గ్రోగోర్ దిమిత్రోవ్(బల్గేరియా) ఫెడ్‌కు షాకిచ్చాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో టెన్నిస్ దిగ్గజం ఫెదరర్ 6-3, 4-6, 6-3, 4-6, 2-6 తేడాతో డిమిత్రోవ్ చేతిలో పరాజయం చెందాడు. ఐదుసెట్ల పాటు 3గంటల 12 నిమిషాలు పోరాడినా నిష్క్రమణ తప్పలేదు. మ్యాచ్ తొలి సెట్‌లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన ఫెదరర్ ఆ తర్వాత పట్టు కోల్పోయాడు. రెండో సెట్‌లో తొలి నుంచి వెనుకబడిన స్విస్ స్టార్.. ఓ దశలో వరుసగా రెండు గేమ్‌లు గెలిచి 2-5 నుంచి 4-5కు చేరినా ఆ తర్వాత ప్రత్యర్థి డిమిత్రోవ్ దూకుడుతో సెట్‌ను కోల్పోయాడు. మళ్లీ మూడో సెట్‌లో ఫామ్‌లోకి వచ్చిన రోజర్ 2-3తో వెనుకబడిన స్థితి నుంచి వరుసగా నాలుగు గేమ్‌లు గెలిచి 6-3తో కైవసం చేసుకున్నాడు. ఇక ఆ తర్వాత ఫెదరర్ జోరు కొనసాగించలేకపోయాడు. నాలుగో సెట్‌లో 0-2 నుంచి పోరాడి 4-5కు చేరగలిగినా ఆ తర్వాత చతికిలపడి కోల్పోయాడు. ఇక చివరి సెట్‌లో పూర్తిగా అలిసిపోయినట్టు కనిపించిన ఫెడ్ వరుసతప్పిదాలు చేశాడు. 2-6తో సెట్‌ను చేజార్చుకొని, టోర్నీ నుంచి నిష్క్రమించాడు. నడుము నొప్పి కారణంగా చివరి సెట్‌లో ఇబ్బంది పడిన ఫెదరర్... ఓటమికి మాత్రం గాయం కారణం కాదని చెప్పాడు. మ్యాచ్ మొత్తమ్మీద ఫెదరర్, డిమిత్రోవ్ చెరో ఆరు ఏస్‌లు సంధించుకున్నారు. విన్నర్స్‌లోనూ ఫెడ్‌దే పైచేయి కాగా... చేసిన 60తప్పిదాలే రోజర్ కొంపముంచాయి. మరో క్వార్టర్స్‌లో ఐదో సీడ్ డానిల్ మద్వెదెవ్(రష్యా) 7-6(8/6), 6-3, 3-6, 6-1 తేడాతో 23వ సీడ్ స్టాన్ వావ్రింకా(స్విట్జర్లాండ్)ను ఓడించి, సెమీస్ చేరాడు. 2 గంటల 34ని మిషాల పాటు మ్యాచ్ సాగగా.. మద్వెదెవ్ 11ఏస్‌లు, 36 విన్నర్లు సహా వావ్రింకా సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసి విజయం సాధించాడు.

సెరెనా సెంచరీ

మార్గరెట్ కోర్ట్ 24గ్రాండ్‌స్లామ్‌ల రికార్డే లక్ష్యంగా యూఎస్ ఓపెన్‌లో రెచ్చిపోతున్న సెరెనా విలియమ్స్.. క్వార్టర్ ఫైనల్లో విశ్వరూపం ప్రదర్శించింది. ఎనిమిదో సీడ్ సెరెనా 6-1, 6-0 తేడాతో 44నిమిషాల్లోనే 18వ సీడ్ వాంగ్ క్వింగ్(చైనా)ను మట్టికరిపించి.. యూఎస్ ఓపెన్‌లో ఓవరాల్‌గా వందో విజయం నమోదు చేయడంతో పాటు సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. ఏ దశలోనూ జోరు తగ్గించని ఆరుసార్లు యూఎస్ ఓపెన్ విజేత సెరెనా.. 25 విన్నర్లు, ఐదు బ్రేక్ పాయింట్లు సాధిస్తే... ప్రత్యర్థి ఒక్కటి కూడా దక్కించుకోలేక చేతులెత్తేసింది. మ్యాచ్ మొత్తమ్మీద క్వింగ్ 15పాయింట్లు మాత్రమే సాధించగలిగింది. సెమీస్‌లో ఐదో సీడ్‌తో స్వితోలినాతో సెరెనా తలపడనుంది.మరో క్వార్టర్స్‌లో 12వ సీడ్ బెలిండా బెన్‌కిక్(స్విట్జర్లాండ్) 7-6(7/5), 6-3 తేడాతో డొన్నా వెనిక్(క్రొయేషియా)పై విజయం సాధించి, సెమీస్ చేరింది.

రైనోల కోసం రోహిత్

ముంబై: టీమ్‌ఇండియా వైస్ కెప్టెన్ రోహిత్‌శర్మ బృహత్తర కార్యక్రమానికి మద్దతు తెలిపేందుకు ముందుకు వచ్చాడు. ఖడ్గ మృగాలను సంరక్షించేందుకు వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్(డబ్ల్యూడబ్ల్యూఎఫ్), యానిమల్ ప్లానెట్‌తో కలిసి పనిచేసేందుకు రోహిత్ సిద్ధమయ్యాడు. ఈనెల 22న ప్రపంచ రైనో దినోత్సవాన్ని పురస్కరించుకుని యానిమల్ ప్లానెట్ సంస్థ 'రోహిత్4రైనోస్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నది. అంతరించిపోతున్న ఖడ్గమృగాల పరిరక్షణ కోసం హిట్‌మ్యాన్ ప్రతినబూనాడు. లైంగిక సామర్థ్యాన్ని పెంచుకునేందుకు కొమ్ముల కోసం ఖడ్గమృగాలను విచక్షణ రహితంగా చంపేస్తున్నారు. బ్లాక్ మార్కెట్‌లో ప్రస్తుతం రైనోల కొమ్ములకున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని వేట గాళ్లు ఇష్టారీతిలో చంపేస్తున్నారు. దీన్ని నిర్మూలించే ప్రయత్నంలో పాలుపంచుకోబోతున్న రోహిత్ మాట్లాడుతూ 'మనతో పాటు ఈ భూమ్మీద జీవిస్తున్న మిగతా ప్రాణులను కాపాడటం మన విధి. భవిష్యత్తు మన చేతుల్లోనే ఉంది. ప్రకృతి మనకిచ్చిన వనరులను పిల్లల కోసం కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. యానిమల్ ప్లానెట్, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా తీసుకొచ్చిన ఈ అవగాహన కార్యక్రమం చాలా మందిలో స్ఫూర్తి నింపుతుందనుకుంటున్నాను' అని రోహిత్ అన్నాడు.

నాపై వేటు వేస్తారా!

సెలెక్షన్ కమిటీ సభ్యుడిపై బంగర్ గుస్సా

న్యూఢిల్లీ: తన కోపమే తనకు శత్రువు అంటారు. అవును బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ పరిస్థితి ప్రస్తుతం అలాగే ఉంది. బ్యాటింగ్ కోచ్‌గా తిరిగి కొనసాగే అవకాశాలు లేని పరిస్థితుల్లో బంగర్ తనలోని అసంతృప్తిని వెళ్లగక్కాడు. చీఫ్ కోచ్‌ను కపిల్‌దేవ్ కమిటీ ఎంపిక చేయగా, మిగతా సహాయక సిబ్బందిని ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ ఇంటర్వ్యూలతో తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే తనను కొనసాగించడం లేదని తెలిసిన తర్వాత రెండు వారాల క్రితం సెలెక్షన్ కమిటీ సభ్యుడు దేవాంగ్ గాంధీపై బంగర్ పరుష పదజాలంతో విరుచుకుపడినట్లు తెలిసింది. గాంధీ ఉన్న రూమ్ తలుపులు తన్నుకుంటూ లోపలికి వెళ్లిన బంగర్ నోటికి వచ్చినట్లు తిట్టి తనను కొనసాగించకపోవడంపై ప్రశ్నించినట్లు సమాచారం. బ్యాటింగ్ కోచ్‌గా అవకాశం లేకపోతే కనీసం ఎన్‌సీఏలో ఏదైనా స్థానంలో తనను నియమించాలని లేకపోతే జట్టు సభ్యుల నుంచి వ్యతిరేకత వస్తుందని బంగర్ అన్నట్లు వినికిడి. జరిగిన ఉదంతంపై సునీల్ సుబ్రమణ్యం లేదా రవిశాస్త్రి ఇచ్చే నివేదిక ప్రకారం బోర్డు బంగర్‌ను ప్రశ్నించే చాన్స్ ఉంది.

పవన్ పంజా

ఉత్కంఠ పోరులో పాట్నాపై బెంగళూరు గెలుపు

బెంగళూరు : ప్రొకబడ్డీ ఏడో సీజన్‌లో బెంగళూరు బుల్స్ జోరు కొనసాగుతున్నది. స్టార్ రైడర్ పవన్ షెరావత్(17పాయింట్లు) మరోసారి పంజా విసరడంతో బెంగళూరు 40-39తో పాట్నా పైరేట్స్ విజయం సాధించింది. చివరి వరకు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో బెంగళూరు తరపున రైడింగ్ పవన్ సత్తా చాటగా... ట్యాక్లింగ్‌లో కీలక సమయాల్లో మహేందర్ సింగ్(5పాయింట్లు) అదరగొట్టాడు. పాట్నా స్టార్ రైడర్ పర్‌దీప్ నర్వాల్(14) చివరి దాకా పోరాడినా ఒక్కపాయింట్ తేడాతో ఓటమి తప్పలేదు. పైరేట్స్ పాయింట్ల ఖాతాను పర్‌దీప్ తెరువగా.. ఇరు జట్ల మధ్య హోరాహోరీ పోరు సాగింది. మ్యాచ్ 12వ నిమిషంలో పర్‌దీప్ అదిరే రైడ్‌తో బుల్స్ ఆలౌట్ కావడంతో పాట్నా 13-7కు దూసుకెళ్లింది. ఆ తర్వాత బెంగళూరు రైడర్ పవన్ విజృంభించి వరుస పాయింట్లు సాధించాడు. దీంతో బుల్స్ 16-20 వద్ద నిలిచింది. తొలి అర్ధభాగం ముగిసే సరికి పాట్నా 29-24తో ముందంజలో నిలిచింది. రెండో అర్ధభాగంలోనూ చాలాసేపు పాట్నా ఆధిక్యంలో కొనసాగింది. ఈ తరుణంలో 50 సార్లు సూపర్ 10సాధించిన తొలి ప్లేయర్‌గా పర్‌దీప్ చరిత్ర సృష్టించగా.. ఓ దశలో 37-29తో నిలిచిన పైరేట్స్ ఇక విజయం ఖాయమనుకుంది. ఇక అక్కడి నుంచి బెంగళూరు విజృంభించింది. పర్‌దీప్ నర్వాల్‌ను అజయ్ పట్టేయడంతో పాట్నాను ఆలౌట్ చేసి బుల్స్ పోటీలోకి వచ్చింది. పైరేట్స్ ఆధిక్యాన్ని క్రమంగా తగ్గించింది. పవన్ సహా డిఫెండర్లు రాణించడంతో ఏకంగా 38-38తో పాయింట్లు సమం చేసిన బెంగళూరు.. చివరి క్షణాల్లో కీలకపాయింట్లు సాధించి ఒక్క పాయింట్ తేడాతో పాట్నాపై విజయం సాధించింది. అంతకుముందు జరిగిన మరో ఉత్కంఠ పోరులో ఢిల్లీ దబాంగ్ జట్టు 46-44తో జైపూర్ పింక్ పాంథర్స్‌ను మట్టికరిపించింది. ఢిల్లీ రైడర్ నవీన్ కుమార్ 16పాయింట్లతో సత్తా చాటాడు.

బంగ్లాతో ఆఫ్ఘన్ తొలి టెస్టు

రషీద్ ఖాన్

చిట్టగాంగ్ : ఆఫ్ఘనిస్థాన్ - బంగ్లాదేశ్ మధ్య ఏకైక టెస్టు గురువారమిక్కడ ప్రారంభం కానుంది. ప్రపంచకప్ తర్వాత మూడు ఫార్మాట్లకు కెప్టెన్‌గా నియమితుడైన స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్.. ఆఫ్ఘన్ జట్టును నడిపించనున్నాడు. ఈ మ్యాచ్‌తో టెస్టు జట్టుకు సారథ్యం వహించిన పిన్న వయస్కుడిగా రషీద్(20 ఏండ్ల 350 రోజులు) రికార్డు సృష్టించనున్నాడు. 2017లో టెస్టు హోదా సాధించిన ఆఫ్ఘన్.. భారత్‌తో గతేడాది జూన్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లో కేవలం రెండు రోజుల్లోనే పరాజయం పాలైన సంగతి తెలిసిందే. ఈ ఏడాది మార్చిలో ఐర్లాండ్‌తో జరిగిన పోరులో ఆ జట్టు విజయం సాధించింది.

స్మిత్ గోడలా..!

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 170/3

మొదటి రోజు ఆటకు వర్షం అడ్డంకి

మాంచెస్టర్ :

యాషెస్ సిరీస్‌ను వరుణుడు వదలడం లేదు. సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియా-ఇంగ్లండ్ మధ్య గురువారమిక్కడి ఓల్డ్ ట్రఫోర్డ్ మైదానంలో ప్రారంభమైన నాలుగో టెస్టుకు వర్షం తీవ్ర ఆటంకం కలిగించింది. దీంతో తొలి రోజు ఆట కేవలం 44ఓవర్లు సాగగా ఆస్ట్రేలియా మూడు వికెట్లు కోల్పోయి 170 పరుగులు చేసింది. క్రీజులో మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్(93 బంతుల్లో 60 నాటౌట్; 7ఫోర్లు), ట్రావిస్ హెడ్(18 నాటౌట్) ఉన్నారు. అంతకుముందు లాంబుస్‌చేస్(128 బంతుల్లో 67; 10ఫోర్లు) రాణించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రాడ్ రెండు, ఓవర్‌టన్ ఓ వికెట్ తీశారు.

అదుకున్న స్మిత్, లాంబుస్‌చేస్

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియాకు ఆదిలోనే షాక్ తగిలింది. యాషెస్‌లో వరుసగా విఫలమవుతున్న వార్నర్ తొలి ఓవర్‌లోనే బ్రాడ్ బౌలింగ్‌లో కీపర్‌కు క్యాచ్ ఇచ్చి డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత కాసేపు నిలకడగానే ఆడిన మార్కస్ హారిస్(13)ను కూడా బ్రాడ్ పెవిలియన్‌కు పంపడంతో ఆసీస్ 28 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ సమయంలో లాంబుస్‌చేస్, స్టీవ్ స్మిత్ సాధికారికంగా ఆడారు. ఇంగ్లండ్ బౌలర్లకు ఎలాంటి అవకాశమివ్వకుండా ముందుకు సాగుతూ... ఆడపా దడపా బౌండరీలు బాదారు. దీంతో లంచ్ విరామ సమయానికి 98-2తో ఆసీస్ నిలిచింది. అయితే ఆ తరుణంలో వర్షం పడడంతో ఆట దాదాపు రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. హోరుగాలి కారణంగా స్టంప్స్‌పై బెయిల్స్ లేకుండానే కాసేపు ఆటను అంపైర్లు కొనసాగించారు. ఆ తర్వాత కూడా స్మిత్, లాంబుస్‌చేస్ జోరు ప్రదర్శించారు. ఈ క్రమంలో లాంబుస్‌చేస్ అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. ఈ సిరీస్‌లో అతడికిది వరుసగా నాలుగో హాఫ్ సెంచరీ. స్మిత్ కూడా ధాటిగా ఆడాడు. ఇద్దరి మధ్య 116 పరుగుల భాగస్వామ్యం పూర్తయ్యాక ఓవర్‌టన్ బౌలింగ్‌లో లాంబుస్‌చేస్ బౌల్డయ్యాడు. ఆ తర్వాత స్మిత్‌కు జత కలిసిన హెడ్ ధాటిగా ఆడి మూడు ఫోర్లు బాదాడు. మళ్లీ వర్షం జోరుగా కురవడంతో అంపైర్లు తొలిరోజు ఆట ముగిసినట్టు ప్రకటించారు.

స్మిత్ (60★)

క్వాలిఫయర్స్‌లో భారత్ తొలిపోరు

నేడు ఒమన్‌తో మ్యాచ్

గువాహటి : 2022లో ఖతార్ వేదికగా జరిగే ఫిఫా ప్రపంచకప్‌లో చోటే లక్ష్యంగా క్వాలిఫయర్స్‌కు కెప్టెన్ సునీల్ ఛెత్రీ నేతృత్వంలోని భారత ఫుట్‌బాల్ జట్టు సిద్ధమైంది. సొంత గడ్డపై తొలి క్వాలిఫయర్ మ్యాచ్‌లోనే తన కంటే మెరుగైన ర్యాంకు జట్టు ఒమన్(87)ను టీమ్‌ఇండియా(103) గురువారం ఇక్కడి ఇందిరాగాంధీ అథ్లెటిక్ స్టేడియంలో ఢీకొనునుంది. కోచ్‌గా స్టిమాక్ బాధ్యతలు చేపట్టాక కింగ్‌కప్, ఇంటర్ కాంటినెంటల్ కప్ టోర్నీల్లో అనుకున్న స్థాయిలో జట్టు ప్రదర్శన చేయకపోవడంతో ఈ క్వాలిఫయర్స్ భారత్‌కు పెద్ద పరీక్షే కానుంది. అయితే, భారత జట్టు ఎంతో ఫిట్‌గా, గెలుపు ఆకలితో ఉందని కెప్టెన్ ఛెత్రీ అన్నాడు. మ్యాచ్ కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నామన్నాడు. 'అద్భుతమైన శిక్షణ శిబిరంలో పాల్గొన్నాం. జట్టులో ప్రతి ఒక్కరు ఫిట్‌గా, ఆకలితో ఉన్నారు. మరింత రాటుదేలారు' అని పేర్కొన్నాడు. తాను యువ ఆటగాళ్లకు ఓ ఉదాహరణగా నిలవాలన్న లక్ష్యంతో ఎప్పుడూ అత్యుత్తమంగా ఆడేందుకు కృషి చేస్తుంటానని చెప్పాడు. ఈ మ్యాచ్‌కు అభిమానులు భారీ సంఖ్యలో వస్తారని, తాము తప్పకుండా బాగా ఆడతామని ఛెత్రీ ధీమా వ్యక్తం చేశాడు. క్వాలిఫయర్స్‌కు జట్టు పూర్తిగా సన్నద్ధమైందని కోచ్ స్టిమాక్ చెప్పాడు. సమిష్టిగా ఎలాంటి ఒత్తిడి లేకుండా ఒమన్‌పై ఆడతామని గోల్ కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధు చెప్పాడు.

సెన్సెక్స్	నిఫ్టీ
36,725	10,845
▲ 162	▲ 47

ముడి చమురు (బ్రెంట్) ▲ 60.71 డాలర్లు

బంగారం ధరలు

న్యూఢిల్లీ (రూ.లలో)

24 క్యారెట్లు	39,248
22 క్యారెట్లు	----
వెండి (కిలో)	50,125

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	68.80	74.30
యూరో	75.00	81.50
బహ్రెయిన్ దినార్	179.00	193.00
కువైట్ దినార్	225.00	237.00
సౌదీ రియాల్	18.00	19.80
యూఏఈ దిర్హామ్	18.50	20.20

'సెబీ రూ.106 కోట్లే ఇచ్చింది'

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4: సహారా-సెబీ కేసులో సెబీ తీరుపట్ల సహారా గ్రూప్ విస్మయం వ్యక్తం చేసింది. ఆరేండ్లవుతున్నా.. మదుపరులకు సెబీ కేవలం రూ.106 కోట్లనే తిరిగి ఇచ్చిందని విమర్శించింది. 95 శాతం మదుపరులకు చెందిన సొమ్మును అప్పగించామన్న సహారా గ్రూప్.. 13,543 మందికి రూ.56.86 కోట్ల అసలు, రూ.49.24 కోట్ల వడ్డీని మాత్రమే సెబీ ముట్టజెప్పిందని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నది. ఈ కేసులో రెండింతలు సెబీ వద్ద డిపాజిట్ చేశామన్న సహారా.. ఆ సొమ్ము తమ వద్ద ఉంటే.. వ్యాపార విస్తరణ, ఉద్యోగ సృష్టికి దోహదపడేవారమన్నది.

రెపో రేటుకు కలపండి

రుణాల వడ్డీరేట్లపై బ్యాంకర్లకు ఆర్బీఐ ఆదేశం

అక్టోబర్ 1 నుంచి కొత్త విధానం అమల్లోకి

ముంబై, సెప్టెంబర్ 4: దేశ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న స్తబ్ధతను తొలగించే దిశగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రభావవంతమైన నిర్ణయాలనే తీసుకుంటున్నది. రుణాల వడ్డీరేట్లను రెపో రేటు సహా ఇతర బాహ్య ప్రామాణికాలతో అనుసంధానం చేయాలని బుధవారం బ్యాంకర్లను ఆదేశించింది. రెపో రేటు అనుసంధానాన్ని తప్పనిసరి చేస్తూ ఓ సర్క్యులర్‌నూ విడుదల చేసింది. గృహ, వ్యక్తిగత, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)లకు రుణ లభ్యతను సులభతరం చేయాలని, వడ్డీ భారాన్ని తగ్గించాలని అందులో సూచించింది. ప్రస్తుతమున్న మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్ఆర్) విధానం సంతృప్తికరంగా లేదని అభిప్రాయపడ్డ ఆర్బీఐ.. ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్‌ను అనుసరించాలని కోరింది. ఈ మేరకు ఆర్బీఐ ఓ సర్క్యులర్ జారీ చేసింది. గత నాలుగు వరుస ద్రవ్యసమీక్షల్లో రెపో, రివర్స్ రెపో వడ్డీరేట్లను ఆర్బీఐ తగ్గించిన విషయం తెలిసిందే. 110 బేసిస్ పాయింట్ల మేర దించింది. చివరి ద్రవ్య సమీక్షలోనైతే 35 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. అయినప్పటికీ బ్యాంకులు మాత్రం రుణాలపై వడ్డీరేట్లను ఆశించిన స్థాయిలో తగ్గించలేదు. 40 బేసిస్ పాయింట్లు మాత్రమే తగ్గించాయి. దీనిపై ఆర్బీఐ ఎన్నోసార్లు బహిరంగంగానే తమ అసంతృప్తిని వ్యక్తం చేయగా, ఇప్పుడు నేరుగా బ్యాంకులనే ఆదేశించింది. కాగా, పదికిపైగా బ్యాంకులు ఇప్పటికే తమ రుణాలపై వడ్డీరేట్లను రెపో రేటుతో అనుసంధానించాయి. తాజా ఆర్బీఐ ఆదేశం నేపథ్యంలో మిగతా బ్యాంకులూ ఇదే బాటలో పయనించనున్నాయి. రెపో రేటు ఆధారిత రుణాల వడ్డీరేట్ల వల్ల ఆర్బీఐ ద్రవ్యసమీక్షల్లోని నిర్ణయాల ఫలాలు రుణ గ్రహీతలను తక్షణమే చేరుతాయి. అంతేగాక ఇప్పుడున్న రెపో రేటు చాలా తక్కువ కాబట్టి గృహ, వ్యక్తిగత ఇతరత్రా రుణాల ఈఎంఐ భారం కూడా గణనీయంగానే తగ్గుతుంది.

సెట్-టాప్ బాక్స్ ఫ్రీ?

నేడే జియోఫైబర్ సేవలు ప్రారంభం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4: ప్రతీ బ్రాడ్‌బాండ్ కనెక్షన్‌తో ఓ సెట్-టాప్ బాక్స్‌ను రిలయన్స్ జియో ఉచితంగా అందించనున్నట్లు తెలుస్తున్నది. డైరెక్ట్-టు-హోం, కేబుల్ టీవీ కస్టమర్లను ఆకట్టుకోవడంలో భాగంగా బ్రాడ్‌బాండ్ కనెక్షన్ తీసుకున్న వారికి సెట్-టాప్ బాక్స్ ఉచితంగా అందనున్నదని సంబంధిత వర్గాల సమాచారం. గురువారం నుంచి జియోఫైబర్ బ్రాడ్‌బాండ్ సేవలు మొదలు కానున్నాయి. జియో ఫైబర్ కస్టమర్లు ల్యాండ్‌లైన్ వాయిస్ కాల్స్‌ను ఉచితంగా జీవితకాలం పొందగలరని ఇప్పటికే ముకేశ్ అంబానీ ప్రకటించిన విషయం తెలిసిందే.

బ్రేకేసిన మారుతి

ఉత్పత్తికి రెండు రోజులు విరామం • అమ్మకాల్లో మందగమనం ప్రభావం

ఈ నెల 7, 9 తేదీల్లో హర్యానా ప్లాంట్లు బంద్ • గత నెల 34 శాతం తగ్గిన తయారీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4: మార్కెట్‌లో నెలకొన్న తీవ్ర మందగమన పరిస్థితుల నేపథ్యంలో వాహన తయారీకి దేశీయ ఆటో రంగ దిగ్గజం మారుతి సుజుకీ విరామాన్నిచ్చింది. హర్యానాలోని గురుగ్రామ్, మనేసర్ ప్లాంట్లలో రెండు రోజులు ఉత్పత్తిని ఆపేస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. ఈ నెల 7, 9 తేదీల్లో ఉత్పత్తి ఉండబోదని స్పష్టం చేసింది. గత నెల ఆగస్టులో 33.99 శాతం ఉత్పత్తిని తగ్గించిన మారుతి.. నిరుడుతో పోల్చితే ఈసారి వాహనాల తయారీని 1,68,725 యూనిట్ల నుంచి 1,11,370 యూనిట్లకు దించింది. ప్యాసింజర్ వాహనాల ఉత్పత్తి గత నెల 33.67 శాతం క్షీణించి 1,66,161 యూనిట్ల నుంచి 1,10,214 యూనిట్లకు తగ్గిపోయింది. ఇలా ఉత్పత్తిని తగ్గించడం వరుసగా ఇది ఏడో నెల కావడం గమనార్హం. 'సెప్టెంబర్ 7, 9 తేదీల్లో హర్యానాలోని మా గురుగ్రామ్, మనేసర్ ప్లాంట్లలో ఉత్పత్తిని నిలిపివేస్తున్నాం' అని ఓ ప్రకటనలో మారుతి సుజుకీ ఇండియా స్పష్టం చేసింది. కాగా, అంతకుముందు నెల జూలైలోనూ మారుతి ఉత్పత్తి 25.15 శాతం పడిపోయి 1,33,625 యూనిట్లకు పరిమితమైంది. ఆగస్టు అమ్మకాలు 33 శాతం క్షీణించిన విషయం తెలిసిందే. గతేడాది ఆగస్టులో 1,58,189 యూనిట్ల విక్రయాలు జరుగగా, ఈ ఏడాది ఆగస్టులో 1,06,413 యూనిట్ల అమ్మకాలే జరిగాయి. గడిచిన రెండు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంత గడ్డు పరిస్థితులను భారతీయ ఆటో పరిశ్రమ ఎదుర్కొంటుండగా, ఇప్పటికే దేశ, విదేశీ సంస్థలు ఉత్పత్తికి విరామం ప్రకటించిన సంగతి విదితమే. టాటా మోటర్స్, మహీంద్రా అండ్ మహీంద్రా తదితర సంస్థలు వర్క్ హాలిడేలను పాటిస్తున్నాయి.

4%
క్షీణించిన మారుతి షేర్లు

బుధవారం దేశీయ స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో మారుతి సుజుకీ షేర్లు నష్టాలను చవిచూశాయి. గురుగ్రామ్, మనేసర్ ప్లాంట్లలో రెండు రోజుల ఉత్పత్తి విరామం ప్రకటన నేపథ్యంలో సంస్థ షేర్ విలువ దాదాపు 4 శాతం క్షీణించింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లో ఒకానొక దశలో 4.15 శాతం మేర పతనమైంది. అయితే చివరకు కోలుకుని 3.64 శాతం నష్టాలపాలై రూ.5,829.75 వద్ద స్థిరపడింది. దీంతో ఈ ఒక్కరోజే సంస్థ మార్కెట్ విలువ రూ.6,644.88 కోట్లు హరించుకుపోయింది. ప్రస్తుతం మారుతి సుజుకీ మార్కెట్ విలువ రూ.1,76,105.12 కోట్లుగా ఉన్నది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లో సంస్థ షేర్ విలువ 4 శాతం దిగజారి రూ.5,805.20గా ఉన్నది.

ఆశలన్నీ పండుగ సీజన్‌పైనే

ఆటో రంగ సంస్థలన్నీ రాబో యే పండుగ సీజన్‌పైనే ఆశలు పెట్టుకున్నాయి. ఈ పండుగ సీజన్‌లో అమ్మకాలు తిరిగి ఊపందుకుంటాయన్న విశ్వాసాన్ని మారుతి సుజుకీ, టయోటా, హోండా సంస్థలు కనబరుస్తున్నాయి. దసరా, దీపావళి పండుగల వేళ వాహన విక్రయం శుభప్రదమని చాలా మంది భావిస్తారు. దీంతో గత కొన్ని నెలలుగా దిగజారిపోతున్న అమ్మకాలు ఈ పండుగ సీజన్‌లో పుంజుకోగలవన్న ఆశాభావాన్ని ఆయా ఆటో సంస్థలు వ్యక్తం చేస్తున్నాయి. ఆగస్టులో మారుతి అమ్మకాలు 33 శాతం, హోండా 21 శాతం, టయోటా 51 శాతం చొప్పున క్షీణించాయి. ఈ క్రమంలోనే ఢిల్లీలో జరిగిన ఆటోమొబైల్ డీలర్ల సమాఖ్య సంఘాల వార్షిక రిటైల్ సదస్సులో హోండా, టయోటా ప్రతినిధులు వచ్చే పండుగ సీజన్ బాగుంటుందన్న ధీమాను వెలిబుచ్చారు. మారుతి సుజుకీ మాత్రం ఒకింత సంశయాన్ని వ్యక్తం చేసింది. అయినప్పటికీ పరిస్థితులు చక్కబడాలని ఆకాంక్షించింది.

ముందంతా గడ్డు కాలమే: సియామ్

ఆటో పరిశ్రమ ఇప్పట్లో కోలుకునే అవకాశాలు కనిపించడం లేదని దేశీయ ఆటోమొబైల్ తయారీదారుల సంఘం (సియామ్) ఆందోళన వ్యక్తం చేసింది. అసలే అమ్మకాలు లేక దిగాలుపడిన ఆటో రంగానికి బీఎస్-6 ఉద్గార నిబంధనల పరివర్తన గుదిబండలా పరిణమించనున్నదని వ్యాఖ్యానించింది. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి బీఎస్-4 నుంచి బీఎస్-6కు వాహనాల టెక్నాలజీ మారాల్సి ఉన్నది. దీంతో ముమ్ముందు ఆటో కంపెనీలపై మరింత భారం పడనుందని బుధవారం సియామ్ అధ్యక్షుడు రాజన్ వధేరా అన్నారు. ప్రతీ సంస్థ తమ వాహనాల ఆధునికీకరణకు రూ.1,000 కోట్ల మేర ఖర్చు చేయాల్సి వస్తుందని చెప్పారు. మార్కెట్ మందగమనం నేపథ్యంలో వాహన తయారీదారులు, ఆటో కంపోనెంట్స్ ఉత్పత్తిదారులు, డీలర్లు కష్టాల్లో పడ్డారని, ఇంత మొత్తంలో పెట్టుబడులకు ఆటో రంగం వేగంగా ముందుకు రాకపోవచ్చన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. వాతావరణంలో కర్బన ఉద్గారాల స్థాయి ప్రమాదకర స్థితికి చేరిన నేపథ్యంలో బీఎస్-6 నిబంధనలను కేంద్రం త్వరగా అమల్లోకి తెస్తున్నది.

ఉద్యోగుల తొలగింపులు

మార్కెట్ మందగమనం, పడిపోయిన అమ్మకాల నేపథ్యంలో వ్యయ నియంత్రణ చర్యలకు ఉపక్రమించిన మారుతి.. గత నెల దాదాపు 3 వేల కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించింది. అయితే మారుతి సుజుకీలో 16,050 మంది శాశ్వత ఉద్యోగులుండగా, వారిని తొలగించే యోచనేదీ లేదని సంస్థ చైర్మన్ ఆర్‌సీ భార్గవ స్పష్టం చేశారు. అయినప్పటికీ పరిస్థితులు ఇలాగే ఉంటే మరికొంత మందికి ఉపాధి దూరం కావడం ఖాయమన్న అభిప్రాయాలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో సంస్థ నికర లాభం గతంతో పోల్చితే 27.3 శాతం పతనమై రూ.1,435.50 కోట్లకు పరిమితమైంది. గతేడాది ఏప్రిల్-జూన్‌లో రూ.1,975.30 కోట్లుగా ఉన్నది. అమ్మకాల ఆదాయం గతంతో పోల్చితే రూ.21,810.70 కోట్ల నుంచి రూ.18,735.20 కోట్లకు తగ్గింది. కాగా, ఆటో పరిశ్రమకు ఉద్దీపనలు అవసరమని, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) భారం తగ్గించాలని భార్గవ డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఆటో కంపోనెంట్ పరిశ్రమలో 2 లక్షలకుపైగా ఉద్యోగాలు పోయినది తెలిసిందే.

ఆ రంగాల్లో ఉద్యోగాల్లేవ్

టెలికం, ఆటో, నిర్మాణ రంగాలు ఆందోళనకరం: టీమ్‌లీజ్

బ్యాంకింగ్, బీమా, ఈ-కామర్స్ రంగాల్లో మెరుగు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4: ఆర్థిక మందగమనం.. వివిధ రంగాల్లో ప్రతిభావంతుల ఉద్యోగావకాశాలను దెబ్బతీస్తున్నది. ముఖ్యంగా టెలికం, ఆటోమొబైల్, నిర్మాణ రంగాల్లో కొత్త కొలువుల ఊసే దాదాపు లేకుండా పోతున్నదని టీమ్‌లీజ్ సర్వీసెస్ తెలియజేసింది. 'బ్యాంకింగ్, బీమా, ఈ-కామర్స్ రంగాల్లో ఉద్యోగావకాశాలు మెరుగ్గానే ఉన్నా.. టెలికం, ఆటోమొబైల్, రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్ రంగాల్లో మాత్రం స్తబ్ధత నెలకొన్నది' అని టీమ్‌లీజ్ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షురాలు, సహ వ్యవస్థాపకురాలు రీతుపర్ణా చక్రవర్తి అన్నారు. బుధవారం ఇక్కడ ఆమె తమ క్లౌడ్ వెబ్‌సైట్ www. teamlease compliance.com, రూల్జ్‌బుక్ యాప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ-కామర్స్, ఫుడ్ టెక్ రంగాల్లో ఉద్యోగులకు డిమాండ్ కనిపిస్తున్నా.. టెలికం, ఆటో, నిర్మాణ రంగాల్లో ఆ పరిస్థితి లేదన్నారు. కాగా, తమ వెబ్‌సైట్ ఏడు విభాగాల్లోని వెయ్యికిపైగా చట్టాలను పరిగణనలోకి తీసుకుంటూ సంస్థాగత సమస్యలకు సమగ్ర రీతిలో పరిష్కార మార్గాలను అందిస్తుందని రీతుపర్ణా చెప్పారు. దేశ జీడీపీ వరుసగా ఐదో త్రైమాసికం క్షీణించగా, ఈ ఏప్రిల్-జూన్‌లోనైతే ఆరేండ్లకుపైగా కనిష్ఠానికి దిగజారి 5 శాతానికి పరిమితమైన విషయం తెలిసిందే. అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితులు, ప్రైవేట్ పెట్టుబడుల్లో నిస్తేజం, వినియోగదారుల్లో పడిపోయిన కొనుగోళ్ల శక్తి భారత వృద్ధిరేటును బలి తీసుకుంటున్నాయి. మరోవైపు ప్రముఖ నిర్మాణ రంగ సంస్థ లోధా గ్రూప్ 400 మంది ఉద్యోగులను తొలగించింది. పనితీరు బాగోలేనందు వల్లే తీసేసినట్లు తెలుస్తున్నది.

పరుగుల వెండి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:

- మరో రూ.2,070 పెరిగిన కిలో ధర
- రూ.50,125గా నమోదు
- రూ.122 ఎగిసి రూ.39,248కి చేరిన తులం బంగారం
- అంతర్జాతీయ మార్కెట్‌లో భారీ డిమాండే కారణం

బంగారం, వెండి ధరలు పరుగులు పెడుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మందగమనం ఛాయలు కనిపిస్తుండటం, స్టాక్ మార్కెట్లు భారీ నష్టాల్లో కదలాడుతుండటంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షిత వేదికలకు తరలిస్తున్నారు. దీంతో బంగారం, వెండి ధరలు ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నాయి. బుధవారం దేశ రాజధాని ఢిల్లీలో వెండి ధర మరో రూ.2,070 ఎగబాకింది. దీంతో కిలో వెల రూ.50,125గా నమోదైంది. మంగళవారం ఇది రూ.48,055గా ఉన్నది. దాదాపు గత రెండు నెలల కాలంగా బంగారం, వెండి ధరలు క్రమేణా పెరుగుతూపోతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే వెండి కిలో ధర సుమారు రూ.15 వేల నుంచి 18 వేల వరకు ఎగిసింది. ధరల్లో స్థిరత్వం లోపించడంతో భవిష్యత్ అవసరాల దృష్ట్యా పరిశ్రమలు పెద్ద ఎత్తున వెండి కొనుగోళ్లకు దిగుతున్నాయి. దీనికితోడు గ్లోబల్ మార్కెట్‌లోనూ డిమాండ్ విపరీతంగా వ్యక్తమవుతుండటంతో ధరలు అమాంతం పెరిగిపోతున్నాయని ఫారెక్స్ మార్కెట్ వర్గాలు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నాయి. న్యూయార్క్‌లో ఔన్సు వెండి విలువ 19.27 డాలర్లుగా నమోదైంది. మరోవైపు పుత్తడి మెరుపులూ ఆగడం లేదు. బుధవారం 24 క్యారెట్ల పసిడి విలువ 10 గ్రాములపై రూ.122 పెరిగింది. తులం రూ.39,248కి చేరింది. మంగళవారం రూ.538 ఎగిసిన విషయం తెలిసిందే. విదేశీ మార్కెట్‌లో ఔన్సు ధర 1,537 డాలర్లుగా ఉన్నట్లు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ తెలిపింది.

అమ్మకాలు జోరుగానే..

బంగారం, వెండి ధరలు మండిపోతున్నా.. వినియోగదారులు మాత్రం వెనుకకు తగ్గడం లేదు. వినాయక చవితి రోజున పసిడి, వెండి విక్రయాలు బాగున్నాయని ఆభరణాల వర్తకులు చెబుతున్నారు. ముఖ్యంగా వెండి పతకాలు, పువ్వులు, నగలకు గొప్ప ఆదరణ లభించినట్లు పేర్కొంటున్నారు. గణపతి విగ్రహాలకు వెండి కిరీటాలను తొడిగేందుకు చాలామంది ఆసక్తి కనబరిచినట్లు వ్యాపార వర్గాలు వెల్లడించాయి. మరోవైపు రాబోయే పండుగ సీజన్, పెండ్లిండ్ల సీజన్‌లో విక్రయాలు బాగుండే వీలుందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. 25 నుంచి 30 శాతం పసిడి అమ్మకాలు పెరుగుతాయన్న ఆశాభావాన్ని వెలిబుచ్చుతున్నారు. ధరలు పెరుగుతుండటంతో తప్పనిసరి అవసరాలకు ముందే కొనుగోళ్లకు దిగుతున్నారని అంటున్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం 10 గ్రాముల బంగారం రికార్డు స్థాయిలో రూ.40 వేలు పలుకుతుండటం గమనార్హం. వాస్తవానికి గణేశ్ చతుర్థికి రెండు రోజుల ముందు మార్కెట్ నీరసంగా ఉందని, పండుగ రోజు మాత్రం పుంజుకుందని నగల వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతి పత్రం అందజేస్తున్న టీసీటీజీవో ప్రతినిధులు

జీఎస్టీ సమస్యల్ని తీర్చండి

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు టీసీ టీజీవో విజ్ఞప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లలో తెలంగాణ రాష్ట్రం ముందున్నప్పటికీ.. ఇంకా ఆదాయం వచ్చే వీలుందని, దీన్ని పరిగణనలోకి తీసుకుని అవకాశాలు కల్పించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఆల్ ఇండియా కమర్షియల్ ట్యాక్స్ అసోసియేషన్ (ఏఐసీటీఏ) అధ్వర్యంలో తెలంగాణ కమర్షియల్ ట్యాక్స్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీసీ టీజీవో) విజ్ఞప్తి చేసింది. ఢిల్లీలో ఏఐసీటీఏతో కలిసి నిర్మలా సీతారామన్‌కు వినతిపత్రం సమర్పించారు. జీఎస్టీ అంశాల్లో సాంకేతిక పరమైన ఇబ్బందులు ఉంటున్నాయని, వాటిని కేంద్రమే పరిష్కరించాలని, కేంద్ర నిర్లక్ష్య వైఖరితో రాష్ట్రంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు సదరు వినతి పత్రంలో పేర్కొన్నారు. కాగా, దీనిపై త్వరలోనే ఉన్నత స్థాయిలో సమావేశం నిర్వహిస్తామని సీతారామన్ హామీ ఇచ్చినట్లు టీసీ టీజీవో అధ్యక్షుడు బీ వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి దేవేందర్, సంధ్యారాణి తెలిపారు.

1,224 కోట్లు జరిమానా చెల్లిస్తున్న గూగుల్!

వాషింగ్టన్, సెప్టెంబర్ 4: ఇంటర్నెట్ దిగ్గజం గూగుల్ భారీ జరిమానాను చెల్లిస్తున్నది. తమ యూట్యూబ్ వీడియో సర్వీస్‌పై పిల్లల నుంచి అక్రమంగా డేటాను సమీకరించిందని, షేరింగ్ చేసిందన్న ఆరోపణలను గూగుల్ ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈ కేసు పరిష్కారార్థం ఏకంగా రూ.1,224 కోట్ల (170 మిలియన్ డాలర్లు)ను చెల్లించేందుకు గూగుల్ బుధవారం అంగీకరించింది.

జాతీయ పోటీ బిడ్డింగ్
హైదరాబాద్ అభివృద్ధి సంస్థ లిమిటెడ్
టెండరు ప్రకటన

టెండరు ప్రకటన నం. 30/CE/SE/EE/TS/AEE/HRDCL/2019-20 **తేదీ: 31-08-2019**

పని పేరు: ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ నిర్మాణం (EPC/టర్న్‌కీ) ప్రాతిపదికన (2 సం.ల DLP కలిపి) నయాపూల్ మరియు అందులో భాగంగా గల వంతెన మధ్య పండ్ల విక్రయదారులకు వసతి కల్పించుట కొరకు అదనపు వంతెన యొక్క నిర్మాణం మరియు కులీకుతుబ్‌షా కాంప్లెక్స్ వద్ద ప్రతిపాదిత మల్టిలెవల్ కార్ పార్కింగ్‌కు ఐకానిక్ వంతెన యొక్క కనెక్టివిటీని మెరుగుపరచుటకు మరియు సెల్లార్ పార్కింగ్ లేకుండా సోలార్‌జంగ్ మ్యూజియంకు ఎదురుగా ఐకానిక్ పెడెస్ట్రియన్ వంతెన యొక్క నిర్మాణం. **మొత్తం ECV:** 231.5 కోట్లు. డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 11-09-2019న సా. 04.00 గం.నుండి. ప్రీ బిడ్ మీటింగ్: 25-09-2019. ప్రదేశం: వీఫ్ ఇంజినీర్ & COO కార్యాలయం, హైదరాబాద్ రహదారి అభివృద్ధి సంస్థ లిమిటెడ్, 3వ మరియు 4వ అంతస్తు, మెట్రోభవన్, సైఫాబాద్, హైదరాబాద్-500004. టెలిఫోన్: 040-23232302. ప్రీ బిడ్ ప్రశ్నలకు జవాబుల యొక్క అప్‌లోడింగ్: 03-10-2019న మ. 3.00 గంటలకు. డౌన్‌లోడ్ ముగింపు తేదీ: 17-10-2019న మ. 02.00 గం.వరకు, బిడ్ల స్వీకరణకు చివరి తేదీ & సమయం: 17-10-2019న మ. 03.00 గం.వరకు. సాంకేతిక బిడ్ తెరుచుట: 17-10-2019న సా. 04.00 గం. తరువాత. ధర బిడ్ తెరుచుట: 22-10-2019న సా. 04.00 గం. తరువాత. **గమనిక:** బిడ్ డాక్యుమెంట్ మరియు EPC ప్రాజెక్ట్ టెండర్ డ్రాయింగ్స్ యొక్క డౌన్‌లోడింగ్ కొరకు **https://tender.telangana.gov.in** చూడవల్సిందిగా బిడ్డర్లను కోరడమైనది. ఏవేని ప్రశ్నల కొరకు hydrdcts@gmail.comను సంప్రదించగలరు.

సం/- చీఫ్ ఇంజినీర్ & COO HRDCL, హైదరాబాద్
DIPR R.O.No. 353 PP/CL/Advt/1/2019-20 తేదీ: 04-09-2019

THE SINGARENI COLLIERIES COMPANY LIMITED
(A Government Company)
Regd. Office: KOTHAGUDEM – 507101, Telangana.

e-procurement TENDER NOTICE

Tenders have been published for the following Services / Material Procurement through e-procurement platform. For details, please visit https://tender.telangana.gov.in – or – http://www.scclmines.com

NIT/Enquiry No. - Description/Subject - Last date for Submission of bid(s)
E1319O0202 - Procurement of Ammonium Nitrate Lumps/Uncoated Solids for use in SMS Support plants at RG -III & Manuguru areas of SCCL for a period of 06 months. - **13/09/2019 - 17:00 hrs.**
E0919O0114 - Supply of Ordinary Portland Cement. - **16/09/2019 - 17:00 hrs.**
E1419O0197 - Transportation of Coal from KK-5 Incline to SRP CHP & Rechini siding on weight basis for a period of 2 years. - **18/09/2019 - 15:00 hrs.**
E1419O0204 - Transportation of Coal from GK OCP to PVK.5 Bunkers & RCHP Bunkers, Kgm Area on weight basis for a Period of 2 years. - **18/09/2019 -15:00 hrs.**
E0519O0177 - Procurement of Liquid Chlorine gas for various Areas of SCCL - **18/09/2019 - 17:00 hrs.**
E1219O0134 - Drivage of tunnel of 94.20m (approx length) for haulage and starting at about 48.10m from surface (end of Arch) to 1Seam with 1 in 4.5 dip gradient . 4.80m(width) x 3.00m(height) Cross section in stone at Kasipet 2 Incline, Mandamarri Area. - **19/09/2019 - 17:00 hrs.**
E0519O0171 - Procurement of Low Carbon Ferro Manganese for use Central work shop of SCCL. - **19/09/2019 - 17:00 hrs.**
E0619O0162 - Procurement of 60T Dumpers (Coal Body) with Spare Parts & Service supervision Contract with Cost Cap for a period of 6 Years / 27,000 Hours. - **23/09/2019 - 17:00 hrs.**
E0719O0198 - Procurement of hoses for PC450 Hydraulic Excavator on rate contract for a period of 2 years - **24/09/2019 - 17:00 hrs.**

NIT No., Date – Name of the work – ECV- Last date & time for Submission of bids
CRP/CVL/RG-II/TN-62/2019-20 Dt. 28-08-2019 – Widening of BT road from Pothana colony junction to 8 incline colony including laying of small stretch of new road from church junction to T2 type quarters near Vivekananda statue and cross drainage works at RG-II area, Godavarikhani, Peddapalli dist., TS. - **Rs. 4,75,83,782/- - up to 4:30 P.M on 13-09-2019.**
CRP/CVL/RG-I/TN-63/2019-20 Dt. 29-08-2019 – Repairs and resurfacing of roads (1) Coal transportation road from Diesel bunk to Main check post at MOCP (2) Laying of road from Manthani main road to 2nd sand stowing bunker GDK-11. (3) Damaged road from Ganga nagar junction to intake well (4) Internal roads at Power house colony, IB colony and GM office colony RG-1, (5) Widening of road at 5 Inc Chowrastha to No.4 elevated tank via GCOA club and road from vittalnagar park to no.4 elevated tank via SBH Bank at Sector-II to connect at 7 LEP main road in view of conversion of GDK-5 Inc to OC-V project, RG-I Area, GDK, Peddapalli District, TS - **Rs. 2,91,31,114/- - up to 4:30 P.M on 13-09-2019.**

PR/2019-20/MP/CVL/NEO/53 **GM (MP) – Chief (Civil)**

ఇన్‌ఫ్రా ప్రతినిధులతో ఆర్థిక మంత్రి భేటీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4: మౌలిక రంగ సమస్యలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగానే బుధవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. మౌలిక రంగ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆర్థిక మందగమనం, ఉద్యోగ సృష్టికి మౌలిక రంగాభివృద్ధి కీలకం కావడంతో ఈ రంగం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, సూచనలను ఈ సందర్భంగా వారి నుంచి మంత్రి తీసుకున్నారు. ఆర్థిక వ్యవస్థ పురోగతికి వివిధ రంగాలతో సీతారామన్ సమావేశమవుతున్న విషయం తెలిసిందే. గత నెల బ్యాంకర్లతో భేటీ అయిన మంత్రి.. ఇప్పుడు మౌలిక రంగ సంస్థల అధిపతులను కలిశారు. ఇప్పటికే ఆటో రంగ పెద్దలనూ ఆమె కలిసిన సంగతి విదితమే. ఆధునిక మౌలిక సదుపాయాలార్థం రూ.100 లక్షల కోట్ల పెట్టుబడులను పెట్టనున్నట్లు పంద్రాగస్టు ప్రసంగంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించినది తెలిసిందే.

ఎన్టీపీసీ తుది డివిడెండ్

రూ.2,473 కోట్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4: ప్రభుత్వ రంగ విద్యుదుత్పాదక దిగ్గజం ఎన్టీపీసీ.. గత ఆర్థిక సంవత్సరానికి (2018-19)గాను రూ.2,473.63 కోట్ల తుది డివిడెండ్‌ను తమ భాగస్వాములకు ప్రకటించింది. ఈ మేరకు ఓ ప్రకటనలో బుధవారం ఎన్టీపీసీ స్పష్టం చేసింది. కాగా, సంస్థ ఈక్విటీ షేర్ క్యాపిటల్‌లో ఇది నాలుగో వంతుకు సమానం కావడం గమనార్హం. ఇకపోతే కేంద్ర ప్రభుత్వానికి ఈ తుది డివిడెండ్‌లో రూ.1,348.23 కోట్లు దక్కగా, విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్‌సీ గార్గ్ సమక్షంలో కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్‌కు ఎన్టీపీసీ సీఎండీ గుర్దీప్ సింగ్ ఆ మొత్తాన్ని ఆర్టీజీఎస్ ద్వారా బదిలీ చేశారు. ఎన్టీపీసీ డివిడెండ్ చెల్లించడం వరుసగా ఇది 26వ సంవత్సరం కావడం విశేషం.

కోలుకున్న స్టాక్ మార్కెట్లు

ఆకట్టుకున్న మెటల్, బ్యాంకింగ్ షేర్లు • సెన్సెక్స్ 162, నిఫ్టీ 47 పాయింట్లు వృ

హైటెక్స్‌లో రేపటినుంచి ఇండస్ట్రియల్ ఎక్స్‌పో

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైటెక్స్‌లో ఈ నెల 6 (శుక్రవారం) నుంచి 8 వరకు ఇండోర్ ఇన్ఫోలిన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ అండ్ ఇంజినీరింగ్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నారు. దేశవిదేశాలకు చెందిన 150 మంది పాల్గొంటారు. పరిశ్రమల ఆధునిక యంత్రాలు, సాంకేతిక అంశాలను ఇందులో ప్రదర్శించనున్నారు. మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ సెక్టార్‌కు ఇది ఉపయోగపడనున్నది.

బ్రిటన్‌లో పది ప్రాంతాల్లో బతుకమ్మ

పోస్టర్‌ను ఆవిష్కరించిన జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బతుకమ్మ పండుగను బ్రిటన్‌లో పది ప్రాంతాల్లో నిర్వహించనున్నట్టు తెలంగాణ జాగృతి సంస్థ నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ జాగృతి యూనైటెడ్ కింగ్‌డమ్‌శాఖ ఆధ్వర్యం లో నిర్వహించే బతుకమ్మ పోస్టర్‌ను జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో బుధవారం ఆవిష్కరించారు. గత ఏడాది ఏడుచోట్ల నిర్వహించగా, ఈ సారి పది ప్రాంతాల్లో బతుకమ్మ నిర్వహిస్తున్నది. 'పది పల్లెల బతుకమ్మ, పదికాలాల బతుకమ్మ' నినాదంతో నిర్వహిస్తున్నట్టు జాగృతి యూకే అధ్యక్షుడు సుమన్ బల్మూరి తెలిపారు. చేనేతను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బతుకమ్మతో వచ్చిన ఆడబిడ్డలకు నారాయణపేట చేనేత చీరలను అందచేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్‌ఆచారి, కోరబోయిన విజయ్ , రోహిత్‌రావు, ప్రశాంత్ పూసా, నితీష్ వాడ్రేవు పాల్గొన్నారు.

యూకేలో నిర్వహించే బతుకమ్మ వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత, తెలంగాణ జాగృతి యూనైటెడ్ కింగ్‌డమ్‌శాఖ సభ్యులు.

ఆకట్టుకొన్న మిషన్ కాకతీయ

బాలి అంతర్జాతీయ సదస్సులో ప్రశంసలు

- గతేడాది 2,942 కోట్ల మత్స్యసంపద
- రసాయనిక ఎరువుల వాడకం తగ్గడంతో 27.6 శాతం ఖర్చు ఆదా
- ప్రజెంటేషన్‌లో వెల్లడించిన సీఎంవో ఓఎస్డీ శ్రీధర్‌రావ్ దేశ్‌పాండే

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకొంటున్న మిషన్ కాకతీయ విజయగాథ మరోసారి అంతర్జాతీయ యవనికపై మారుమోగింది. వేల సంఖ్యలో చారిత్రక చెరువుల పునరుద్ధరణతో తెలంగాణ గ్రామీణ వ్యవస్థలో ఆర్థిక, సామాజిక కోణాల్లో వచ్చిన విప్లవాత్మక మార్పులు అంతర్జాతీయ సాగునీటిరంగ నిపుణులను ఆకట్టుకొన్నాయి. మూడేండ్లకు ఒక సారి జరిగే ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్, డ్రైనేజీ (ఐసీఐడీ) అంతర్జాతీయ సదస్సు ఈసారి ఇండోనేషియాలోని బాలిలో ఈ నెల ఒకటో తేదీన ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ సదస్సులో తెలంగాణ సాగునీటిరంగానికి సంబంధించి మూడు విజయాలపై ఇంజినీర్లు రూపొందించిన పత్రాలు ఎంపిక య్యాయి. ఇందులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి విజయవంతం చేసిన మిషన్ కాకతీయ విజయాలపై బుధవారం తెలంగాణ సీఎంవో ఓఎస్డీ శ్రీధర్‌రావ్ దేశ్‌పాండే పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. తెలంగాణ చారిత్రక నేపథ్యంతో ముడిపడి ఉన్న చెరువుల పునరుద్ధరణకు ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయతో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయరంగంతో పాటు అనుబంధంగా ప్రయోజనాలు ఎలా ఉన్నాయనే దానిపై సాధికారిక సంస్థలు నిర్వహించి తేల్చిన సర్వేలను ఉదహరిస్తూ వివరించారు. మిషన్ కాకతీయ కింద పునరుద్ధరించిన చెరువులు పూర్వవైభవాన్ని సంతరించుకోవడం, గత ఏడాది ఐదు వేల చెరువుల్లో 70 కోట్ల చేప పిల్లల్ని వేయడం ద్వారా 2.94 లక్షల టన్నుల మత్స్యసంపద అభివృద్ధి చెందినట్లు స్పష్టంచేశారు. దీని ద్వారా రూ.2,942 కోట్ల విలువైన మత్స్యసంపదను సృష్టించడం సాధ్యమైందని తెలిపారు.

బాలి అంతర్జాతీయ సదస్సులో మిషన్ కాకతీయ ప్రగతిని వివరిస్తున్న శ్రీధర్‌రావ్ దేశ్‌పాండే

ఆకట్టుకొన్న నీటి నిర్వహణ

ఐసీఐడీ సదస్సులో మిషన్ కాకతీయతోపాటు నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల పరిధిలో మెరుగైన సాగునీటి నిర్వహణ ద్వారా కలిగిన ప్రయోజనాలపై తెలంగాణ ఇంజినీర్లు ప్రజంటేషన్ ఇచ్చారు. ముఖ్యంగా మిషన్ కాకతీయపై సీఎంవో ఓఎస్డీ శ్రీధర్‌రావ్ దేశ్‌పాండే సుదీర్ఘంగా ఇచ్చిన ప్రజంటేషన్ సదస్సుకు హాజరైన ప్రతినిధుల్ని విశేషంగా ఆకట్టుకొన్నది. చెరువు బాగుపడితే వ్యవసాయరంగమే కాకుండా గ్రామీణ వ్యవస్థతో అల్లుకొని ఉన్న అనేక రంగాల్లోనూ గణనీయ పురోగతి ఉంటున్నదనే వాస్తవాలను మిషన్ కాకతీయ రుజువు చేసిందని వివరించారు. నాలుగు దశల ద్వారా పునరుద్ధరించిన వేల సంఖ్యలోని చెరువుల పరిధిలో రైతులు, ప్రజలకు అందిన ఫలాలపై వివిధ సాధికారిక సంస్థలు అధ్యయనం చేసి సమర్పించిన నివేదికలను ఉదహరిస్తూ వివరించారు. వాస్తవంగా తెలంగాణ పరిధిలో 46,531 గొలుసు కట్టు చెరువులు ఉన్నాయని, కొన్నింటిల్లో 2-3 చెరువులు ఉండగా.. మరికొన్నింట్లో ఏకంగా 30-50 చెరువుల వరకు ఉన్నాయని తెలిపారు. నాలుగు దశల కింద వేలాది చెరువులను పునరుద్ధరించడం వల్ల సాగు విస్తీర్ణం మునుపటికంటే గణనీయంగా పెరిగిందన్నారు. వర్షాకాలం సీజన్‌లో చెరువుల కింద విస్తీర్ణం గతంలో కంటే 196 శాతం పెరుగగా, యాసంగిలో 160 శాతం వరకు పెరిగిందని తెలిపారు. గతంలో కంటే వరి ఎకరాకు 3.32 క్వింటాళ్ల దిగుబడి పెరిగితే, పత్తి 3.79 క్వింటాళ్లు, పసుపు 5 క్వింటాళ్లు, మక్కజొన్న 6.08 క్వింటాళ్లు, మిర్చి 7.13 క్వింటాళ్ల దిగుబడి పెరిగినట్టు చెప్పారు. చెరువుల పూడికను రైతులు స్వచ్ఛందంగా పొలాల్లోకి తరలించుకోవడం వల్ల రసాయనిక ఎరువుల వాడకం పెద్ద ఎత్తున తగ్గిందని, తద్వారా రైతులకు ఎకరాకు వరికి రూ.1915, పత్తికి రూ.3490, మిర్చి పంటకు రూ.595 మేర ఖర్చు తగ్గినట్లుగా అధ్యయనాల్లో తేలిందని పేర్కొన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల్లోకి వరద వచ్చే మార్గాలు సుగమమై జలకళను సంతరించుకోవడంతోపాటు నీటి నిల్వసామర్థ్యం కూడా పెరిగినట్టు అధ్యయనాల్లో తేలిన గణాంకాలను ప్రజంటేషన్‌లో వివరించారు. భూగర్భజలాలు గణనీయంగా పెరుగడంతో గతంలో కంటే అధికంగా దాదాపు మూడున్నర నెలల పాటు బోర్లు, బావుల్లో నీటి లభ్యత పెరిగిందని తెలిపారు.

ఆర్టీసీ విలీనానికి ఏపీ ఓకే

- నవయుగ కాంట్రాక్టు రద్దు
- పోలవరానికి రివర్స్ టెండరింగ్
- టీటీడీ బోర్డు సభ్యుల సంఖ్య పెంపు
- ఏపీ క్యాబినెట్‌లో కీలక నిర్ణయాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికుల విలీనం, కొత్త ఇసుక విధానం, నవయుగకు పోలవరం హైడల్‌ప్రాజెక్టు కాంట్రాక్ట్ రద్దు, పోలవరానికి రివర్స్‌టెండరింగ్, కాంట్రాక్టర్‌కు ఇచ్చిన అడ్వాన్స్‌ల రికవరీ, టీటీడీ బోర్డు సభ్యుల సంఖ్య 16 నుంచి 25కు పెంపు తదితర నిర్ణయాలకు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. బుధవారం ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సమాచారశాఖ మంత్రి పేర్ని నాని మీడియాకు వెల్లడించారు. ఆర్టీసీ విలీనంపై ఆంజనేయరెడ్డి కమిటీ ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదించిందని, ప్రజారవాణాశాఖను ఏర్పాటుచేస్తామని, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని వెల్లడించారు. ఆర్టీసీ విలీనప్రక్రియ మూడునెలల్లో పూర్తిచేస్తామన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 60 ఏండ్లకు పెంచుతున్నట్టు తెలిపారు. ఆర్టీసీకున్న రూ.330 కోట్ల ఆర్థిక భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టంచేశారు. బస్సుచార్జీల నియంత్రణకు స్వతంత్ర ప్రతిపత్తిగల కమిటీని ఏర్పాటుచేయనున్నారు. కొత్త ఇసుక విధానానికి క్యాబినెట్ ఆమోదం తెలిపిందని, గురువారం నుంచి అమల్లోకి వస్తుందన్నారు. ఇసుక ధరను టన్ను రూ.375గా నిర్ణయించారు.

మంత్రివర్గంలో మరికొన్ని నిర్ణయాలు

ఆశావర్కర్ల వేతనాన్ని రూ.3 వేల నుంచి రూ.10 వేలకు పెంచేందుకు ఏపీ క్యాబినెట్ ఆమోదించింది. మచిలీపట్నం పోర్టు ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిన 412.5 ఎకరాల భూమిని వెనక్కు తీసుకోవాలని నిర్ణయించింది. సొంతంగా ప్యాసింజర్ ఆటోలు, కార్లు నడుపుకునేవారికి ఏటా రూ.10 వేలు ఇవ్వాలని నిర్ణయించారు. పెండ్లిరోజే వైఎస్సార్ పెండ్లి కానుక అందజేసేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. శ్రీరామనవమి నుంచి ఈ పథకం ప్రారంభమవుతుంది. గత ఐదేండ్లలో ప్రత్యేక హోదా కోసం పోరాడినవారిపై బనాయించిన కేసులు ఎత్తివేయాలని నిర్ణయించింది. క్రీడాకారులు జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధిస్తే రూ. 5 లక్షల, రజిత పతకం సాధిస్తే రూ. 4 లక్షలు, కాంస్య పతకం సాధిస్తే రూ. 3 లక్షలు ఇవ్వాలని నిర్ణయించింది. ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిపులో గోల్డ్‌మెడల్ సాధించిన పీవీ సింధును క్యాబినెట్ అభినందించింది. కృష్ణా జిల్లా సంగమేశ్వరంలో డీఆర్డీవో రాకెట్ ట్రాకింగ్ వ్యవస్థ ఏర్పాటుకు ఐదెకరాల స్థలం కేటాయించింది. బ్యాంకుల విలీనం నేపథ్యంలో ఆంధ్రా బ్యాంకు పేరును యథాతథంగా ఉంచాలని ప్రధాని మోదీని కోరుతూ లేఖ రాయాలని నిర్ణయించింది. చిత్తూరు, కడపలో హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్‌కు 25 ఎకరాల భూమి కేటాయించింది. నడికుడి- శ్రీకాళహస్తి మధ్య బ్రాడ్‌గేజ్ నిర్మాణానికి ప్రకాశం జిల్లాలో సుమారు 20 ఎకరాలను దక్షిణ మధ్య రైల్వేకు కేటాయించింది. 2005 నుంచి సీపీఐ మావోయిస్టు పార్టీ, దాని అనుబంధ సంఘాలపై ఉన్న నిషేధాన్ని మరో ఏడాది పొడగించాలని ఏపీ క్యాబినెట్ నిర్ణయించింది.

వాడ్‌గావ్‌లో ఆత్మారాం బీమ్‌బాయిని అభినందిస్తున్న గ్రామస్థులు, అధికారులు

ఆదివాసీలకు బీమ్‌బాయి స్ఫూర్తి

- మరుగుదొడ్ల నిర్మాణానికి ముందుకొస్తున్న ప్రజలు
- చొరవ తీసుకొంటున్న కలెక్టర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇండ్లల్లో బాత్‌రూంలు ఉండటం మంచిదికాదనే అనారోగ్యకర సంప్రదాయానికి ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీ మహిళ స్వస్తి పలికింది. ఇంట్లో వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించి గ్రామంలో అందరికీ స్ఫూర్తిగా నిలిచింది. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని వాడ్‌గావ్ స్వయం సహాయక బృందానికి గ్రూప్ లీడర్‌గా వ్యవహరిస్తున్న ఆత్మారాం బీమ్‌బాయి.. స్వచ్ఛ భారత్‌లో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాన్ని ప్రతిఒక్కరూ చేపట్టాలని పిలుపునిచ్చారు. కేవలం మాటలతో సరిపెట్టకుండా.. తానే మొదట మరుగుదొడ్డిని నిర్మించుకొని రోల్ మోడల్‌గా నిలిచారు. బీమ్‌బాయి నుంచి స్ఫూర్తి పొందిన ఇతర స్వయంసహాయక బృందాల్లోని మహిళలు కూడా ఆమె బాటలో నడిచేందుకు ముందుకొచ్చారు. జిల్లా కలెక్టర్ దివ్య దేవరాజన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టడాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఆదివాసీ గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సంస్థ.. సీఎస్సార్ నిధుల కింద రూ.86 లక్షలను మంజూరు చేసిందని కలెక్టర్ తెలిపారు. ఈ నిధులతో మారుమూల గిరిజన తండాల్లో నిర్మించే ఒక్కో మరుగుదొడ్డికి సుమారు రూ.4,000 అదనంగా అందజేస్తున్నామని చెప్పారు. అక్టోబరు 2 నాటికి నూటికి నూరుశాతం లక్ష్యాన్ని చేరుకొంటామని ధీమా వ్యక్తంచేశారు. స్వచ్ఛ భారత్ గ్రామీణ్ కింద 47 వేల మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయిందని, మరో పదివేలు మిగిలాయన్నారు. ప్రతి ప్రాంతంలోని గ్రామ పెద్దలు, ఉద్యోగులు, మహిళా సంఘాలు, పటేళ్లు తదితరులతో సమావేశాల్ని ఏర్పాటు చేసి.. వారితో స్వయంగా మాట్లాడి.. వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించడానికి ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.

హెల్త్ వాచ్

మహిళ 'గుండె'కు క్రోమోజోమ్‌ల షాక్!

మహిళల్లో గుండెపోట్లు తక్కువ అని మొన్నటివరకు అనుకునేవాళ్లం. కానీ.. మహిళల్లో ఉండే ఎక్స్ క్రోమోజోమ్స్ వల్ల గుండెపోట్లు వచ్చే అవకాశం పురుషుల కన్నా ఎక్కువ అంటున్నారు పరిశోధకులు. ఆడవాళ్లలో xx క్రోమోజోమ్స్ ఉండడం వల్ల రక్తంలో ఫ్యాట్ సర్క్యులేషన్ ఎక్కువగా ఉంటుందని యూనివర్సిటీ ఆఫ్ కెన్‌టుకీ పరిశోధకులు ఇటీవలే నిర్ధారించారు. అందువల్లనే వీరిలో రక్తనాళాలు సులువుగా కుంచించుకుపోయి గుండెపోట్ల రిస్కు పెరుగుతుందని అంటున్నారు. xx క్రోమోజోమ్స్ కాంబినేషన్ లిపిడ్స్ (కొవ్వులు) అబ్‌సార్‌ప్షన్ పెరుగటానికి కారణమవుతున్నాయని ఈ అధ్యయనంలో తేలింది. ఈ పరిశోధనాంశాలు జూన్ నెల నేచర్ పత్రికలో ప్రచురితమయ్యాయి. మహిళల్లో సంభవిస్తున్న మరణాలకు ముఖ్యమైన కారణాల్లో కరొనరీ ఆర్టరీ వ్యాధులు కూడా ఒకటి. అయితే పురుషుల కన్నా మహిళల్లో పదేండ్ల తర్వాత గుండెపోట్ల అవకాశం ఎక్కువగా ఉంటుంది. మెనోపాజ్‌కు ముందువరకు మహిళల్లో గుండెకు సెక్స్ హార్మోన్లయిన ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్ల రక్షణ ఉంటుంది. మెనోపాజ్ రాగానే లైంగిక హార్మోన్లు తగ్గిపోయి రిస్కు పెరుగుతుంది. దీన్ని xx థ్రిఫ్టీగా చెప్తున్నారు. అథెరోస్క్లిరోసిస్ పైన ఈ జన్యువుల ప్రభావాన్ని మరింత లోతుగా అధ్యయనం చేయాల్సి ఉన్నది. ఏదిఏమైనా మెనోపాజ్ తరువాత మహిళలు మరింత జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. రెగ్యులర్ వాకింగ్, ఫ్యాటీ ఫుడ్ తీసుకోకపోవడం, మంచి ఆహారం తీసుకోవడం పట్ల జాగ్రత్తపడాలి.

రొమ్ము క్యాన్సర్ రహస్యం!

రొమ్ము క్యాన్సర్‌కు చికిత్స తీసుకున్న తర్వాత కూడా మళ్లీ రావడానికి కారణం తెలిసింది. కొన్ని క్యాన్సర్ కణాలు 'స్లీపర్ మోడ్'లోకి వెళ్లిపోయి, కొన్నేండ్ల తర్వాత మళ్లీ యాక్టివ్‌గా మారటమే ఇందుకు కారణమని కనుగొన్నారు లండన్ పరిశోధకులు. రొమ్ము క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే హార్మోన్ థెరపీ మందుల గురించి అధ్యయనం చేసినప్పుడు ఈ విషయం బయటపడింది. రొమ్ము క్యాన్సర్ చికిత్సలో హార్మోన్ థెరపీ చాలా సమర్థవంతమైనది. అయితే ఈ మందులు క్యాన్సర్ కణాలను ఒకవైపు చంపుతూనే మరోవైపు కొన్ని కణాలను చైతన్యరహితంగా చేసి స్లీపర్ స్థితిలోకి చేరుస్తున్నాయి. ఇలా క్యాన్సర్ కణాల నిద్రాణ స్థితి వెనుక ఉన్న రహస్యాన్ని ఛేదించగలిగితే క్యాన్సర్ మళ్లీ రాకుండా నివారించడం సాధ్యమవుతుందంటున్నారు లండన్‌లోని ఇంపీరియల్ కాలేజ్ క్యాన్సర్ విభాగానికి చెందిన డాక్టర్ ల్యూకా మాగ్నాని. నిద్రాణస్థితిలోకి వెళ్లిన క్యాన్సర్ కణాలను శాశ్వతంగా అదేస్థితిలో ఉంచడం లేక, వాటిని యాక్టివ్‌గా చేసి చంపడం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందంటున్నారు. ఈ దిశగా పరిశోధనలు జరుగుతున్నాయి.

డిప్రెషనా? తోటపని చేయండి!

ఆందోళన, డిప్రెషన్‌తో బాధపడేవాళ్లకు మందులకు బదులుగా ఇకనుంచి గ్రీన్ ప్రిస్క్రిప్షన్స్ ఇవ్వాలంటున్నారు పరిశోధకులు. ప్రకృతితో ఎంత మమేకమైతే శారీరక, మానసిక ఆరోగ్యాలు అంత బాగుంటాయని సూచిస్తున్నారు. బయట పచ్చదనంలో విహరించడం, జంతువులు, మొక్కలతో గడపటం మనసుకు ఆహ్లాదాన్నే కాదు.. ఆరోగ్యాన్ని కూడా ఇస్తాయని ఇటీవలి అధ్యయనాలు చెప్తున్నాయి. పెంపుడు జంతువులతో ఆడుకోవడం, తోటపని చేయడం, మొక్కలతో టైం స్పెండ్ చేయడం వల్ల మానసిక ఆందోళన తగ్గుతుందని, డిప్రెషన్ బారి నుంచి తప్పించుకోవచ్చని ఈ అధ్యయనాలు సూచిస్తున్నాయి. వారంలో రెండుగంటల సమయమైనా ప్రకృతితో గడిపితే ఆరోగ్యం బావుంటుందని చెప్తున్నారు అధ్యయనకారులు.

కార్మికుల సమగ్ర వివరాలు అందించండి

- అధికారులను ఆదేశించిన బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తూ, కార్మికశాఖలో నమోదైన కార్మికుల సామాజిక, నివాస ప్రాంతాల వివరాలను అందించాలని బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు కార్మికశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. పారిశ్రామికవేత్తల సామాజికవర్గాలు, రాయితీలు, ఇతర లబ్ధిపొందిన పారిశ్రామికవేత్తల వివరాలు కూడా అందించాలని కోరారు. బుధవారం కమిషన్ కార్యాలయంలో బీసీ కమిషన్ సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఆంజనేయ గౌడ్, జూలూరు గౌరీశంకర్‌తో కలిసి కార్మిక శాఖ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. కార్మిక సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల వివరాలు, ముఖ్యమైన కార్మికశాఖ చట్టాలు, నమోదైన సంస్థల వివరాలపై చర్చించారు. రాష్ట్రంలో బీడీ కార్మికులు 4.09 లక్షల మందికిపైగా ఆసరా పింఛన్లు పొందుతున్నారని కార్మికశాఖ తెలిపింది. హైదరాబాద్, రంగారెడ్డితోపాటు ఇతర ప్రాంతాల్లోని బీడీ కార్మికులకు కూడా పింఛను అందేలా చూడాలని కమిషన్ సూచించింది. సమావేశంలో కార్మికశాఖ కమిషనర్ అహ్మద్‌నదీమ్, జాయింట్ కమిషనర్ పీ శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ శ్యాంసుందర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కార్మికశాఖ అధికారులతో సమావేశమైన బీసీ కమిషన్ చైర్మన్ రాములు, సభ్యుడు ఆంజనేయగౌడ్

గవర్నర్ నరసింహన్‌ను కలిసిన బీసీ కమిషన్

గవర్నర్ నరసింహన్‌ను బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు బుధవారం రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర గవర్నర్‌గా ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకుని సన్మానించారు.

బీబీకాఆలంలో మొహర్రం ఏర్పాట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మొహర్రం సందర్భంగా బీబీకాఆలం దర్గాలో సందర్శకులకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయని వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం తెలిపారు. బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం కేసీఆర్ దృష్టిలో అన్ని మతాలు ఒక్కటేనని, అందుకే నిధులు మంజూరుచేస్తున్నారని కొనియాడారు.

కరీంనగర్‌లో 'హోమియోకేర్' ఉచిత వైద్యశిబిరం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హోమియోకేర్ ఇంటర్నేషనల్ హాస్పిటల్స్ వారు కరీంనగర్‌లోని క్లినిక్‌లో బుధవారం మహా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. నాలుగురోజులపాటు కొనసాగే ఈ వైద్య శిబిరంలో ఉచితంగా హోమియోపతి మందులను పంపిణీ చేశారు. శాసనసభ్యుడు గంగుల కమలాకర్, పట్టణ మాజీ కార్పొరేటర్ లంక రవీందర్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. హోమియోకేర్ సీఎండీ డాక్టర్ శ్రీకాంత్ మోర్లావర్ పాల్గొన్నారు.

శ్రీచైతన్య ఆలిండియా రికార్డు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 2018-19 విద్యాసంవత్సరానికి దేశవ్యాప్తంగా నిర్వహించిన ఎన్టీఎస్ఈ ఫైనల్ పరీక్ష ఫలితాల్లో 112 మంది విద్యార్థులు ఉపకారవేతనాలు పొందడానికి అర్హత సాధించారని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బీఎస్ రావు తెలిపారు.ఒకే విద్యా సంవత్సరంలో, ఒకే విద్యాసంస్థ నుంచి ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఎంపిక కావడం దేశవ్యాప్తంగా ఇదే మొదటిసారని చెప్పారు.

బదిలీ సిఫారసు వాపస్ తీసుకోవాలి

- హైకోర్టులో కొనసాగిన న్యాయవాదుల విధుల బహిష్కరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్ బదిలీ సిఫారసును వెనకు తీసుకోవాలంటూ హైకోర్టులో విధులు బహిష్కరిస్తున్న న్యాయవాదులు బుధవారం నిరసన కొనసాగించారు. మదీనారోడ్డులో ర్యాలీ నిర్వహించారు. జస్టిస్ సంజయ్‌కుమార్ బదిలీ సిఫారసును వెనుకకు తీసుకోవాలని, తెలంగాణ హైకోర్టులో రెండోస్థానంలో ఉన్న ఆయనకు ఏదైనా హైకోర్టు చీఫ్‌జస్టిస్ లేదా యాక్టింగ్ చీఫ్‌జస్టిస్‌గా ప్రమోషన్ ఇవ్వాలని హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యకరణ్‌రెడ్డి డిమాండ్‌చేశారు. న్యాయమూర్తుల నియామకాలు, ప్రమోషన్లపై సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేయడంతోపాటు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్, ఇతర న్యాయమూర్తులను కలిసి తమ సమస్యలను వివరించడానికి వారి అపాయింట్‌మెంట్లు కోరినట్లు తెలిపారు. నిరసన కార్యక్రమాల్లో బార్ కౌన్సిల్ సభ్యుడు ముఖీద్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చలపతిరావు, ప్రధాన కార్యదర్శులు మలుగారి సుదర్శన్, రజినీకాంత్, న్యాయవాదులు కల్యాణ్‌రావు తదితరులు పాల్గొన్నారు. హైకోర్టు బార్ అసోసియేషన్ పిలుపు మేరకు పలు దిగువ కోర్టుల్లో నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. తాము కూడా విధుల బహిష్కరణ చేపట్టాలని బుధవారంనాడు హైదరాబాద్ సిటీ సివిల్‌కోర్టు సర్వసభ్య సమావేశంలో నిర్ణయించారు. గురువారం నుంచి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని రంగారెడ్డి కోర్టుల బార్ అసోసియేషన్ తీర్మానించింది. పలు జిల్లాల న్యాయస్థానాల్లో న్యాయవాదులు ప్రదర్శనలు నిర్వహించారు.

పంచాయతీ కార్యదర్శులను బదిలీచేయాలి

- కమిషనర్‌కు కార్యదర్శుల సంఘం విజ్ఞప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కొన్నేండ్లుగా ఒకేచోట పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులను బదిలీచేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ రఘునందన్‌రావుకు పంచాయతీ కార్యదర్శుల సంఘం సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు పర్వతాలు విజ్ఞప్తిచేశారు. ఇటీవల కల్పించిన ప్రమోషన్లలో జరిగిన పొరపాట్లను సరిదిద్దాలని కోరారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్-2, గ్రేడ్-2 కార్యదర్శులకు గ్రేడ్-1 కార్యదర్శులుగా పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తిచేశారు. తమ విజ్ఞప్తిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని పర్వతాలు చెప్పారు. శుక్రవారంనుంచి మొదలుకానున్న గ్రామకార్యాచరణ ప్రణాళికలో పాల్గొని విజయవంతంచేయాలని కమిషనర్ సూచించినట్టు తెలిపారు. కార్యాచరణ ప్రణాళిక ముగిశాక పదోన్నతుల్లో జరిగిన పొరపాట్లను పరిశీలిస్తామని, త్వరలో పంచాయతీ సెక్రటరీల పదోన్నతుల ఉత్తర్వులిస్తామని చెప్పారన్నారు. పీఆర్ కమిషనర్ పరిధిలో వివిధపోస్టుల్లో పదోన్నతులు పొందినవారు పెద్దసంఖ్యలో బుధవారం కమిషనరేట్‌కు చేరుకుని తమకు ఇచ్చిన పోస్టింగుల్లో మోడిఫికేషన్ చేయాలని కమిషనర్‌కు విజ్ఞప్తిచేశారు. ప్రస్తుతం పదోన్నతులు, పోస్టింగులు పొందినవారికి ఇప్పుడు మోడిఫికేషన్ ఇచ్చే అవకాశం లేదని కమిషనర్ పేర్కొన్నారు. 30 రోజుల ప్రణాళిక ముగిశాకే కౌన్సెలింగ్ నిర్వహించి, పోస్టింగులు ఇచ్చే అవకాశం ఉన్నదని స్పష్టంచేశారు.

చంద్రబాబుకు చెప్పే పార్టీ మారాను!

- బీజేపీలో చేరిక తర్వాత రేవూరి ప్రకాశ్‌రెడ్డి వ్యాఖ్య

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీడీపీ మాజీ ఎమ్మెల్యే, పొలిట్‌బ్యూరో సభ్యుడు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, టీఆర్ఎస్ మాజీ ఎంపీ రవీంద్రనాయక్ బుధవారం బీజేపీలో చేరారు. ఢిల్లీలో వీరికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు కాషాయ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ న

నమస్తే తెలంగాణ
WWW. NTNEWS.COM
జిందగీ
గురువారం 5 సెప్టెంబర్ 2019
/nt.zindagi

కేరళీయుల అతిపెద్ద పండుగ ఓనం.. మలయాళీలందరూ భక్తి, శ్రద్ధలతో జరుపుకొనే పండుగ..
తెలుగువారికి ఉగాది ఎలాగో.. మలయాళీలకు ఓనం అలాగ..
పది రోజుల పాటు జరిపే ఈ పండుగకు.. సంగీత, నృత్య రూపకాలు ప్రధాన ఆకర్షణయితే..
అక్కడి స్పెషల్ వంటకాలు అందరినీ కట్టి పడేస్తాయి..
అందుకే ఈ పండుగ సందర్భంగా..
కేరళ స్పెషల్ వంటకాలు
మీ కోసం ఇస్తున్నాం..

ఓనం విందు!

మిక్స్‌డ్ వెజిటేబుల్ కుట్టు

కావాల్సినవి :

బీట్‌రూట్ : 1 (చిన్నది)
ఆలుగడ్డ : 2
క్యారెట్ : 1
బీన్స్ : 6
పసుపు : 3/4టీస్పూన్
కారం : 3/4 టీస్పూన్
కరివేపాకు : రెండు రెమ్మలు
నల్ల శనగలు : ఒక కప్పు
కొబ్బరితురుము : 1 1/2 కప్పులు
జీలకర్ర : అర టీస్పూన్
మిరియాలు : అర టీస్పూన్
జీలకర్ర పొడి : అర టీస్పూన్
గరం మసాలా పొడి : 3/4టీస్పూన్
బెల్లం తురుము : పావు టీస్పూన్
కొబ్బరి నూనె : ఒక టేబుల్‌స్పూన్
ఆవాలు : 3/4 టీస్పూన్
ఎండుమిర్చి : 2, **ఉల్లిగడ్డలు :** 6(చిన్నవి)
ఉప్పు : తగినంత

తయారీ :

ముందు రోజు రాత్రి శనగలను నానబెట్టి పెట్టుకోవాలి. ఒక కప్పు కొబ్బరితురుము తీసుకొని అందులో జీలకర్ర, మిరియాలు వేసి మెత్తటి పేస్ట్ చేసుకోవాలి. చిన్న గిన్నె పెట్టి అందులో బీట్‌రూట్ ముక్కలు వేసి నీళ్లు పోసి ఐదు నిమిషాలు ఉడికించి దించేయాలి. ఇప్పుడు పెద్ద గిన్నెలో ఆలుగడ్డ ముక్కలు, క్యారెట్ ముక్కలు, బీన్స్, పసుపు, కారం, కరివేపాకు, ఉప్పు వేసి కప్పున్నర నీళ్లు పోసి మూత పెట్టేయాలి. పది నిమిషాల పాటు బాగా ఉడికించాలి. ఆ తర్వాత ఇందులో బీట్‌రూట్ ముక్కలు, నానబెట్టిన శనగలు కలిపి రెండు నిమిషాలు ఉడుకనివ్వాలి. ఇందులో ముందుగా చేసిన కొబ్బరి పేస్ట్, జీలకర్ర పొడి, గరం మసాలా, ఉప్పు వేసి బాగా కలుపాలి. దీన్ని రెండు నిమిషాలు ఉంచి దించేయాలి. ఇప్పుడు చిన్న కడాయి పెట్టి కొబ్బరి నూనె పోసి ఎండుమిర్చి, కరివేపాకు, ఉల్లిపాయలు వేసి బ్రౌన్ కలర్ వచ్చే వరకు వేయించాలి. ఈ పోపులోనే కొబ్బరితురుము వేసి బాగా వేగాక ముందు చేసి పెట్టిన కర్రీలో వేసి కలుపాలి. పది నిమిథషాల పాటు కూరని కదిలించకుండా ఉంచాలి. ఆ తర్వాత అన్నంలో వేసుకొని తింటే ఆ టేస్టే వేరు.

ఓలన్

కావాల్సినవి :

అలసందలు : అర కప్పు ,
బూడిద గుమ్మడికాయ ముక్కలు : 3 కప్పులు, **పచ్చిమిర్చి :** 3, **కొబ్బరి పాలు :** పావు కప్పు, **కరివేపాకు :** రెండు రెమ్మలు, **కొబ్బరి నూనె :** ఒక టేబుల్‌స్పూన్
ఉప్పు : తగినంత

తయారీ :

కుక్కర్‌లో అలసందలు వేసి కడిగి.. తగినన్ని నీళ్లు పోసి ఉడికించాలి. కనీసం 6 విజిల్స్ వచ్చేంత వరకు ఉంచాలి. వీటిలో నీళ్లు ఒంపేసి పక్కన పెట్టాలి. ఇప్పుడు బూడిద గుమ్మడి కాయల్లో రెండు కప్పుల నీళ్లు పోసి, పచ్చిమిర్చి, ఉప్పు వేసి ఉడికించాలి. ముక్కలు కాస్త ఉడికాక.. అందులో అలసందలు వేసి కలుపాలి. పది నిమిషాలు అలాగే ఉంచి ఆ తర్వాత కొబ్బరి పాలు, కరివేపాకు వేసి మరికాసేపు సన్నని మంట మీద ఉంచాలి. చివరలో కొబ్బరి నూనె వేసి దించేయాలి. టేస్టీ ఓలన్ రెడీ!

పులిస్సేరీ

కావాల్సినవి :

పెరుగు : ఒక కప్పు, **దోసకాయ ముక్కలు :** ఒక కప్పు, **వెల్లుల్లి పాయలు :** 2, **చిన్న ఉల్లిగడ్డలు :** 2, **పసుపు :** అర టీస్పూన్, **కొబ్బరి తురుము :** అర కప్పు, **జీలకర్ర :** అర టీస్పూన్, **పచ్చిమిర్చి :** 2, **కారం :** పావు టీస్పూన్, **ఎండు మిర్చి :** 2, **మెంతులు :** పావు టీస్పూన్, **ఆవాలు :** అర టీస్పూన్, **కరివేపాకు :** 2 రెమ్మలు, **కొబ్బరి నూనె :** 2 టీస్పూన్స్, **ఉప్పు :** తగినంత

తయారీ :

కొబ్బరి తురుము, వెల్లుల్లి పాయలు, ఉల్లిపాయ ముక్కలు, జీలకర్ర, పచ్చిమిర్చి అన్నీ మిక్సీలో వేసి మెత్తగా పేస్ట్‌లా చేసుకోవాలి. ఇప్పుడు కడాయిలో దోసకాయ ముక్కలు వేసి కొన్ని నీళ్లు పోసి సన్నని మంట మీద ఉడికించాలి. పావుగంట తర్వాత కొబ్బరి పేస్ట్ వేసి కలిపి రెండు నిమిషాలు ఉడికించి దించేయాలి. వేరే కడాయిలో కొబ్బరి నూనె వేసి ఆవాలు, జీలకర్ర, మెంతులు వేసి కలుపాలి. దీంట్లోనే కరివేపాకు, ఎండుమిర్చి, పసుపు వేసి పోపు పెట్టాలి. దీన్ని దోసకాయ మిశ్రమంలో వేసి కలుపాలి. రెండు నిమిషాలు దాన్ని వేడి చేసి దించేస్తే సరి. సూపర్ కర్రీ మీ ముందుంటుంది.

మాంబాజా పాయసం

తయారీ :

మామిడి పండు చెక్కు తీసి చిన్న ముక్కలుగా కట్ చేయాలి. వీటిని మిక్సీలో వేసి, కొన్ని పాలు, బెల్లం, యాలకుల పొడి, ఎండు అల్లం పొడి వేసి మెత్తగా మిక్సీ పట్టాలి. దీన్ని పక్కన పెట్టుకోవాలి. ఒక పెద్ద గిన్నె తీసుకొని మిగిలిన పాలు పోసి వేడి చేయాలి. ఈ లోపు బియ్యం కడిగి కాసేపు నానబెట్టాలి. ఈ బియ్యాన్ని మరుగుతున్న పాలల్లో వేసి ఉడికించాలి. 20 నిమిషాల తర్వాత దీంట్లో మామిడిపండు గుజ్జును వేసి కలుపుతుండాలి. సన్నని మంట మీద పది నిమిషాల పాటు అడుగు అంటకుండా కలుపాలి. పక్కన చిన్న కడాయి పెట్టి అందులో నెయ్యి వేసి జీడిపప్పులు, కిస్మిస్ వేసి వేయించుకోవాలి. పాయసంలో వేసి కలిపి రెండు నిమిషాలాగి దించేయాలి. దీన్ని వేడిగా కానీ, ఫ్రిజ్‌లో పెట్టుకొని కాసేపు ఆగి తిన్నా యమ టేస్టీగా ఉంటుంది.

అవియల్

కావాల్సినవి :

బూడిద గుమ్మడికాయ ముక్కలు : ఒక కప్పు, **మంచి గుమ్మడికాయ ముక్కలు :** ఒక కప్పు, **ములక్కాడ ముక్కలు :** ఒక కప్పు, **పుల్లగంద ముక్కలు :** ఒక కప్పు, **అరటికాయ :** 1, **బీన్స్ :** అర కప్పు, **మంగళూర్ కుకుంబర్ :** 1 (చిన్నది), **కొబ్బరితురుము :** ఒక కప్పు, **పచ్చిమిర్చి :** 3, **జీలకర్ర :** ఒక టీస్పూన్, **పెరుగు :** ఒక కప్పు, **కరివేపాకు :** 2 రెమ్మలు, **కొబ్బరినూనె :** 2 టేబుల్‌స్పూన్స్, **ఉప్పు :** తగినంత

తయారీ :

కూరగాయలన్నింటినీ బాగా కడుగాలి. అన్నింటినీ ఒకే రకంగా పొడవు ముక్కలుగా కట్ చేసుకోవాలి. అరటికాయను మాత్రం కట్ చేసి నీళ్లలో వేసి పెట్టుకోవాలి. అలా చేస్తే అవి నల్లగా కాకుండా ఉంటాయి. పెరుగును బాగా గిలక్కొట్టి పెట్టుకోవాలి. ఇప్పుడు కొబ్బరి తురుము, జీలకర్ర, పచ్చిమిర్చి, కొన్ని నీళ్లు పోసి మెత్తటి పేస్ట్ చేసుకోవాలి. ఒక పెద్ద గిన్నె తీసుకొని కూరగాయలన్నింటినీ, బీన్స్‌తో సహా వేసి కొద్దిగా పసుపు, ఒక కప్పు నీళ్లు పోసి ఉడికించాలి. సన్నని మంట మీద దాదాపు సగం ఉడికే వరకు అలాగే ఉంచాలి. ఒకవేళ నీళ్లు ఆవిరై పోతుంటే.. మధ్యలో కొన్ని నీళ్లు పోసుకోవచ్చు. మూత పెట్టి మళ్లీ పూర్తిగా ఉడికేవరకు ఉంచాలి. కాసేపటి తర్వాత కొబ్బరి పేస్ట్ వేసి ఐదు నిమిషాలు ఉంచాలి. ఆ తర్వాత పెరుగు వేసి మరో రెండు నిమిషాలు కలుపాలి. చివరగా కొబ్బరి నూనె, కరివేపాకు వేసి మూత పెట్టి ఐదు నిమిషాలు ఉంచి దించేయాలి. అన్నం, సాంబార్‌తోపాటు ఈ కూర వడ్డించుకుంటే యమ టేస్టీగా ఉంటుంది.

బెంగళూర్ వ్యోమగామి ఇతడే!

చంద్రునిపై వ్యోమగామి నడుస్తున్నట్టు కొద్దిరోజుల నుంచి వీడియో ట్రెండ్ అవుతున్నది. అది చూసిన చాలామంది నిజంగా చంద్రుని మీదే అనుకున్నారు. కానీ కాదు.. బెంగళూర్‌కు చెందిన ఓ ఆర్టిస్ట్ అధికారులకు కనువిప్ప కలిగేలా ఈ వీడియో చేశాడు.

నిజంగానే చంద్రుని నేల పైన నడిచినట్టు కనిపించిన ఈ వ్యోమగామి పేరు బాదల్ నజున్‌దస్వామి. బెంగళూర్‌లో పేరు పొందిన చిత్రకారుడు. సామాజిక సమస్యలపై తనదైన శైలిలో స్పందిస్తుంటాడు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతోపాటు, వాటిపట్ల స్థానికులకు అవగాహన కలిగిస్తుంటాడు. ఆకర్షణీయమైన చిత్రాలతో అందరినీ ఆకట్టుకుంటాడు. కేవలం చిత్రాలు వేయడంతోనే తన పని అయిపోయిందనుకోలేదు బాదల్. సామాజికపరమైన సమస్యలపై కొత్త తరహా ప్రయోగం ఏదైనా చేయాలనుకున్నాడు. అందుకే వ్యోమగామిగా డ్రెస్ వేసుకొని బెంగళూర్ రోడ్లమీద వీడియో షూట్ చేశాడు. రోడ్డుమీద విపరీతమైన గుంతలు ఏండ్ల తరబడి అలాగే ఉన్నాయి. వీటి గురించి తెలిసినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో వీటి గురించి అధికారులకు తెలియజేయాలనుకున్నాడు. ధర్నాలు, నిరసనలు చేయడం రొటీన్. అందుకే సెటైరికల్‌గా ఆలోచించాడు. వ్యోమగామిగా అవతారం ఎత్తి, గుంతలు ఎక్కువ ఉన్న ఏరియాలో చంద్రునిమీద నడిచినట్టు నడిచాడు. ఇది మొదట అందరికీ చంద్రుని మీదే ఉన్నట్టు అనిపించింది. కానీ తర్వాతే తెలిసింది అవి బెంగళూరు రోడ్లు అని. ఈ వీడియోను అతను ఫేస్‌బుక్‌లో ఉంచి మున్సిపాల్ అధికారులకు ట్యాగ్ చేశాడు. ఇది కొద్ది సమయంలోనే దేశవ్యాప్తంగా పాకడంతో అధికారులు హుటాహుటిన స్పందించారు. వెంటనే ప్రొక్రెయిన్లను, సిబ్బందిని రంగంలోకి దించి ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చారు. దీంతో బెంగళూరువాసులు ఈ స్వామిని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు.

పర్‌ఫ్యూమ్ కొనే ముందు

పర్‌ఫ్యూమ్ అంటే కేవలం సువాసననిచ్చేదే కాదు. హుందాను, వ్యక్తిత్వాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. ఒక్కో పర్‌ఫ్యూమ్ వేలు పెట్టి కొనుకున్నా ఆ సువాసన కొన్ని గంటల్లోనే పూర్తిగా ఆవిరైపోతుంది. కానీ పర్‌ఫ్యూమ్ సువాసన ఏండ్ల తరబడినా మనసులో నిలిచిపోవాలంటే ఈ చిన్న చిట్కాలు పాటించాల్సిందే.

- పర్‌ఫ్యూమ్ కొనే ముందు బాటిల్‌పై మూడు నోట్స్ ఉంటాయి. టాప్, బాటమ్, మిడిల్. టాప్ నోట్ అంటే స్ప్రే చేసిన తర్వాత తొలి 15నిమిషాలు వాసన పడుతుంది. ఆ తర్వాత అది మసకబారుతుంది. మిడిల్ నోట్ అయితే కొన్ని గంటల వరకు ఉంటుంది. బాటమ్ నోట్ అయితే రోజంతా వాసన ఉంటుంది. పర్‌ఫ్యూమ్ కొనేముందు ఈ మూడు అంశాలను చూసి మనం కొనుక్కోవాలి.
- మొదటిసారి పర్‌ఫ్యూమ్‌ను వాడే వారు తేలికపాటి సువాసనలు ఉండేట్లు ప్రయత్నిస్తే మంచిది. మస్కీ, కలప వంటి పర్‌ఫ్యూమ్‌లు తేలికైన సువాసనల్ని వెదజల్లుతాయి.
- అన్ని పర్‌ఫ్యూమ్‌లను ఒకేసారి ప్రయత్నించవద్దు. సువాసనలను పరీక్షించడంలో అస్సలు తొందర పడొద్దు. ఎంత ఎక్కువగా వాసన చూస్తే అంతగా మంచి వాటిని గుర్తు పట్టలేకపోతారు. అందుకని రెండు మూడు పర్‌ఫ్యూమ్‌ల కంటే ఎక్కువగా ప్రయత్నించవద్దు.
- పర్‌ఫెక్ట్ పర్‌ఫ్యూమ్ ఎలా ఉంటుందో పరీక్షించడానికి ఉత్తమ మార్గం మీ శరీర పల్స్ పాయింట్ల వద్ద పరీక్షించడం. శరీర పల్స్ పాయింట్లు చెవుల వెనుక, గొంతు వద్ద, మణికట్టు మీద, మోచేతుల వెనుక భాగంలో, మోకాళ్ల వెనుక ఉంటాయి. ఈ భాగాలే సువాసనను తీవ్రతరం చేసేందుకు సాయపడుతాయి.

పొట్టిగా ఉన్నామని బాధపడుతున్నారా?

- సాధారణంగా మన ఎత్తు జీన్స్ ద్వారా స్పష్టంగా అర్థం అవుతుంది. కొన్ని చిట్కాలతో పొడుగ్గా కనిపించడం కష్టమేమీ కాదు.
- కొన్ని దుస్తులతో కూడా మనం పొడుగ్గా కనిపించడానికి అవకాశాలున్నాయి. ముఖ్యంగా గళ్ల డిజైన్లు, చెక్స్ ఉన్న దుస్తులు ధరించడం వల్ల సాధారణం కంటే తక్కువ ఎత్తు కనిపిస్తారు. అలాగే ఒకటే రంగు డ్రెస్ వేసుకోవడం వల్ల పొడుగుగా కనపడవచ్చు. అడ్డంగా ఉండే డిజైన్లు కాకుండా నిటారుగా ఉండే డిజైన్లు పొడుగ్గా కనిపిచ్చేలా చేస్తాయి.
- బిగుతు దుస్తులు వేసుకోవడం వల ఎత్తు ఉన్నట్టు కనిపించవచ్చు.
- జీన్స్ కానీ మరే ఇతర ప్యాంట్లు కానీ వేసుకుంటే వాటి చివరలు ఓపెన్‌గా ఉండడం కాకుండా టైట్‌గా ఉండేలా చూసుకోవాలి. ఇలా ప్యాంటు వెనుక పాదాల పైభాగం వరకు ఉంటే ఇంకా పొడవుగా కనిపించవచ్చు.
- దుస్తులతో సంబంధం లేకుండా ఎత్తుగా కనిపించాలంటే హై హీల్స్ కూడా వాడుకోవచ్చు.

బాబుకు ఏ ఆట మంచిది?

మా బాబు వయస్సు పన్నెండేండ్లు. ఏదో తరగతి చదువుతున్నాడు. స్పోర్ట్స్ అంటే చాలా పిచ్చి. చాలా రకాల ఆటలు తరచుగా ఆడుతూ ఉంటాడు. కాకపోతే, తరచుగా గాయపడుతూ ఉంటాడు. సాధారణంగా కండరాల గాయాలతోనూ, స్పోర్ట్స్ ఇంజూరీస్ తోనూ, నొప్పులతోనూ బాధపడుతూ ఉంటాడు. ఈ క్రీడా గాయాలను నిరోధించలేమా? మా అబ్బాయి ఏ క్రీడలో రాణించగలడో చెప్పగలరా?
- పి. సుధాకర్ రావు, హుబ్సిగూడ

అడుగండి చెబుతా

సాధారణ క్రీడా, వ్యాయామ గాయాలను నిరోధించడం అన్ని సార్లూ సాధ్యం కాకపోవచ్చు. అయితే చాలా సందర్భాల్లో గాయపడకుండా జాగ్రత్తపడేందుకు అవకాశం ఉంటుంది. చేపట్టిన క్రీడ, చేస్తున్న వ్యాయామానికి తగిన విధంగా సంసిద్ధులం కాకపోవడం వల్ల గాయాలను కొనితెచ్చుకొన్నవాళ్లం అవుతుంటాం. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యం కాపాడుకోవడమే కాకుండా సాధన వల్ల దానికి సంబంధించి నైపుణ్యం పెరిగి గాయాలకు గురయ్యే అవకాశాలు తగ్గుతాయి. ప్రతీ వ్యాయామం, ఆట ముందస్తు సన్నద్ధత (వార్మింగ్ అప్)తోనే మొదలవ్వాలి. దానివల్ల కండరాలకు రక్తం సరఫరా పెరుగుతుంది. కండరాలు శ్రమకు సిద్ధం అవుతాయి. గాయపడే ప్రమాదం తక్కువ అవుతుంది. కండరాలపై అధిక భారం మోపటం వల్ల కలిగే గాయాలను కొద్ది పాటి జాగ్రత్తతో నిరోధించవచ్చు. దాదాపు గంటసేపు ఆడకుండా హఠాత్తుగా మైదానంలోకి వచ్చి బంతిని కొట్టేందుకు పూనుకోవద్దు. పర్వతారోహణ, పరుగు లేదా టీమ్ స్పోర్ట్స్‌లో పాల్గొన్నప్పుడు అందుకు ఉపయోగించే కండరాలను సన్నద్ధం చేస్తూ కొద్దివారాల పాటు ముందస్తు శిక్షణ పొందాలి. అలసిపోయినట్టు గుర్తించిన తరువాత వ్యాయామం నిలిపివేయాలి. ఆట నుంచి తప్పుకోవాలి. కొంత విరామం తరువాత మళ్లీ ఆడవచ్చు. మరోరోజు వ్యాయామాన్ని కొనసాగించవచ్చు. అదేవిధంగా ఒక క్రీడను ఎంచుకు ముందు వ్యక్తి శరీర పరిస్థితి దానికి తగినదేనా కాదా అని క్లినికల్ టెస్టుల ద్వారా వైద్య నిపుణులు నిర్ధారించి చెప్పగలరు. ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటే ఆయా క్రీడల్లో రాణిస్తారో సూచించగలరు. కొత్తగా వ్యాయామం ప్రారంభించేవారికి ఏ రకమైనవి మంచివో చెప్తారు. ఆస్తమా, మధుమేహం వంటి దీర్ఘకాల వ్యాధులు, గుండె జబ్బులు ఉన్నవారికి కొత్తగా వ్యాయామం ప్రారంభించేందుకు ఈ విధమైన పరీక్షలు, సూచనలు చాలా అవసరం.

డాక్టర్ కృష్ణ సుబ్రహ్మణ్యం
సీనియర్ ఆర్థోపెడిక్,
జాయింట్ రీప్లేస్ మెంట్ సర్జన్,
స్పోర్ట్స్ మెడిసిన్ ఎక్స్‌పర్ట్
యశోద హాస్పిటల్స్
హైదరాబాద్

II.

నమస్తే తెలంగాణ
రైతుబడి
[కరీంనగర్]
గురువారం 5 సెప్టెంబర్ 2019

raithubadi@ntnews.com

వృద్ధి నియంత్రకాలతో
అధిక దిగుబడి

చిలగడ దుంప నాటిన 15 రోజుల తర్వాత ఈ పదిహేను రోజుల వ్యవధిలో ఇథ్రెల్‌ను 250 పీపీయం పిచికారీ చేస్తే దుంపల దిగుబడి పెరుగుతుంది.

బూడిద గుమ్మడి నాటిన 10-15 రోజుల తర్వాత నుంచి వారంరోజుల వ్యవధిలో నాలుగుసార్లు ఇథ్రెల్‌ను 250 పీపీయం చొప్పున పిచికారీ చేస్తే దిగుబడి పెరుగుతుంది. అదే సొర, కాకర, పొట్ల మొక్కలపై అయితే ఇథ్రెల్‌ను 100 పీపీయం చొప్పున పిచికారీ చేయాలి.

ఫైనాపిల్ 35-40 ఆకుల దశలో ఉండి, పూతలో ఉన్నప్పుడు 10 పీపీయం ప్లానోఫిక్స్ 2 శాతం యూరియా, 0.04 శాతం సోడియం కార్బొనేట్, 20 పీపీయం ఇథ్రెల్‌ను మొక్కకు 50 మిల్లీలీటర్ల చొప్పున క్రౌన్‌పై పిచికారీ చేయాలి. దీంతో పూత, కాయల పరిమాణం పెరుగుతుంది.

కొబ్బరిలో పూత వచ్చిన నెలకు 30 పీపీయంల 2,4-డి పిచికారీ చేస్తే 30 శాతం వరకు దిగుబడి పెరుగుతుంది. 1000 పీపీయం ఇథ్రెల్‌ను పిచికారీ చేస్తే ఏడు రోజుల్లో బత్తాయిలో పసుపు రంగు, అరటి రెండు రోజుల్లో రంగు మారుతుంది.

1000 పీపీయం ఇథెఫెన్ మామిడిపై పిచికారీ చేస్తే చర్మం రంగు మారుతుంది. త్వరగా పండిపోతుంది.

సోడియం హైడ్రాక్సైడ్‌తో కలిపి 500 పీపీయం ఇథెఫెన్‌ను సపోటాపై పిచికారీ చేస్తే రెండు రోజుల్లో పక్వానికి వస్తాయి. అదే బొప్పాయిలో అయితే 2000 పీపీయం వాడాలి.

క్యారెట్, ఆలుగడ్డలలో పూత, గింజ ఏర్పడటానికి 500 పీపీయంల చొప్పున జిబ్బరెలిక్ ఆమ్లం పిచికారీ చేయాలి.

పల్లిలో మెపిక్వాట్ క్లోరైడ్‌ను 125 పీపీయంల చొప్పున పిచికారీ చేస్తే దిగుబడి పెరుగుతుంది.

డాక్టర్ అమరపల్లి గీత
అసిస్టెంట్ ప్రొఫెసర్
వ్యవసాయ కళాశాల, పాలెం

నాణ్యమైన విత్తనం నాటితే సగం దిగుబడి సాధించినట్లే. సాగులో వాడే ఎరువులు, సాగునీరు, ఇతర ఉత్పత్తి కారకాల సామర్థ్యం విత్తనం నాణ్యతపైనే ఆధారపడి ఉంటుంది. అందుకే పంటల సాగులో నాణ్యమైన విత్తనానిదే ప్రధాన పాత్ర. ప్రతి పంటకు సిఫార్సు చేసిన విత్తన మొలక శాతం, తేమ, భౌతిక స్వచ్ఛత, జన్యు స్వచ్ఛత కలిగిన విత్తనాలను వాడాలి. అప్పుడే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చు.

తీగజాతి కాయగూరల్లో
విత్తనోత్పత్తి

కాయగూర పంటల్లో నాణ్యమైన విత్తనంతోనే లాభసాటి దిగుబడులు సాధ్యం. మార్కెట్లో కాయగూరల విత్తనాలు లభ్యమవుతున్నాయి. అయితే వాటి నాణ్యతపై అంతగా భరోసా లేదు. కాబట్టి రైతాంగం తమస్థాయిలో విత్తనోత్పత్తి చేపట్టవచ్చు. విత్తనోత్పత్తి సులభం కూడా. తక్కువ ఖర్చుతో తగిన మోతాదులో రైతులు విత్తనాన్ని ఉత్పత్తి చేసుకోవచ్చు. అయితే అన్నికాయగూరల పంటలలో విత్తనోత్పత్తి సాధ్యం కాదు. టమాటా, వంకాయ, మిరప పంటలతో పాటు తీగజాతి పంటలు, గోరుచిక్కుడు, తోట కూర మొదలైన ఉష్ణ ప్రాంతపు పంటలలో మాత్రమే విత్తనోత్పత్తి సాధ్యం. చలికాలం పంటలైన క్యాబేజీ, క్యాలీఫ్లవర్ మొదలైన పంటలు మన ప్రాంతంలో విత్తనోత్పత్తి సాధ్యం కాదు. విత్తనోత్పత్తి చేపట్టే ప్రాంతంలో పరిస్థితులు విత్తన నాణ్యతపై ప్రభావం చూపుతాయి. అధికంగా రాత్రి ఉష్ణోగ్రతలున్న ప్రాంతా లు, గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉన్న ప్రాంతాలు విత్తనోత్పత్తికి పనికిరావు. విత్తనోత్పత్తి ప్రాంతంలో పగలు సూర్యరశ్మి కనీసం 10 నుంచి 12 గంటలు ఉండాలి. ముఖ్యంగా కాయలు కోత కొచ్చే సమయంలో వర్షాలు రాకుండా ముందుగానే విత్తనాలు పొలంలో వేసుకోవాలి.

తీగజాతి కూరగాయలు

కాకర, గుమ్మడి, బూడిద గుమ్మడి, దోస రకాల్లో వాటి పండ్ల రంగును, కాడ రంగును, తీగలు ఎండిపోవడాన్ని బట్టి పక్వానికి వచ్చాయని నిర్ధారించుకోవచ్చు. అలా పండిన కాయల నుంచి విత్తనాన్ని సేకరించుకోవాలి. తర్వాత పండ్లను కోసి చేతితో విత్తనాన్ని వేరు చేసి సేకరించుకోవాలి. తర్వాత విత్తనాన్ని నీటిలో కడిగి ఆరబెట్టుకోవాలి. ఎకరాకు పంటను బట్టి 120-320 కిలోల విత్తనం దిగుబడి పొందవచ్చు. అన్ని కాయగూరలు విత్తనోత్పత్తికి కోత అనంతరం పండ్లను 5-7 రోజులు నిల్వ ఉంచినట్లయితే విత్తనం బాగా అభివృద్ధి చెంది నాణ్యంగా ఉంటుంది.

కోత సమయం: బూడిద గుమ్మడి-90 రోజులు, తర్బూజ, ఖర్బూజలో 80-85 రోజులు పడుతుంది. దోసలో పండ్లు పేపళ పసుపు నుంచి బంగారు పసుపు రంగులోకి మారినప్పుడు పండ్లను సేకరించాలి. గుమ్మడి-గుజ్జు నుంచి గింజలు బయటకు వచ్చినప్పుడు ఖర్బూజలో-ఫుల్ స్లిప్ దశ; తర్బూజలో కాయ కింద రంగు ఆకుపచ్చ తెలుపు నుంచి పసుపు రంగులోకి మారినప్పుడు; కాకర, పొట్లలో పండ్ల రంగు పసుపులోకి మారినప్పుడు వాటిని సేకరించాలి.



విత్తనోత్పత్తి చేసే ముందు కొన్ని అంశాల్లో జాగ్రత్త వహించాలి. మొదటిది ముందుగా నిర్ణయించుకున్న అధీకృత డీలరు లేదా పరిశోధనా స్థానం నుంచి ఫౌండేషన్ విత్తనం సేకరించుకోవాలి. రెండోది-విత్తన దూరం పాటించాలి. ఒక్క టమాటాలో తప్పితే చాలా పంట్లో తరచు పరపరాగ సంపర్కం లేదా పూర్తిగా పరపరాగ సంపర్కం జరుగుతుంది. దీనివల్ల విత్తనంలో కల్తీలు ఏర్పడుతాయి. వాటి నాణ్యత తగ్గుతుంది. అందువల్ల వేర్పాటు దూరం కచ్చితంగా పాటించాలి. మూడు రకాలుగా వేర్పాటు ఉంటుంది. సమయం, వేర్పాటు దూరం, ఆటంకం వేర్పాటు. విత్తనోత్పత్తి చేపట్టే ఒక పంట వేసిన తర్వాత కనీసం 20 నుంచి 25 రోజుల సమయం తర్వాత వేరే విత్తన పంట వేసుకోవాలి. అప్పుడు కల్తీలు ఉండవు. అది సాధ్యం కాకపోతే సిఫార్సు మోతాదులో వేర్పాటు దూరం పాటించాలి. మూల విత్తనం, బ్రీడర్ విత్తనం, ఫౌండేషన్ ధృవీకరణ విత్తనం ఉత్పత్తిలో ధృవీకరణ విత్తన ఉత్పత్తిని మాత్రమే రైతులు చేపట్టవచ్చు.

విత్తనోత్పత్తి చేపట్టే ముందు పంట ఎదుగుదల దశలో పంటకు అవసరమైన పోషకాలు, నీటి యాజమాన్యం, కలుపు నివారణ, పురుగు, తెగుళ్ల నివారణ చర్యలు సకాలంలో చేపట్టాలి. పంట పూత, కాయ దశలో పోషకాలు, నీటి యాజమాన్యం చాలా ముఖ్యం. ఈ దశలో పోషకాలు, నీటి లోపం ఏర్పడితే పూత, కాయ రాలిపోయి దిగుబడి తగ్గుతుంది. పంట కోత దశలో పండ్లు పక్వానికి వచ్చాక కోయాలి. పండ్లు పక్వానికి రాకముందే కోస్తే విత్తనం సరిగా అభివృద్ధి చెందదు. పండ్లు పక్వానికి వచ్చాక ఎక్కువ రోజులు నిల్వ ఉంచినా విత్తనం నాణ్యత తగ్గుతుంది.

తడి పద్ధతి: దోస, తర్బూజ, ఖర్బూజ, కాకర, బూడిద గుమ్మడిలలో విత్తన సేకరణకు వాడుతారు. దోస, కాకరలలో కాయలను నిలువుగా చీల్చాలి. విత్తనాలు తీయాలి. గుమ్మడి, ఖర్బూజాలలో కాయలను రెండుగా కోసి, విత్తనం, గుజ్జును బైటికి తీయాలి. ఆ తర్వాత గుజ్జు నుంచి విత్తనాలు సేకరించాలి. అందుకు మూడు పద్ధతులు అందుబాటులో ఉన్నాయి.

1) యాంత్రిక సేకరణ పద్ధతి: దీనిలో యంత్రం పండ్లను ముక్కలుగా కోసి, గుజ్జునిస్తుంది. ఆ తర్వాత గుజ్జు నుంచి విత్తనాలు వేరు చేస్తుంది. సొర, తూర్బూజ, బూడిద గుమ్మడిలో ఈ పద్ధతిలో విత్తన సేకరణ చేయవచ్చు. తక్కువ కాలంలో, తక్కువ ఖర్చుతో ఈ పద్ధతిలో విత్తనం సేకరించవచ్చు. విత్తనం మెరుస్తుంది. అయితే ఎక్కువ నీరు అవసరం ఉంటుంది.

2) సహజంగా పులియబెట్టే పద్ధతి: ఈ పద్ధతిలో పండ్ల నుంచి తీసిన గుజ్జును ఇనుప, ప్లాస్టిక్, చెక్క బకెట్‌లలో 25 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద 48 గంటల పాటు నిల్వ ఉంచాలి. 2,3 సార్లు బాగా కలిపి, నీటితో 2,3 సార్లు కడగాలి. అయితే ఈ పద్ధతిలో సేకరించిన గింజలలో రంగు కోల్పోతాయి.

3) రసాయనాలతో విత్తన సేకరణ: 25-30 మి.లీ. హైడ్రోక్లోరిక్ ఆమ్లం లేదా 8-10 మి.లీ. వాణిజ్య హైడ్రోజన్ సల్ఫైడ్ ఆమ్లాలను 5 కిలోల పండ్ల గుజ్జుకు కలిపి, కొంత నీటిని చేర్చి బాగా కలియబెట్టాలి. ముప్పై నిమిషాల తర్వాత చూస్తే గింజలు నీటిలో అడుగుకు చేరుతాయి. గుజ్జు పైకి వస్తుంది. శుభ్రమైన నీటితో కడిగి విత్తనాలు నిల్వ చేసుకోవాలి. తక్కువ కాలంలో విత్తన సేకరణ ఈ పద్ధతిలో సాధ్యం.

విత్తన దిగుబడి

హెక్టారుకు దోస 1-2 క్వింటాళ్లు, బీర, కాకర-4 నుంచి 5 క్వింటాళ్లు, సొర-5-6 క్వింటాళ్లు, తర్బూజ, ఖర్బూజలలో 2-3 క్వింటాళ్లు విత్తన దిగుబడి వస్తుంది.

డాక్టర్ కె. రవీందర్‌రెడ్డి
8333981352
రిజిస్ట్రార్,రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం

విదేశాలలో ఎక్కువగా సాగుచేసే డ్రాగన్ ఫ్రూట్‌లో మంచి ఔషధ గుణాలు, పోషక విలువలు ఉంటాయి. ఈ ఫ్రూట్‌ను అమెరికా, మెక్సికో, చైన, ఆస్ట్రేలియా, ఇజ్రాయిల్, థాయిలాండ్, శ్రీలంక, వియత్నాం తదితర దేశాల్లో పండిస్తుంటారు. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్ గ్రామానికి చెందిన మతంశెట్టి వీరేందర్ అనే యువరైతు డ్రాగన్‌ఫ్రూట్స్ పండిస్తూ మంచి లాభాలను సాధిస్తున్నాడు.

సిరులు కురిపిస్తున్న
డ్రాగన్ ఫ్రూట్ సాగు

సమశీతోష్ణస్థితి వాతావరణంలో పండే డ్రాగన్ ఫ్రూట్స్ ఈ ప్రాంతంలోని భూములు కూడా అనుకూలమైనవి. డ్రాగన్ ఫ్రూట్ గురించి తెలుసుకుని ఇక్కడ పండించాలన్న లక్ష్యంతో రెండేండ్ల కిందట ప్రారంభించాను. కేరళ నుంచి ఈ మొక్కలను తెప్పించాను. ఈ సాగు చేసేందుకు పొలంలో ట్రాక్టర్ తిరిగేంత సమదూరంలో 10/10 పద్ధతిలో ఎకరాకు 400 కడీలను నాటాలి. వాటికి తీగలు కట్టుకోవాలి. మొదట కదురుకు ఒక మొక్క చొప్పున నాటి పెంచాలి. మొక్కలకు డ్రిప్ పద్ధతిలో రోజుకు 8-10 లీటర్ల నీటిని సరఫరా చేయాలి. మొక్కలకు సేంద్రియ ఎరువులు మాత్రమే వాడాలి. కడీల మధ్య పెరిగే కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తీసివేయాలి. ఈ సాగు చేసేందుకు ఎకరానికి రూ.5-6 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ఈ పంట దాదాపు 30 ఏండ్ల వరకు వస్తుంది. ఈ పంట నాటిన ఏడాదిన్నర కాలంలోనే కాత కాస్తుంది. జూన్ నెలలో పూత మొదలై విడతల వారిగా డిసెంబర్ దాకా పండ్లు పండుతాయని వీరేందర్ తెలిపాడు. ఈ పంట సాగులో అనుసరించే యాజమాన్య పద్ధతులను బట్టి కాయ 350-500 గ్రాముల బరువు ఉంటుంది. ఈ పంట మొదటి, రెండవ సంవత్సరం ఎకరాకు టన్ను చొప్పున, మూడవ సంవత్సరం నుంచి ఎకరాకు నాలుగు టన్నుల వరకు దిగుబడి వస్తుంది వీరేందర్ తెలిపాడు.

ఈ పండుతో అనేక ప్రయోజనాలు

డ్రాగన్స్ ఫ్రూట్స్ పండ్లతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఈ పండును తినడం వల్ల గుండెకు మంచిదంటున్నారు. ఇందులోని ఫైబర్ జీర్ణాశయాన్ని మెరుగు పరిచి, మలబద్ధకాన్ని తొలిగిస్తుంది. ఇందులోని కాల్షియం, ఐరన్ వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

-గున్నాల విఠల్, 9000280392
న్యాల్‌కల్

అధిక లాభాలు

ఈ సాగులో లాభాలు బాగుంటాయి. ఈ పంటకు ఎక్కువగా తెగుళ్ల బెడద ఉండదు. నీటి ఎద్దడిని తట్టుకుంటుంది. ఎర్ర నేలలు, ఎర్ర ఇసుక, సేంద్రియ పదార్థాలు అధికంగా ఉండి, నీటి నిల్వ తక్కువగా ఉన్న నేలలు ఈ పంట పండించేందుకు అనుకూలం. మొదటి, రెండవ సంవత్సరం దిగుబడి తక్కువ ఉంటుంది. మూడవ సంవత్సరం నుంచి అన్ని ఖర్చులు పోను ఎకరానికి 2-3 లక్షల వరకు ఆదాయాన్ని పొందవచ్చు. చెట్టుకు 25 రోజుల ఒకసారి పండ్లు కాస్తాయి. ఈ ప్రాంతంలో ఎక్కడా పండ్లను పండించకపోవడంతో వ్యాపారులు నేరుగా మా దగ్గరికే వచ్చి కిలోకు రూ. 100-200 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఈ పండ్లకు మార్కెట్‌లో కిలోకు దాదాపు రూ.300-400 వరకు ధర ఉన్నది.

-మతంశెట్టి వీరేందర్,9666140000
యువరైతు, హద్నూర్

సాగు సూచనలు

రాష్ట్రంలో అత్యధిక విస్తీర్ణంలో సాగవుతున్న నూనెగింజల పంట పల్లి. ప్రస్తుతం ఈ పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వ్యవసాయ అధికారులు సూచించిన వివరాలు..

పల్లిలో..

కలుపు నివారణ, అంతర కృషి

విత్తిన 25-30 రోజుల దశలో గొర్రుతో అంతర కృషి చేసుకోవాలి. మొక్కల మొదళ్ళకు మట్టిని ఎగదోయాలి. విత్తిన 45 రోజుల వరకు ఎలాంటి కలుపు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆ తర్వాత ఎలాంటి అంతర సేద్యం చేయరాదు. లేకపోతే ఊడలు దెబ్బతిని దిగుబడులు తగ్గుతాయి.

నీటి యాజమాన్యం

పల్లి పంటకు మొత్తం 450-600 మి.మీ. నీరు అవసరం అవుతుంది. తేలికపాటి నేలల్లో 6-8 తడులు ఇవ్వాలి. పంటలో ఊడలు దిగే దశ నుంచి కాయలు ఊరే వరకు (విత్తిన 45-50 రోజుల నుంచి 85-90 రోజుల వరకు) సున్నితమైంది. కాబట్టి ఈ దశలో నీళ్లు సక్రమంగా తగిన మోతాదులో కట్టాలి. నీళ్లను తుంపర్లు (స్ప్రింక్లర్లు) ద్వారా ఇవ్వాలి. ఇట్లా ఇచ్చినట్లైతే దాదాపు 25 శాతం నీళ్లు ఆదా అయి, అధిక దిగుబడి, నాణ్యమైన కాయలు పొందవచ్చు.

సస్యరక్షణ

ఆకు ముడత పురుగు: పంట విత్తిన 15-45 రోజుల వరకు ఈ పురుగు ఆశిస్తుంది. ఈ పురుగు 2-3 ఆకులను కలిపి గూడు చేస్తుంది. ఆకులపై ఉన్న పచ్చదనాన్ని తింటుంది. దీనివల్ల ఆకులన్నీ ఎండిపోయి దూరం నుంచి కాలిపోయినట్లు కనిపిస్తాయి.
నివారణ: ఈ పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 500 మి.లీ. లేదా ఎసిఫేట్ 300 గ్రా., 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేసుకోవాలి.

తిక్కా ఆకుమచ్చ తెగులు

పంట 30 రోజుల దశలోపు ఆశించే ఆకుమచ్చ తెగులులో మచ్చలు ఆకుల పైభాగాన ముదురు గోధుమ రంగులో ఉంటాయి. ఆల స్యంగా వచ్చే తెగులులో మచ్చలు ఆకు అడుగు భాగాన నల్లని రంగులో ఉంటాయి. ఈ మచ్చలు తర్వాత ఆకుల కాడల మీద, కాండం, ఊడల మీద కూడా కనిపిస్తాయి. విత్తనశుద్ధి చేయని పరిస్థితుల్లో ఈ తెగులు ఎక్కువగా ఆశిస్తుంది.

నివారణ చర్యలు

క్లోరోథాలోనిల్ 400 గ్రా. లేదా టెబ్యుకొనజోల్ 200 మి.లీ. ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పొద్దుతిరుగుడులో..

ప్రస్తుతం ఈ పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వ్యవసాయ అధికారులు అందించిన వివరాలు..

సస్యరక్షణ

పొగాకు లద్దె పురుగు: పంట 30 రోజుల దశ నుంచి ఈ పురుగు ఆశిస్తుంది. ఈ పురుగు గుంపులుగా ఆకులపై పత్రహరితాన్ని గోకి తింటాయి. దీనివల్ల ఆకులు జల్లెడగా మారుతాయి. ఈ పురుగు నివారణకు నొవాల్యురాన్ 1.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా సాయంత్రం పూట విషపు ఎరను చల్లి నివారించుకోవచ్చు.

ఆకుమచ్చ తెగులు

పంట 25 రోజుల నుంచి 65-70 రోజుల వరకు ఈ తెగులు ఆశించి

నష్టం చేస్తుంది. ఈ తెగులు ఆశించడం వల్ల ముదురు గోధుమ రంగు మచ్చలు ఏర్పడుతాయి. ఆకులు మాడిపోయినట్లు అవుతాయి. ఈ తెగులు నివారణకు ప్రొపికొనజోల్ 25 శాతం ఇసి 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

epaper.ntnews.com

హైడ్రోజన్ గ్యాస్ లీకేజీని గుర్తించొచ్చు

అభివృద్ధిపరిచిన ఐఐటీ హైదరాబాద్, జోధ్‌పూర్ పరిశోధకులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ జోధ్‌పూర్ పరిశోధకులు సంయుక్తంగా హైడ్రోజన్ గ్యాస్ లీకేజీని గుర్తించే పదార్థాన్ని అభివృద్ధిపరిచారు. హైడ్రోజన్ గ్యాస్ లీక్‌వల్ల పరిశ్రమల్లో భారీ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వీటివల్ల వెలువడే కాలుష్యం.. పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాయి. హైడ్రోజన్ గ్యాస్ లీకేజీని ముందుగా గుర్తించడం పెద్ద సవాల్‌గా మారిన నేపథ్యంలో తాజా ఆవిష్కరణ ప్రాధాన్యం సంతరించుకున్నది. ఈ ఆవిష్కరణ గురించి సెన్సార్ అండ్ ఆక్చువేటర్స్ జర్నల్‌లో ఇటీవల ప్రచురితమైంది. ఈ సందర్భంగా సహ పరిశోధకులు చంద్రశేఖర్‌శర్మ మాట్లాడుతూ.. 'గ్యాస్ ఉత్పత్తి చేయడం ఒక సమస్యయితే లీకేజీని గుర్తించడం మరో ప్రధాన సమస్య. హైడ్రోజన్ గ్యాస్ లీకేజీ ప్రమాదకరమైంది. మనుషులు సైతం దీన్ని గుర్తించలేరు. ఎందుకంటే దీనికి రంగు, వాసన ఉండదు' అని వివరించారు. లీకేజీని గుర్తించే పదార్థాన్ని అభివృద్ధిపరచడంలో మహేశ్‌కుమార్, విజేంద్రసింగ్ భాటి, ఆకాశ్‌నాథని, ఆదర్శ్‌నిగమ్ పాలుపంచుకున్నారు. గత ఏడాది డిసెంబర్‌లో ఐఐటీ హైదరాబాద్‌లో ఇండియన్ నేషనల్ యంగ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ నిర్వహించిన నేషనల్ ఫ్రంటైర్స్ ఆఫ్ సైన్స్ సమావేశంలోనే.. గ్యాస్ లీకేజీని గుర్తించే పనులకు నాందిపడిందని ఐఐటీ హైదరాబాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. హైడ్రోజన్‌కు మండే స్వభావం ఉంటుందని, లీకేజీలను గుర్తించలేకపోతే మారిపోతుందని పేర్కొన్నది.

అమిత్‌షాకు శస్త్రచికిత్స

అహ్మదాబాద్: కేంద్ర హోంమంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా చిన్నపాటి శస్త్రచికిత్స చేయించుకున్నారు. వ్యక్తిగత పని మీద మంగళవారం రాత్రి గుజరాత్ వెళ్లిన అమిత్‌షా.. బుధవారం ఉదయం అహ్మదాబాద్‌లోని కేడీ దవాఖానలో వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఆయన మెడ వెనుకభాగంలోని లింఫోమాకు చిన్న శస్త్రచికిత్స చేసి తొలగించిన వైద్యులు..మధ్యాహ్నం డిశ్చార్జి చేశారని బీజేపీ వర్గాలు వెల్లడించాయి. అమిత్‌షా గురువారం తిరిగి ఢిల్లీకి చేరుకుంటారని తెలిపాయి.

పాకిస్థాన్‌లో తొలి హిందూ మహిళా పోలీస్!

ఏఎస్ఐగా పుష్పా కోహ్లి నియామకం

ఇస్లామాబాద్, సెప్టెంబర్ 4: పాకిస్థాన్ చరిత్రలో మొదటిసారిగా ఓ హిందూ యువతి పోలీస్ అధికారిణిగా నియమితులయ్యారు. సింధు రాష్ట్రంలోని నిర్వహించిన ప్రాంతీయ పోటీ పరీక్షల్లో.. హిందూ యువతి పుష్పా కోహ్లి ఉత్తీర్ణత సాధించారు. దీంతో ఆమెను సింధు పోలీస్‌స్టేషన్‌లో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ)గా నియమించారు. ఈ విషయాన్ని జియో న్యూస్ బుధవారం వెల్లడించగా.. మానవ హక్కుల కార్యకర్త కపిల్‌దేవ్ మంగళవారం ట్విట్టర్‌లో పోస్ట్‌చేశారు. గత జనవరిలో హిందూ మతానికి చెందిన పాకిస్థానీ సుమన్ పవన్ బొడాని న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆమె కూడా సింధు ప్రాంతానికే చెందినవారు కావడం విశేషం. పాకిస్థాన్‌లో దాదాపు 75 లక్షల మంది హిందువులు జీవిస్తుండగా, వీరిలో అత్యధికులు సింధు రాష్ట్రంలో నివసిస్తున్నారు.

మామ సమీపానికి..

- విజయవంతంగా విక్రమ్ ల్యాండర్ కక్ష్య కుదింపు
- నిర్దేశిత చివరి కక్ష్యలోకి చేరుకున్న వ్యోమనౌక
- శనివారం చంద్రుడి ఉపరితలంపై దిగేందుకు సిద్ధం

బెంగళూరు, సెప్టెంబర్ 4: కోట్లాది మంది భారతీయుల కలలను మోసుకెళ్తున్న చంద్రయాన్-2 వ్యోమనౌక చంద్రుడి సమీపానికి చేరింది. బుధవారం 'విక్రమ్ ల్యాండర్' చివరి కక్ష్య కుదింపు ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. ఈ ప్రక్రియతో ల్యాండర్ నిర్దేశిత చివరి కక్ష్యలోకి చేరింది. ఇక్కడి నుంచి శనివారం తెల్లవారుజామున చంద్రుడి ఉపరితలంపైకి దిగనున్నది. 'బుధవారం తెల్లవారుజామున 3:42 గంటలకు ల్యాండర్‌లోని ఇంజిన్‌ను తొమ్మిది సెకండ్లపాటు మండించి విజయవంతంగా కక్ష్యను కుదించాం. ఈ ప్రక్రియతో ల్యాండర్ చంద్రుడిపైకి దిగేందుకు కావాల్సిన కక్ష్యలోకి చేరింది' అని ఇస్రో ఒక ప్రకటనలో తెలిపింది. ఆర్బిటర్, ల్యాండర్ రెండూ సురక్షితంగా ఉన్నాయని వెల్లడించింది. ప్రస్తుతం ల్యాండర్ చంద్రుడి చుట్టూ దీర్ఘ వృత్తాకార కక్ష్యలో తిరుగుతున్నది. ఈ కక్ష్యలోని అత్యంత సమీప బిందువు ఉపరితలం నుంచి 35 కి.మీ. దూరంలో ఉండగా, గరిష్ఠ బిందువు 101 కి.మీ. దూరంలో ఉన్నది. ఈ నెల 7వ తేదీన ల్యాండర్ ఈ కక్ష్య నుంచి బయలుదేరి చంద్రుడి ఉపరితలం వైపునకు వెళ్తుంది. శనివారం తెల్లవారుజామున ఒంటిగంట నుంచి 2 గంటల మధ్య ల్యాండర్‌లోని ఇంజిన్‌ను మండించి చంద్రుడి ఉపరితలంవైపు మళ్లిస్తామని శాస్త్రవేత్తలు తెలిపారు. అరగంట ప్రయాణం అనంతరం 1:30 గంటల నుంచి 2:30 గంటల మధ్య ల్యాండర్ ఉపరితలంపై సున్నితంగా దిగుతుందన్నారు. ఆ తర్వాత ఉదయం 5:30 గంటల నుంచి 6:30 గంటల మధ్య ల్యాండర్ నుంచి ప్రజ్ఞు రోవర్ బయటికి వస్తుందని, ఉపరితలంపైకి దిగి పరిశోధనలను ప్రారంభిస్తుందని చెప్పారు. ల్యాండర్, రోవర్ కలిపి 14 రోజులపాటు (చంద్రుడిపై ఒకరోజుతో సమానం) పరిశోధనలు చేయనున్నాయి. ఆర్బిటార్ ఏడాదిపాటు కక్ష్యలోనే తిరుగుతూ తన పరిశోధనలను కొనసాగిస్తుంది.

ఏర్పాట్లు పూర్తి

విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపై దిగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు. విక్రమ్ కచ్చితంగా ఉపరితలంపై దిగుతుందని, దీంతో మన దేశం రష్యా, అమెరికా, చైనా సరసన నిలుస్తుందని ధీమా వ్యక్తంచేస్తున్నారు. అంతేకాదు.. చంద్రుడి దక్షిణ ధ్రువంపై మొదటిసారిగా ల్యాండర్‌ను దింపిన దేశంగా చరిత్ర సృష్టిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. ల్యాండర్ దిగే ప్రక్రియను బెంగళూరులోని ఇస్రో కేంద్రం నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యక్షంగా తిలకించనున్నారు. ఆయనతోపాటు దేశవ్యాప్తంగా ఎంపికచేసిన 60 మంది విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని వీక్షిస్తారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు అధికారులు వెల్లడించారు.

అంతా స్వీయ నియంత్రితం..

విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపై సున్నితంగా దిగే ప్రక్రియ సాధారణంగా హాలీవుడ్ సినిమాల్లో ఏలియన్ (గ్రహాంతరవాసుల) నౌకలు భూమిపైకి దిగినట్లు చూపించే సన్నివేశాలను పోలి ఉంటుందని ఇస్రో మాజీ చైర్మన్ జీ మాధవన్ నాయర్ అభివర్ణించారు. సినిమాల్లో ఏలియన్ నౌకలు నిర్దేశించిన ప్రాంతంపైకి చేరి నెమ్మదిగా నిటారుగా కిందికి దిగుతుంటాయని, ఇస్రో కూడా దాదాపు ఇదే సూత్రాన్ని పాటించబోతున్నదని వివరించారు. ల్యాండర్ సొంతగా ఉపరితలంపై దిగుతుందని చెప్పారు. 'ల్యాండర్ సొంతంగా పనిచేస్తుంది. మనం భూమి మీది నుంచి దానిని నియంత్రించలేం. దానిలో ఉన్న కెమెరాలు దిగాల్సిన స్థానాన్ని గుర్తిస్తాయి. ఆ తర్వాత ల్యాండర్‌లోని ఐదు రాకెట్ ఇంజిన్లను మండించి వేగాన్ని నియంత్రిస్తుంది. చివరగా లక్షిత స్థానంలో నెమ్మదిగా దిగుతుంది' అని వివరించారు. చెప్పుకోవడానికి సులభంగా కనిపించినా.. ఈ ప్రక్రియ చాలా క్లిష్టమైనదన్నారు. 'చంద్రుడిపై దిగడంలో సరికొత్త విధానాన్ని మనం ఈ ప్రపంచానికి పరిచయం చేయబోతున్నాం. ల్యాండర్ సొంతంగా తన కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు చంద్రుడి ఉపరితలం ఫొటోలను తీస్తూ, నిర్దేశిత లక్ష్యాన్ని గుర్తించి దిగబోతున్నది. గతంలో ఏ దేశమూ ఇలాంటి విధానాన్ని పాటించలేదు' అని స్పష్టం చేశారు. చంద్రయాన్-2 వందశాతం విజయవంతం అవుతుందని, చంద్రుడిపై పరిశోధనల్లో ఓ మైలురాయిగా నిలిచిపోతుందనే నమ్మకం తనకు ఉన్నదని నాయకర్ పేర్కొన్నారు.

కర్తార్‌పూర్‌పై కుదిరిన ఒప్పందం

భారత యాత్రికులు వీసా లేకుండా పర్యటించేందుకు భారత్-పాక్ అంగీకారం

న్యూఢిల్లీ/లాహోర్, సెప్టెంబర్ 4: కర్తార్‌పూర్ కారిడార్‌పై భారత్, పాకిస్థాన్ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. భారత యాత్రికులు వీసా లేకుండా పర్యటించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి. పంజాబ్‌లోని అమృత్‌సర్ జిల్లా సరిహద్దు ప్రాంతమైన అట్టారి వద్ద బుధవారం భారత్, పాక్ అధికారులు సమావేశమయ్యారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ను భారత ప్రభుత్వం రద్దు చేయడంతోపాటు ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించిన నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న సంగతి తెలిసిందే.

సర్వీసుచార్జి ప్రతిపాదనల తిరస్కరణ

కర్తార్‌పూర్ కారిడార్ నిర్మాణంపై ఈ ప్రభావం పడలేదు. ఆగస్టు 30న ఇరుదేశాల అధికారులు సమావేశమై ప్రాజెక్టుకు సంబంధించిన పలు సాంకేతిక అంశాలపై చర్చించారు. తాజాగా బుధవారం మరోసారి భేటీ అయ్యారు. పాక్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మహ్మద్ ఫైజల్ ఆ దేశ బృందానికి నేతృత్వం వహించగా, భారత బృందానికి కేంద్ర హోంశాఖ వ్యవహారాల సంయుక్త కార్యదర్శి ఎస్‌సీఎల్ దాస్ నేతృత్వం వహించారు. కారిడార్‌కు సంబంధించిన ముసాయిదా ఒప్పందంపై చర్చించేందుకు స్వల్ప సమావేశం జరిగినట్లు ఆయన తెలిపారు. భారత యాత్రికులపై సర్వీసు చార్జి విధించాలన్న పాక్ ప్రతిపాదనను తాము తిరస్కరించినట్లు ఆయన వెల్లడించారు. భారత రాయబార కార్యాలయ అధికారులు, ప్రోటోకాల్ అధికారులు గురుద్వారాను సందర్శించేందుకు పాక్ సుముఖత వ్యక్తం చేయలేదన్నారు. భారత యాత్రికులు ఎలాంటి వీసా లేకుండా కార్తార్‌పూర్ గురుద్వారాను సందర్శించేందుకు ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరినట్లు దాస్ చెప్పారు. తాజా ఒప్పందం ప్రకారం ప్రతి రోజు 5000 మంది భారత యాత్రికులను అనుమతిస్తామని, ప్రత్యేక రోజుల్లో ఈ సంఖ్యను పెంచుతామని పాక్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మహ్మద్ ఫైజల్ లాహోర్‌లో అన్నారు. తమ వైపు 90 శాతం పనులు పూర్తయ్యాయని, వచ్చే నెలలో పాక్ వైపు కారిడార్‌ను ప్రారంభిస్తామని ఆయన చెప్పారు. సిక్కుల గురువైన గురు నానక్ 550వ జయంతి ఉత్సవాలు నవంబర్‌లో జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో పాక్ స్టాన్ కర్తార్‌పూర్‌లోని దర్బార్ సాహెబ్ గురుద్వారా, పంజాబ్ గురుదాస్‌పూర్ జిల్లాలోని డేరా బాబా నానక్ గురుద్వారాలను కలుపుతూ ప్రత్యేక కారిడార్‌ను భారత్,పాక్ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే.

13 వరకు ఈడీ కస్టడీకి డీకే

- ఢిల్లీ ప్రత్యేక న్యాయస్థానం ఆదేశం
- 14 రోజుల కస్టడీ కోరిన ఈడీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4: హవాలా లావాదేవీల కేసులో అరెస్టయిన కర్ణాటక కాంగ్రెస్ నాయకుడు డీకే శివకుమార్‌కు ఈ నెల 13వ తేదీ వరకు పోలీస్ కస్టడీ విధిస్తూ ఢిల్లీలోని ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి అజయ్‌కుమార్ కుహర్ ఆదేశాలు జారీ చేశారు. అంతకుముందు శివకుమార్‌ను విచారించేందుకు 14 రోజులు తమ కస్టడీకి అప్పగించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పిటిషన్ దాఖలు చేసింది. మంగళవారం రాత్రి శివకుమార్‌ను అరెస్ట్‌చేసిన ఈడీ అధికారులు బుధవారం ఢిల్లీలోని ప్రత్యేక కోర్టులో ఆయనను హాజరుపరిచారు. తమ కస్టడీకి శివకుమార్‌ను అప్పగించాలన్న ఈడీ పిటిషన్‌ను ఆయన తరపు న్యాయవాదులు అభిషేక్ సింఘ్వి, దయాన్ కృష్ణన్ వ్యతిరేకించారు. తమ క్లయింట్ విచారణకు హాజరవుతున్నారని, గైర్హాజరు కాలేదని గుర్తుచేశారు. ఇప్పటికే 33 గంటల పాటు విచారించారని, బుధవారం భోజనం పెట్టకుండా ఈడీ.. వేధింపులకు గురిచేస్తున్నదని సింఘ్వి ఆరోపించారు.

దాటవేత ధోరణిలో శివకుమార్: ఈడీ

తమ విచారణలో శివకుమార్ దాటవేత ధోరణిని ప్రదర్శిస్తూ, సహకరించడం లేదని ఈడీ ఆరోపించింది. అక్రమ లావాదేవీలు, అక్రమ ఆస్తుల గుట్టు రట్టుచేసే పలు పత్రాలకు సంబంధించి ఆయనను విచారించాలని ఈడీ తరపున విచారణకు హాజరైన అదనపు సోలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్, న్యాయవాది ఎన్‌కే మట్టా వాదించారు. విచారణను శివకుమార్ తప్పుదోవ పట్టిస్తున్నారని, అతడి వద్ద గల డబ్బుకు ఆధారాలు, హవాలా లావాదేవీల వివరాలను వెల్లడించాల్సి ఉన్నదన్నారు. ఐటీ శాఖ జప్తు చేసిన నగదుపై ఆయన నోరు విప్పడం లేదని అన్నారు. మరోవైపు శివకుమార్‌కు బెయిల్ మంజూరు చేయాలని ఆయన తరపు న్యాయవాదులు సింఘ్వీ, దయాన్ కృష్ణన్ పిటిషన్ దాఖలు చేశారు.

కక్ష సాధింపుకు మరో ఉదాహరణ: రాహుల్

శివకుమార్ అరెస్ట్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రాజకీయ కక్ష సాధింపులకు మరో ఉదాహరణ అని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ ఆరోపించారు. దర్యాప్తు సంస్థల ద్వారా, తమ అనుకూల మీడియా ద్వారా కొంత మంది వ్యక్తులను కేంద్రంలోని మోదీ సర్కార్ లక్ష్యంగా చేసుకుంటున్నదని ట్వీట్ చేశారు. కేంద్రం చేపడుతున్న 'రాజకీయ వేధింపుల'కు భయపడబోమని కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీశ్ తివారీ మీడియాతో అన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ-ఎన్డీయే ప్రలోభాల నుంచి గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కాపాడినందుకే శివకుమార్‌ను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. శివకుమార్ అరెస్టును నిరసిస్తూ ఢిల్లీలోని యువజన కాంగ్రెస్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు.

పాడుతూనే ప్రాణాలొదిలిన గాయకుడు బజ్జోడి

మంగళూరు: కర్ణాటకకు చెందిన ప్రముఖ కొంకణి గాయకుడు జెర్రీ బజ్జోడి (51) ఒక కార్యక్రమంలో పాటపాడుతూ గుండెపోటుతో కన్నుమూశారు. మంగళూరులోని బిజైలో మంగళవారం రాత్రి గణేశ్ ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన పాటపాడుతూ వేదికపై కుప్పకూలారు. దవాఖానకు తరలించగా చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. గుండెపోటుతో మరణించినట్లు పేర్కొన్నారు. అనంతనాగ్ నటించిన కన్నడ సూపర్‌హిట్ 'చందన గొంబి' సినిమాలోని పాటను పాడుతూ వేదికపై జెర్రీ కుప్పకూలిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. ఆయన చాలా అలసిపోయినట్లు కనిపించారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మంగళూరుతోపాటు ముంబైలో సంగీత కచేరీలు నిర్వహించే జెర్రీ బజ్జోడి 50కి పైగా పాటలకు స్వరకల్పన చేశారు. కొంకణి మ్యూజిక్ అల్బమ్‌లను రూపొందించారు. రోస్‌మేరీ, అమోయిపోనా వంటివి ఆయన హిట్ లిస్ట్‌లో ప్రముఖమైనవి.

ఆయుష్ మెడికల్ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆయుష్ వైద్య విద్య సీట్ల భర్తీకి శుక్ర, శనివారాల్లో (ఈ నెల 6, 7 తేదీల్లో) వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆయుష్ కళాశాలల్లో ఆయుర్వేదం (బీఏఎంఎస్), హోమియోపతి (బీహెచ్ఎంఎస్), యునానీ (బీయూఎంఎస్), నేచురోపతి యోగా (బీఎన్‌వైసీ) కోర్సుల్లో క్యాటగిరీ ఏ సీట్ల భర్తీకి రెండురోజులు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసుకున్న అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఇదివరకే పూర్తిచేశారు. తుది మెరిట్ జాబితాలోని అర్హులైన అభ్యర్థులు ఆ రెండు రోజులు ప్రాధాన్యక్రమంలో కళాశాలలవారీగా వెబ్‌ఆప్షన్లు నమోదుచేసుకోవాల్సి ఉంటుంది. ఆలిండియా కోటాలో సీటు పొందిన అభ్యర్థులు ఈ కౌన్సెలింగ్‌కు అనర్హులు. క్యాప్, ఎన్సీసీ అభ్యర్థుల మెరిట్ జాబితాతోపాటు పీడబ్ల్యూడీ అభ్యర్థుల చెక్‌లిస్ట్‌ను యూనివర్సిటీ బుధవారం విడుదల చేసింది. వివరాలకు www.knruhs.in, www.knruhs. telangana.gov.in పరిశీలించాలని కేఎన్ఆర్‌యూహెచ్ఎస్ సూచించింది.

బలగాలతో ఘర్షణ..

గాయపడిన కశ్మీరీ విద్యార్థి మృతి

- నెల రోజులుగా దవాఖానలో చికిత్స పొందుతూ మరణం
- సైనికులు ప్రయోగించిన పెల్లెట్ తగిలి చనిపోయాడని స్థానికుల ఆరోపణ

శ్రీనగర్, సెప్టెంబర్ 4: జమ్ముకశ్మీర్‌లో గత నెలలో భద్రతా బలగాలకు, ఆందోళనకారులకు మధ్య జరిగిన ఘర్షణలో గాయపడిన యువకుడు శ్రీనగర్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతూ మరణించాడు. దీంతో హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు శ్రీనగర్‌లోని పలు ప్రాంతాల్లో పగటి పూట ఆంక్షలను మళ్లీ విధించారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని గత నెల 5న కేంద్రం రద్దు చేసిన విషయం తెలిసిందే. మరుసటి రోజు నగరంలోని శివారు ప్రాంతంలో కొందరు ఆందోళనకారులు నిరసన చేపట్టారు. అందులో ఉన్న అసర్ అహ్మద్ ఖాన్ (18)కు భద్రతా బలగాలతో జరిగిన ఘర్షణలో గాయాలయ్యాయి. దీంతో అతడు సౌరా ప్రాంతంలోని షేర్-ఏ-కశ్మీర్ దవాఖానలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మరణించారు. మరోవైపు ఆందోళనకారులను చెదరగొట్టడానికి కాల్పులు జరుపడంతోనే అతడికి తీవ్రగాయాలయ్యాయని వస్తున్న ఆరోపణలను పోలీసులు తోసిపుచ్చారు. అతడి శరీరంపై ఎలాంటి బుల్లెట్ గాయాలు లేవని చెప్పారు. ఏదో ఒక వస్తువు గట్టిగా తగలడంతోనే అతడికి గాయాలయ్యాయని తెలిపారు. ఆందోళనకారులను చెదరగొట్టడానికి బలగాలు బాష్పవాయువు గోళాలను ప్రయోగించడంతో అందులో ఒకటి అసర్‌కు తగిలిందని, దీంతో అతడు గాయపడ్డాడని నిరసనకారులు చెబుతున్నారు. అడిషనల్ డీజీపీ మునీర్ ఖాన్ మాట్లాడుతూ దవాఖానలో చికిత్స పొందిన అసర్ తొలుత కొద్దిగా కోలుకున్నాడని, కానీ బుధవారం పరిస్థితి విషమించి తెల్లవారుజామున మరణించాడని చెప్పారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నదని తెలిపారు. సైన్యానికి చెందిన లెఫ్టినెంట జనరల్ దిల్లాన్ బుధవారం విలేకరులతో మాట్లాడుతూ పెల్లెట్ తగలడంతోనే అసర్ మరణించాడన్న ఆరోపణలను తోసిపుచ్చారు. రాళ్లు తగలడంతోనే అతడు మరణించి ఉండొచ్చని చెప్పారు. కాగా కొందరు వ్యక్తులు చెబుతున్న సమాచారం ప్రకారం.. ఆర్టికల్ 370ని రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆగస్టు 6న ఆందోళనకారులు నిరసనకు దిగారు. వారిని చెదరగొట్టే క్రమంలో భద్రతా బలగాలు పెల్లెట్ గన్స్‌ను ప్రయోగించాయి. దీంతో నిరసనకారులు బలగాలపై రాళ్లురువ్వారు. ఈ క్రమంలో అసర్ కంటికి పెల్లెట్ తగిలి గాయమైంది. షేర్-ఏ-కశ్మీర్ దవాఖానకు తరలించగా చికిత్సపొందుతూ మరణించాడు. అసర్ 11వ తరగతి చదువుతున్నాడు. అతడి అంత్యక్రియలు ముగిశాయి.

అంతర్జాతీయ వాణిజ్య సదస్సుకు శ్రీనుబాబు

కేంద్ర మంత్రి నేతృత్వంలో గ్రీస్‌కు భారత బృందం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇటీవల ఫ్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు అందుకున్న పల్సస్ సీఈవో డాక్టర్ గేదెల శ్రీనుబాబుకు మరో అద్భుత అవకాశం లభించింది. గ్రీస్‌లో జరిగే అంతర్జాతీయ సదస్సుకు వెళ్లే భారత బృందంలో సభ్యునిగా ఎంపికయ్యారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి, పౌరవిమానయానశాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పురి నేతృత్వంలో గ్రీస్ వెళ్లనున్నారు. విదేశీ పెట్టుబడులు, పరిశ్రమలను దేశంలోకి రప్పించేందుకు ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ప్రపంచ నలుమూలల నుంచి 3 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉన్నట్టు నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. మన దేశ వాణిజ్య, సాంస్కృతిక, చారిత్రక గొప్పతనాన్ని వివరించేందుకు కేంద్ర మంత్రి అధ్వర్యంలో అధికారులు, వాణిజ్య ప్రముఖులు, బాలీవుడ్ సెలబ్రిటీలతో కూడిన బృందం సదస్సుకు హాజరుకానున్నది.

ప్రధాన ఆలయాల్లో ఆన్‌లైన్ సేవలు

- కొత్తగా నాలుగుచోట్ల సేవలకు యాప్ ప్రారంభం
- ఆలయ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు
- దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

బుధవారం బొగ్గులకుంటలోని దేవాదాయశాఖ కార్యాలయంలో కొత్తగా నాలుగు ఆలయాల్లో టీయాప్‌ఫోలియో సేవలను ప్రారంభిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాల్లో భక్తుల సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని, ఇందుకోసం ప్రధాన ఆలయాల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తెచ్చామని అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖల మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. బొగ్గులకుంటలోని దేవాదాయశాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కొత్తగా మరో నాలుగు ప్రధాన ఆలయాల్లో ఆన్‌లైన్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆలయాల్లో రోజురోజుకు భక్తుల సంఖ్య పెరుగుతున్నదని, ఆలయాలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తొలివిడతలో యాదగిరిగుట్ట, వేములవాడ, భద్రాచలం, బాసర, మహంకాళి, బల్కంపేట, కర్మన్‌ఘాట్ ఆలయాల్లో ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు. దీంతో మొత్తం 11 ప్రధాన ఆలయాల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చాయని వివరించారు. తాజాగా కొండగట్టు ఆంజనేయస్వామి, ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి, వరంగల్ భద్రకాళి, జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి ఆలయాల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. టీయాప్‌ఫోలియో(T APP FOLIO) మొబైల్ యాప్, మీ సేవ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా సుప్రభాతం, అభిషేకం, అర్చన, వ్రతాలు, హోమాలు, వాహన సేవలు, దర్శనం, గదుల బుకింగ్, ఇతర సేవలను పొందవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లోనే విరాళాలు చెల్లించవచ్చని, ఆన్‌లైన్‌లో సేవలు అందుబాటులోకి తేవడం వల్ల భక్తుల విలువైన సమయం ఆదా ఆవుతుందని, పారదర్శకతతోపాటు దళారుల ప్రమేయం లేకుండానే సులభ దర్శనంతోపాటు ఇతర సేవలు పొందవచ్చిన పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్, అదనపు కమిషనర్ శ్రీనివాసరావు, సంబంధిత ఆలయ ఈవోలు సిబ్బంది పాల్గొన్నారు.

వేములవాడ గుడి చెరువులోకి కాళేశ్వరం జలాలు

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆలయాలను అభివృద్ధి చేయడంతోపాటు ఆలయ ఉద్యోగులు, అర్చకుల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తున్నారని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. యాదాద్రి వేములవాడ ఆలయాల అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. వేములవాడ గుడి చెరువు అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, కాళేశ్వరం జలాలను మిడ్‌మానేరు ద్వారా గుడి చెరువులోకి గురువారం వదులుతామని పేర్కొన్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ప్రసాదాన్ని కొరియర్ ద్వారా భక్తులు కోరుకున్న చోటుకు పంపుతామని, గురువారం నుంచి కొరియర్ ద్వారా ప్రసాదాన్ని పంపించే సేవలను భక్తులకు అందుబాటులోకి రానున్నట్టు వెల్లడించారు.

దేవుళ్ల పేరిట పట్టాలు

ఆలయ భూముల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. సమగ్ర భూసర్వేలో భాగంగా ఆలయ భూరికార్డుల ప్రక్షాళన చేపట్టామని పేర్కొన్నారు. కబ్జాకు గురైన కొన్ని భూములను గుర్తించి ఆధీనంలోకి తీసుకున్నట్టు తెలిపారు. మొత్తం 82 ఎకరాల ఆలయ భూములు ఉన్నట్టు ఇప్పటివరకు గుర్తించామని, మరికొన్ని ఆలయ భూముల రికార్డుల ప్రక్షాళన కొనసాగుతుందని వివరించారు. సీసీఎల్‌ఏ సహకారంతో ఆలయ భూముల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నట్టు చెప్పారు. భూ రికార్డుల వివరాలను ఆన్‌లైన్ చేసి దేవుడి పేరుతో పట్టాలు ఇవ్వడంతో, భవిష్యత్‌లో వాటిని ఇతరులు మార్చుకునే అవకాశం ఉండబోదని స్పష్టంచేశారు. దీ

'ఆర్‌డిఎక్స్‌లవ్' చిత్రంలో పాయల్‌రాజ్‌పుత్

డిస్కోరాజా చిత్రంలో రవితేజ

డిస్కోరాజా హంగామా

రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'డిస్కోరాజా'. వి.ఐ.ఆనంద్ దర్శకుడు. పాయల్‌రాజ్‌పుత్, నభానటేష్, తాన్యాహోప్ కథానాయికలు. రజిని తాళ్లూరి నిర్మాత. డిసెంబర్ 20న విడుదలకానుంది. వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఇటీవల ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'హైదరాబాద్, ఢిల్లీలోని విభిన్నమైన లొకేషన్లలో చిత్రీకరణ జరిపాం. గ్రాఫిక్స్‌కు పెద్దపీట వేసి రూపొందిస్తున్నాం. సాంకేతికంగా ఉన్నతంగా ఉంటుందీ చిత్రం' అని అన్నారు. 'సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రమిది. రవితేజ పాత్ర చిత్రణ నవ్యమైన పంథాలో ఉంటుంది. మాస్, క్లాస్ అంశాల కలబోతగా మెప్పిస్తుంది. డిస్కోరాజా చేసే హంగామా చక్కటి వినోదాన్ని పండిస్తుంది' అని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కార్తీక్ ఘట్టమనేని, సంగీతం: తమన్, సంభాషణలు: అబ్బూరి రవి, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వి.ఐ.ఆనంద్.

తల్లి శ్రీదేవి మైనపు విగ్రహాన్ని తదేకంగా వీక్షిస్తున్న తనయ జాన్వీ

ఘన విజయాలకు ప్రతీకగా

దివంగత నటి శ్రీదేవి మైనపు విగ్రహం సింగపూర్‌లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో కొలువుదీరింది. బాలీవుడ్ చిత్రం 'మిస్టర్ ఇండియా'లోని 'హవా హవాయి' లుక్ ఆధారంగా తీర్చిదిద్దిన ఈ మైనపు విగ్రహాన్ని శ్రీదేవి భర్త బోనీకపూర్, కుమార్తెలు జాన్వీ, ఖుషీ ఆవిష్కరించారు. బంగారు వర్ణ శోభితంతో చిరునవ్వులు చిందిస్తున్నట్లుగా కనిపిస్తున్న శ్రీదేవి మైనపు విగ్రహం అభిమానుల్ని ఆకట్టుకుంటున్నది. ఈ సందర్భంగా 'మరణానంతరం శ్రీదేవి పట్ల అభిమానులు చూపుతున్న ప్రేమ నన్ను, నా కుటుంబాన్ని అమితంగా ఆనందింపజేస్తున్నది. అజరామరమైన నటనతో పాటు తాను పోషించిన పాత్రల రూపంలో శ్రీదేవి మన మధ్య ఎప్పటికీ జీవించి ఉంటుంది. టుస్సాడ్స్ మ్యూజియంలో నెలకొల్పిన ఈ మైనపు విగ్రహం ఆమె సాధించిన ఘన విజయాలకు అద్భుతమైన ప్రతీకగా స్మృతిపథంలో నిలిచిపోతుంది' అని బోనీకపూర్ ట్విట్టర్ ద్వారా కృతజ్ఞతలు తెలిపారు.

చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తొచ్చాయి

శ్రీనివాసరెడ్డి, వినాయక్,శ్రీనివాస్

ఇషారెబ్బా, సత్యదేవ్ జంటగా నటిస్తున్న చిత్రం 'రాగల 24 గంటల్లో'. శ్రీనివాసరెడ్డి దర్శకుడు. శ్రీనివాస్ కానూరి నిర్మిస్తున్నారు. వినాయకచవితిని పురస్కరించుకొని సోమవారం ఈ చిత్ర టైటిల్ మోషన్ పోస్టర్‌ను దర్శకుడు వి.వి.వినాయక్ విడుదలచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'టైటిల్ వినగానే చిన్నప్పుడు రేడియోలో విన్న వాయిస్, ఆ జ్ఞాపకాలు గుర్తొచ్చాయి. శ్రీనివాసరెడ్డి ప్రతిభావంతుడైన దర్శకుడు. మద్రాస్‌లో ఇమడలేక ఇండస్ట్రీని వదలివేయాలని అనుకున్న సమయంలో నాలో నమ్మకాన్ని నింపిన మంచి మిత్రుడు. ఈ సినిమా అతడికి చక్కటి పేరు తీసుకురావాలి' అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'విభిన్న కథాంశంతో తెరకెక్కుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది. 24 గంటల్లో ఏం జరిగిందన్నది థ్రిల్‌ను పంచుతుంది. స్క్రీన్‌ప్లే ప్రధానంగా సినిమా సాగుతుంది' అని తెలిపారు. నిర్మాతగా ఇదే తన మొదటి చిత్రమని, ప్రేక్షకుల్ని మెప్పిస్తుందనే నమ్మకముందని శ్రీనివాస్ కానూరి పేర్కొన్నారు. శ్రీరామ్, గణేష్ రాఘవేంద్ర ముఖ్య పాత్రల్ని పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అంజి.

జేవీఆర్, గీతాంజలి, ఆర్.కె.గౌడ్, గురురాజ్

మహావృక్షంగా ఎదగాలి

'తెలంగాణ ఫిలింఛాంబర్ కేవలం తెలంగాణ ప్రాంతం వారికోసమే ఏర్పాటైందనే అపోహలున్నాయి. ప్రాంతీయ భేదాలతో సంబంధం లేకుండా అన్ని రాష్ట్రాల వారు ఇందులో సభ్యులుగా చేరవచ్చు' అని అన్నారు తెలంగాణ ఫిలింఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్. ఆయన ఆధ్వర్యంలో తెలంగాణ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్(టీ మా) బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా జేవీఆర్, ఉపాధ్యక్షులుగా గీతాంజలి, బాలాజీ, దిలీప్ రాథోడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ 'చిరుబీజంగా మొదలైన ఈ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ మహావృక్షంగా ఎదగాలి. తెలంగాణ ఫిలింఛాంబర్ ప్రారంభమై ఆరేళ్లవుతుంది. ఈ ప్రయాణంలో చిన్న సినిమాలకు ఎదురైన అనేక సమస్యల్ని పరిష్కరించాం. ప్రత్యేకంగా ఛాంబర్‌కోసం భవనాన్ని కట్టించడమే కాకుండా పేదకళాకారులకు ఇళ్లను నిర్మించే ఆలోచనలో ఉన్నాం. ప్రభుత్వం పేదకళాకారులకు సహాయపడుతుందనే నమ్మకం ఉంది' అని తెలిపారు. తెలంగాణ కోసం ప్రత్యేక ఫిలింఛాంబర్‌ను ఏర్పాటుచేయాలని చాలా మంది ప్రయత్నించినా ఆర్.కె.గౌడ్ మాత్రమే ఈ స్వప్నాన్ని నిజం చేశారని గురురాజ్ చెప్పారు. కళాకారులకు అవకాశాలు వచ్చేలా కృషిచేస్తూనే తమ బాధ్యతల్ని సమర్థవంతంగా నిర్వర్తిస్తామని జేవీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో స్నిగ్ధ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేను భయపడ్డాను

శ్రీనివాస్‌రెడ్డి

'ఆద్యంతం ఉత్కంఠను పంచుతూ భయపెట్టే హారర్ చిత్రమిది. నేను నటించిన చిత్రమే అయినా సినిమా చూస్తున్నప్పుడు భయపడ్డాను' అని అన్నారు తనిష్క్‌రెడ్డి. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'దర్పణం'. రామకృష్ణ వెంప దర్శకుడు. క్రాంతి కిరణ్ వెల్లంకి నిర్మించారు. అలెక్సియస్, శుభాంగిపంత్ కథానాయికలు. ఈ నెల 6న ఈ చిత్రం విడుదలకానుంది. బుధవారం హైదరాబాద్‌లో తనిష్క్‌రెడ్డి పాత్రికేయులతో ముచ్చటిస్తూ ''సకలకళావల్లభుడు' తర్వాత నేను హీరోగా నటించిన చిత్రమిది. మర్డర్ మిస్టరీ కథాంశానికి హారర్ క్రైమ్ థ్రిల్లర్ అంశాలను మేళవించి రూపొందించాం. దర్శకుడు రామకృష్ణ ఓ కాపీషాప్‌లో కలిసి విరామ సన్నివేశాల గురించి చెప్పారు. ఆ సీన్ నచ్చడంతో పూర్తి కథ వినకుండానే సినిమా అంగీకరించాను. ఇందులో అల్లరి యువకుడిగా కనిపిస్తాను. తన స్నేహితులతో కలిసి దొంగతనాలు చేస్తూ జీవించే అతడికి ఓ భవంతిలో ఎలాంటి అనూహ్య పరిణామాలు ఎదురయ్యాయి?ఆ భవంతి రహస్యాన్ని అతడు ఎలా ఛేదించాడన్నది ఉత్కంఠను పంచుతుంది. ద్వితీయార్థంతో పాటు ప్రీక్లైమాక్స్‌లో వచ్చే మలుపు ఆసక్తిని పంచుతుంది. దయ్యం కామెడీ చేసే సన్నివేశాలు ఇందులో కనిపించవు. సీరియస్‌గా కథా గమనం సాగుతుంది. సిద్దార్థ్ సంగీతం, సతీష్ ముత్యాల ఛాయాగ్రహణం సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తాయి. హైదరాబాద్, వైజాగ్, అరకులో సినిమాను చిత్రీకరించాం. తక్కువ బడ్జెట్, పరిమిత పాత్రలతో చక్కటి అవుట్‌పుట్‌తో కూడిన మంచి సినిమా తీయవచ్చని ఈ సినిమా నిరూపిస్తుంది. హీరోగా మూడు కొత్త చిత్రాల్ని అంగీకరించాను' అని తెలిపారు.

నచ్చకపోతే డబ్బులు తిరిగిస్తాం..

అరవింద్, శుభాంగిపంత్

అరవింద్‌రెడ్డి, అజిత్, శుభాంగిపంత్, దీక్షితా పార్వతి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'నీకోసం'. అవినాష్ కోకటి దర్శకుడు. అల్లూరమ్మ(భారతి) నిర్మిస్తున్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక జరిగింది. హీరో అరవింద్ మాట్లాడుతూ 'చిన్న సినిమా అనే ఆలోచనను మర్చిపోయి ఇందులోని కథ, పాత్రలతో ప్రతి ఒక్కరూ సహానుభూతి చెందుతారు. మంచి సినిమా చూశామనే సంతృప్తిని పంచుతుంది. సినిమా నచ్చనివారికి టికెట్ డబ్బులు తిరిగి చెల్లిస్తాం' అని అన్నారు. ప్రేమను కొత్త కోణంలో నిర్వచించే చిత్రమిదని శుభాంగిపంత్ చెప్పింది. ప్రాణంగా ప్రేమించిన వారు కళ్లముందు లేకపోతే ఆ వేదన ఎలా ఉంటుంది? వారి జ్ఞాపకాలు ప్రేమను ఏ విధంగా పెంచుతాయనే ఇతివృత్తంతో ఈ సినిమాను రూపొందించామని దర్శకుడు పేర్కొన్నారు. దిగ్గజ గాయకుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం పాడిన పాట ఈ సినిమాకు ప్రధానాకర్షణగా నిలుస్తుందని, అర్థవంతమైన బాణీలు, సాహిత్యపు విలువలతో సినిమాలోని పాటలన్నీ బాగున్నాయని ఆయన ప్రశంసించడం ఆనందంగా ఉందని సంగీత దర్శకుడు శ్రీనివాస్‌శర్మ చెప్పారు.

ఆండ్రియా

సాంకేతిక మాయలో..

అంజలి, ఆండ్రియా, వసంత్ ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'తారామణి'. రామ్ దర్శకుడు. డి.వి.వెంకటేష్, ఉదయ్‌హర్ష అదే పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ నెల 6న విడుదలకానుంది. ఇటీవల హైదరాబాద్‌లో చిత్ర ప్రీరిలీజ్ వేడుక జరిగింది. నిర్మాత డి.వి.వెంకటేష్ మాట్లాడుతూ 'తమిళంలో మంచి విజయాన్ని సాధించిన చిత్రమిది. చక్కటి నాణ్యతతో డబ్బింగ్ చేశాం. ఇదొక ముక్కోణపు ప్రేమ కథ. ఎమోషన్‌తో పాటు మంచి వినోదం ఉంటుంది. ప్రస్తుతం సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యల నేపథ్యంలో కథ నడుస్తుంది. సాంకేతిక మాయలో పడి జీవితాన్ని ఎలా సంక్లిష్టం చేసుకుంటున్నారనే అంశాన్ని చూపించాం' అన్నారు. 'నా మనసుకు నచ్చిన సినిమా ఇది. తెలుగు ప్రేక్షకులు కూడా ఆదరిస్తారనే విశ్వాసం ఉంది' అని ఆండ్రియా చెప్పింది.

జెర్సీ రీమేక్‌లో

రష్మిక మందన్న

దక్షిణాదిన వరుస విజయాలతో అచిరకాలంలోనే అగ్రనాయికగా పేరుతెచ్చుకున్నది రష్మిక మందన్న. గ్లామర్‌తళుకులు, చక్కటి అభినయపరిమతో రాణిస్తున్న ఈ సొగసరి తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో స్టార్ హీరోలతో సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నది. తాజాగా రష్మిక మందన్న బాలీవుడ్‌లో అరంగేట్రం చేయబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. నాని హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందిన 'జెర్సీ' చిత్రం విమర్శకుల ప్రశంసలతో పాటు కమర్షియల్‌గా పెద్ద విజయాన్ని సాధించింది. తండ్రీకొడుకుల అనుబంధానికి క్రికెట్ నేపథ్యాన్ని జోడించి రూపొందించిన ఈ చిత్రాన్ని హిందీలో రీమేక్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ రీమేక్‌లో షాహిద్‌కపూర్ హీరోగా నటించబోతున్నట్లు తెలిసింది. అతనికి జోడీగా రష్మిక మందన్నను కథానాయికగా తీసుకోనున్నట్లు చెబుతున్నారు. నటనకు ప్రాముఖమున్న పాత్ర కావడంతో బాలీవుడ్ ఎంట్రీకి ఈ సినిమా సరైందనే యోచనలో రష్మిక మందన్న ఉన్నట్లు తెలిసింది. మాతృకకు దర్శకత్వం వహించిన గౌతమ్ తిన్ననూరి హిందీ రీమేక్‌ను తెరకెక్కించే బాధ్యతల్ని చేపట్టనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. త్వరలో ఈ రీమేక్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడనున్నట్లు సమాచారం. ప్రస్తుతం రష్మిక మందన్న తెలుగులో 'సరిలేరు నీకెవ్వరు', 'భీష్మ' చిత్రాల్లో హీరోయిన్‌గా నటిస్తున్నది.

విజయ్‌తో చేయాలనుకున్నా

శ్రీపవార్

'రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఇది. రోజు రెండు గంటలు మాత్రమే ప్రేమించుకునే ఓ జంట కథతో ఆహ్లాద భరితంగా సాగుతుంది' అని అన్నారు శ్రీపవార్. ఆయన కథానాయకుడిగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం '2 అవర్స్ లవ్'. శ్రీనిక క్రియేటివ్ వర్క్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న విడుదలకానుంది. బుధవారం హైదరాబాద్‌లో శ్రీపవార్ మాట్లాడుతూ 'నిత్యజీవితంలో నేను చూసిన సంఘటనలతో ఏడాది పాటు శ్రమించి ఈ కథ రాసుకున్నాను. 'పెళ్లిచూపులు' సినిమాలో విజయ్ దేవరకొండ నటన నచ్చి అతడితో నా దర్శకత్వంలో ఈ సినిమా చేయాలనుకున్నాను. కానీ విజయ్ బిజీగా మారడంతో నేనే హీరోగా నటించాను. సాయంత్రం నాలుగు గంటల నుండి ఆరు గంటల వరకు మాత్రమే ఓ జంట ప్రేమించుకోవడానికి కారణమేమిటన్నది ఆకట్టుకుంటుంది. ప్రేమ, వినోదం, భావోద్వేగాలతో సరదాగా సాగుతూనే ఉత్కంఠను పంచుతుంది. కథ, కథనాల్లోని కొత్తదనం నచ్చి వీవీఆర్ సినిమాస్ సంస్థ ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి ముందుకువచ్చింది. స్వతహాగా రచన, దర్శకత్వం అంటే నాకు ఇష్టమే. దర్శకుడు సుకుమార్ సినిమాల్ని ఇష్టపడతాను. ఆయన ఆలోచన విధానం, సన్నివేశాల్ని మలిచే తీరు విభిన్నంగా ఉంటాయి. నా స్వస్థలం హైదరాబాద్. ఐదేళ్ల పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశాను. సినిమాలపై ఇష్టంతో జాబ్ వదులుకున్నాను. తదుపరి సినిమా కోసం కథలు సిద్ధం చేసుకున్నాను' అని అన్నారు.

మన్మథరాజా

ఆకర్షిక, రాజ్, నస్రీన్

రాజ్ సూర్యన్, ఆకర్షిక, నస్రీన్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'నా పేరు రాజా'. 'ఈడో రకం డెఫినెట్లి డిఫరెంట్' ఉపశీర్షిక. అశ్విన్ కృష్ణ దర్శకుడు. రాజ్ సూర్యన్, ప్రభాకర్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాతలు మాట్లాడుతూ 'యాక్షన్ థ్రిల్లర్ కథాంశంతో రూపొందుతున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. రాజా సూర్యన్ మూడు విభిన్నమైన పాత్రల్లో నటిస్తున్నారు. రాజా ఎవరు?అతడి నేపథ్యమేమిటన్నది ఆసక్తిని పంచుతుంది. తెలంగాణ, ఆంధ్రా, కేరళ, కర్ణాటకలలో 65 రోజుల పాటు చిత్రీకరణ జరిపాం. 'రాజా రాజా మన్మథరాజా' అనే గీతాన్ని డ్యాన్స్‌మాస్టర్ నగేష్ సారథ్యంలో హాలీవుడ్ శైలిలో తెరకెక్కించాం. సాహితి సాహిత్యాన్ని అందించిన ఈ గీతాన్ని మోహనా భోగరాజు ఆలపించారు. అక్టోబర్‌లో ఆడియోను, నవంబర్‌లో సినిమాను విడుదలచేస్తాం' అని తెలిపారు. ప్రభుసూర్య, ఆయుశ్రీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎల్విన్ జాషువా, సినిమాటోగ్రఫీ:ఎ.వెంకట్.